Pubilshed from Visakapatnam

PRGI NO : APTEL/25/1888

ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily


www.prajabhoomi.com



విశాఖపట్నం VISAKAPATNAM | సంపుటి : 02 | సంచిక : 10 | మంగళవారం | నవంబర్ 17, 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి | పేజీలు : 12 | వెల : 3 రూ

Vol.No : 02 | Issue No : 10 | Tuesday | 17 November 2026 | Editor : Ankireddypalle Ramamohan Reddy | Pages 12 | Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana



తీవ్ర తుపానుగా మారనున్న వాయుగుండం

చీరాల, ప్రజాభూమి ప్రతినిధి : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రస్తుతం చెన్నైకు 700 కి.మీ., విశాఖపట్నానికి 800 కి.మీ., గోపాల్‌పూర్‌కు 910 కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉందని సోమవారం రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ, ఆర్టీజీఎస్ సీఈవో ప్రఖర్ జైన్ తెలిపారు. ఇది సాయంత్రానికి తుపానుగా, రేపు తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందన్నారు.

- మిగతా 2లో..



విజయమే లక్ష్యంగా పనిచేయాలి

- గ్రామస్థాయికి కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పాలనను తీసుకెళ్లాలి
- మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి
- కూటమి పార్టీల ముఖ్య నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించి దిశానిర్దేశం

ప్రజాభూమి ప్రతినిధి,నంద్యాల : రానున్న పంచాయతీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గ్రామస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

- మిగతా 2లో..



లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..

- 500 పాయింట్లకు పైగా పెరిగిన సెన్సెక్స్
- బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ రంగాల షేర్లలో కొనుగోళ్లు
- ఆటో, రియల్టీ, ఫార్మా రంగాల సూచీలు నష్టాల్లో
- అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు
- నిఫ్టీలో మ్యాక్స్ హెల్త్‌కేర్ ఇన్‌స్టిట్యూట్, ఐటీసీ, టాటా కన్స్యూమర్ ప్రాడక్ట్స్ షేర్లకు లాభం

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం లాభాలతో ముగిశాయి. బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ (నిత్యావసర వినియోగ వస్తువులు) రంగాల షేర్లలో కొనుగోళ్లు సూచీలకు అండగా నిలిచాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు రావడం కూడా ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను బలపరిచింది.

- మిగతా 2లో..

ఏపీలో రెండో దశ పంచాయతీ ఎన్నికల

నోటిఫికేషన్ విడుదల



- 18 నుంచి 20 వరకు నామినేషన్ల స్వీకరణ..
- 29న పోలింగ్, ఫలితాలు
- రెండో దశలో 4,960 సర్పంచ్, 49,224 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు
- మొత్తం మూడు విడతల్లో రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ ఎన్నికల నిర్వహణ


ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో రెండో దశ పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. 21వ తేదీన నామినేషన్ల పరిశీలన చేపట్టనున్నారు. 24వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుంది. అదే రోజు మధ్యాహ్నం 3 గంటల తర్వాత బరిలో నిలిచే అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించనున్నారు అధికారులు..

- మిగతా 2లో..

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి : ఈ నెల 20 తేదీన కోస్తాంధ్రను తాకనున్న తుఫానుపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం బంగాళాఖాతంలో కేంద్రీకృతమై ఉన్న తీవ్ర వాయుగుండం మరింత బలపడి ఇవాళ సాయంత్రానికి తుఫానుగా మారే అవకాశం ఉందని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు.

కోస్తాంధ్ర తీరానికి

భారీ వర్ష సూచన



- 20 తేదీన కోస్తాంధ్రను తాకనున్న తీవ్ర తుఫాను
- ముందస్తు జాగ్రత్తలపై సీఎం చంద్రబాబు ఆదేశాలు

సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో తీవ్ర వాయుగుండం ప్రస్తుత పరిస్థితిపై సీఎం సమీక్ష నిర్వహించారు. దీని పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం అధికారులకు సూచించారు. కేంద్ర బృందం చేసిన సిఫార్సులను కూడా పరిగణనలోకి తీసుకుని క్షేత్రస్థాయిలో అమలు చేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. బంగాళాఖాతంలో ఏర్పడే తుఫాను ప్రభావంతో ఈ నెల 19, 20 తేదీల్లో కోస్తాంధ్ర తీరంలో మోస్తరు నుంచి భారీ వర్షాలకు ఆస్కారం ఉందని అధికారులు తెలిపారు. ఆర్నెల్ తరహాలోనే ఈ తుఫాను ప్రభావం కూడా ఉండే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. రానున్న తుఫాను కోనసీమ, కాకినాడ, తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లా సహా వివిధ ప్రాంతాలపై ప్రభావం ఉండే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ముందుగానే ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను పంపటంతో పాటు విద్యుత్ సరఫరాను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించేలా సిబ్బందిని సిద్ధంగా ఉంచుకోవాలని సీఎం సూచించారు. అలాగే భారీ వర్షాల వల్ల వస్తున్న వరద ప్రవాహాలను రిజర్వాయర్లకు మళ్లించేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

స్థానిక ఎన్నికల కాంట్రాక్టును

పోలీసులకు ఇచ్చినట్టుంది

ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అడిగే దమ్ము కూటమికి లేదు

- అందుకే పోలీసులను అడ్డం పెట్టుకుని ఎన్నికల నిర్వహణ
- స్థానిక ఎన్నికలు పోలీసులు, వైయస్సార్‌సీపీ మధ్యనే
- పోలీసులతో ప్రజాస్వామ్యంపై కొత్త పద్ధతుల్లో దాడి
- ఆ స్థాయిలో ఒక దుష్ట సంప్రదాయానికి చంద్రబాబు శ్రీకారం
- సజ్జల, మాజీ మంత్రి పెద్దిరెడ్డి

ప్రజాభూమి ప్రతినిధి,గుంటూరు: ప్రజల దగ్గరకు వెళ్లి ఓట్లు అడిగే ధైర్యం లేక చంద్రబాబు, ఆయన కొడుకు లోకేష్ స్థానిక ఎన్నికల నిర్వహణ బాధ్యతను పోలీసులకు పీపీసీ పద్ధతిలో కాంట్రాక్టు ఇచ్చేశారని వైయస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి ఫైర్ అయ్యారు. ప్రజలకు ఏం చేశామో చెప్పి ఓట్లు తెచ్చుకోవాలన్న ఆయన, ఇచ్చిన హామీలు అమలు చేయలేదు కాబట్టి ప్రజల దగ్గరకు వెళ్లలేక పోలీసులను అడ్డం పెట్టుకుని ఎన్నికలు జరుపుతున్నారని ఆయన మండిపడ్డారు.

- మిగతా 2లో..





తెలంగాణకు పొంచి ఉన్న తాగునీటి ముప్పు..

- శ్రీశైలం జలాశయంలో 829 అడుగులకు పడిపోయిన నీటి మట్టం
- వరుసగా వాయిదా పడుతున్న కేఆర్ఎంబీ జీఆర్ఎంబీ సమావేశాలు
- తెలంగాణ ఆంధ్రప్రదేశ్ మధ్య తేలని తాగునీటి కేటాయింపులు
- సకాలంలో నిర్ణయాలు తీసుకోకుంటే వేసవిలో తీవ్ర తాగునీటి ఎద్దడి

2 లో..



విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయమునకు చేరుకున్న కేంద్ర

హోం మంత్రి అమిత్‌షా

- కేంద్ర మంత్రికి ఘన స్వాగతం పలికిన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు, ఇతర ఉన్నతాధికారులు..

- మిగతా 2లో..

మచిలీపట్నం, ప్రజాభూమి : సోమవారం సాయంత్రం 4:55 గంటలకు ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ప్రత్యేక విమానంలో విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయమునకు చేరుకున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా కి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు

ఆక్వాన్ తుపానుపై

విద్యుత్ శాఖ అప్రమత్తం

- ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలి..
- మంత్రి గొట్టిపాటి ఆదేశాలు

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి: ఆక్వాన్ తుపాను ముప్పు నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. తుపాను ప్రభావంతో విద్యుత్ వ్యవస్థకు నష్టం వాటిల్లే అవకాశం ఉన్నందున ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. సోమవారం ఏపీఈపీడీసీఎల్ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన ఈ మేరకు దిశానిర్దేశం చేశారు. ఇటీవల సంభవించిన తుపాన్ల సమయంలో ఎదురైన పరిస్థితులు, విద్యుత్ పునరుద్ధరణలో ఎదురైన సవాళ్లను దృష్టిలో ఉంచుకుని కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని మంత్రి సూచించారు.



2 లో

అక్వాన్ తుఫాను నేపథ్యంలో

అప్రమత్తంగా ఉండాలి..

రైతులు, మత్స్యకారుల రక్షణకు పటిష్ట చర్యలు

- 23.87 లక్షల హెక్టార్ల వ్యవసాయ పంటలపై ప్రత్యేక దృష్టి
- తీరప్రాంత 10 జిల్లాల్లో 9.51 లక్షల హెక్టార్ల పంటల రక్షణకు ప్రాధాన్యం
- 16 జిల్లాల్లో 2.69 లక్షల హెక్టార్ల ఉద్యాన పంటలకు ముందస్తు రక్షణ చర్యలు
- 30,808 బోట్లలో తీరానికి చేరిన 30,635 బోట్లు.. మిగిలిన 173 బోట్లపై నిరంతర పర్యవేక్షణ
- మత్స్యకారులకు 1.08 లక్షల వాయిస్ హెచ్చరికలు.. 350 ల్యాండింగ్ కేంద్రాల్లో అప్రమత్తం
- పంట నష్టంపై 24 గంటల్లో ప్రాథమిక నివేదికలు.. రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు
- వ్యవసాయ, ఉద్యాన, మత్స్యశాఖ ఉన్నతాధికారులకు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాలు

2 లో..



ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి: అక్వాన్ తుఫాను ప్రభావంతో రాష్ట్రంలో భారీ వర్షాలు, ఈదురుగాలులు సంభవించే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు.

పంటలకు నష్టం జరగకుండా, మత్స్యకారుల ప్రాణాలకు ముప్పు వాటిల్లకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రైతులు, మత్స్యకారులకు అండగా ఉంటుందని తెలిపారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని, ఎలాంటి నిర్లక్ష్యానికీ తావివ్వొద్దని స్పష్టం చేశారు.

ప్రజాభూమి
మంగళవారం, నవంబర్ 17, 2026 2

విజయమే లక్ష్యంగా పనిచేయాలి

మొదటి పేజీ తరువాయి

కోయిలకుంట్ల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కోయిలకుంట్ల మండలానికి చెందిన ఎన్డీఏ కూటమి పార్టీల ముఖ్య నాయకులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. రానున్న పంచాయతీ ఎన్నికల సన్నద్ధత, అభ్యర్థుల ఎంపిక, పార్టీల మధ్య సమన్వయం, అనుసరించాల్సిన వ్యూహాలపై నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజాదరణ కలిగి, ప్రజాసేవ పట్ల నిబద్ధతతో పాటు స్థానిక సమస్యలపై అవగాహన ఉన్న సమర్థులైన అభ్యర్థుల ఎంపికకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. అభ్యర్థుల ఎంపికలో అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని, కూటమి పార్టీల నాయకులందరి అభిప్రాయాలతో సమష్టి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల అమలే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని వివరించారు. ఈ ప్రభుత్వ ప్రగతి, ప్రజా సంక్షేమ లక్ష్యాలను ప్రతి గ్రామంలోని ప్రజలకు వివరించి, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా కూటమి శ్రేణులు నిలవాలని కోరారు. ఎన్నికల నేపథ్యంలో కూటమి పార్టీల మధ్య ఎలాంటి విభేదాలకు తావులేకుండా ఐక్యతతో ముందుకు సాగాలని మంత్రి స్పష్టం చేశారు. ప్రతి గ్రామానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకొని, నాయకులు, కార్యకర్తలకు బాధ్యతలు అప్పగిస్తూ ఎన్నికల ప్రక్రియను సమర్థంగా నిర్వహించాలని సూచించారు.

వైసీపీకి మరోసారి ప్రజలు గుణపాఠం చెప్పాలి : గత ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత కూటమి ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పాలనకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గమనిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. రానున్న పంచాయతీ ఎన్నికల్లోనూ వైసీపీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కూటమి బలపరిచిన అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించి గ్రామాల అభివృద్ధికి ప్రజలు మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. పంచాయతీలు గ్రామీణ ప్రగతికి పునాదులని, ప్రజల అవసరాలను గుర్తించి వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేసే నాయకత్వం అవసరమని అన్నారు. అందుకు అనుగుణంగా ప్రజల నమ్మకాన్ని పొందిన అభ్యర్థులను గెలిపించుకునే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, పటిష్ట ప్రణాళికతో ఎన్నికల బరిలోకి దిగాలని కూటమి శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఎన్డీఏ కూటమి పార్టీల ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తీవ్ర తుపానుగా మారనున్న వాయుగుండం

పశ్చిమ వాయవ్య దిశగా పయనిస్తూ శుక్రవారం మధ్యాహ్నానికి నెల్లూరు-తుని మధ్య అతితీవ్ర తుపానుగా తీరం దాటే సూచనలున్నాయని పేర్కొన్నారు. తుపాను ప్రభావంతో గురు, శుక్రవారాల్లో కోస్తాంధ్రలో ఈదురుగాలులతో భారీ నుంచి అతిభారీ వర్షాలు, కొన్ని ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. తీరం దాటే సమయంలో గంటకు 120-145 కి.మీ. వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని, తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు, రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రఖర్ జైన్ తెలిపారు. ఇటీవల అర్నబ్, మురసు తుపానులు కోస్తాంధ్రను వణికించిన సంగతి తెలిసిందే. పలు ప్రాంతాల్లో పంటలు నీటమునిగాయి.

ఏపీలో రెండో దశ పంచాయతీ ఎన్నికల
నోటిఫికేషన్ విడుదల



మరోవైపు.. ఈ నెల 29వ తేదీన ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పంచాయతీ ఎన్నికల్లో రెండో దశ పోలింగ్ నిర్వహించనున్నారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటిస్తారు. అనంతరం ఉపసర్పంచ్ ఎన్నిక కూడా నిర్వహించనున్నారు. అవసరమైతే 30న రీపోలింగ్ నిర్వహిస్తారు. రెండో విడతలో భాగంగా రాష్ట్రంలో 4,960 సర్పంచ్ పదవులకు, 49,224 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. తొలి విడత పోలింగ్ నవంబర్ 26న, మూడో విడత డిసెంబర్ 2న జరగనుంది. ఈ మూడు దశల్లో కలిపి మొత్తం 13,167 సర్పంచ్, 1.32 లక్షలకు పైగా వార్డు సభ్యుల స్థానాలను భర్తీ చేయనున్నారు.?

ఆక్వాన్ తుపానుపై విద్యుత్ శాఖ అప్రమత్తం

ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు నేలకూలినా, తీగలు తెగిపడినా వెంటనే స్పందించి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలన్నారు. ఇందుకోసం అవసరమైన స్తంభాలు, కండక్టర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర పరికరాలను ముందుగానే ప్రభావిత ప్రాంతాలకు తరలించి అందుబాటులో ఉంచుకోవాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో విద్యుత్ సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని, పునరుద్ధరణ పనులను ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. శాఖాపరమైన నిర్లక్ష్యానికి ఏమాత్రం తావులేదని, తుపాను సమయంలో ఎక్కడా ప్రాణనష్టం జరగకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా తెగిపడిన విద్యుత్ తీగల వల్ల ప్రమాదాలు జరగకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడే పరిస్థితులు ఉంటే వినియోగదారులకు ముందుగానే సమాచారం అందించాలని మంత్రి ఆదేశించారు. సరఫరా నిలిచిన ప్రాంతాలు, పునరుద్ధరణకు పట్టే సమయం తదితర వివరాలను ప్రజలకు ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. తుపాను ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని గొట్టిపాటి రవికుమార్ అధికారులకు సూచించారు.

తెలంగాణకు పొంచి ఉన్న తాగునీటి ముప్పు..

ప్రజాభూమి ప్రతినిధి, శ్రీశైలం :



శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలు ప్రమాదకర స్థాయికి పడిపోవడం, కృష్ణా-గోదావరి నదీ యాజమాన్య బోర్డుల (కేఆర్ఎంబీ, జీఆర్ఎంబీ) సమావేశాలు నిరంతరం వాయిదా పడుతుండడం నేపథ్యంలో.. తెలంగాణలో తాగునీటి సంక్షోభం పొంచి ఉందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌తో నీటి పంపకాల సమస్యలు ఇంకా పరిష్కారం కాకపోవడంతో రానున్న వేసవిలో హైదరాబాద్‌తో పాటు దక్షిణ తెలంగాణ జిల్లాలకు నీటి ఇబ్బందులు తప్పవని భావిస్తున్నారు.ప్రస్తుతం శ్రీశైలం జలాశయం నీటిమట్టం 829.10 అడుగులకు చేరింది. పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, కనీస నీటిమట్టం (834 అడుగులు) కంటే దిగువకు పడిపోయింది. మొత్తం 215.80 టీఎంసీల సామర్థ్యానికి గాను కేవలం 48.57 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉన్నాయి. జూరాల, సుంకేసుల, హంద్రీ నదుల నుంచి ఇన్‌ఫ్లోలు పూర్తిగా నిలిచిపోయాయి. నవంబర్ మొదటి తొమ్మిది రోజుల్లోనే 3.03 టీఎంసీల మేర నిల్వలు తగ్గాయి. ఎల్‌నినో ప్రభావం వల్ల ఈ ఏడాది వార్షిక ప్రవాహాలు 218 టీఎంసీలకు మాత్రమే పరిమితమయ్యాయి. రానున్న రోజుల్లో ఆవిరి కావడం, వేసవి డిమాండ్ పెరగడం వల్ల రిజర్వాయర్‌పై ఒత్తిడి మరింత పెరిగే అవకాశం ఉంది.మరోవైపు, మే నెల నుంచి జరగాల్సిన 21వ కేఆర్ఎంబీ సర్వసభ్య సమావేశం వరుసగా వాయిదా పడుతూ వస్తోంది. చివరిసారిగా 2025 జనవరి 21న ఈ సమావేశం జరిగింది. అటు అజెండాపై రెండు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో 18వ జీఆర్ఎంబీ సమావేశం కూడా నిలిచిపోయింది. దీంతో తాగునీటి కేటాయింపులపై కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోతోంది. జనాభా ప్రాతిపదికన లేదా 50:50 నిష్పత్తిలో నీటి కేటాయింపులు చేయాలని తెలంగాణ కోరుతోంది. కల్వకుర్తి, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ద్వారా ఉమ్మడి మహబూబ్‌నగర్‌కు 5 టీఎంసీలతో పాటు, జూలై వరకు హైదరాబాద్, నల్గొండ, ఖమ్మం అవసరాలకు మొత్తం 46 టీఎంసీల తాగునీటిని కేటాయించాలని తెలంగాణ పట్టుబడుతోంది.

అక్వాన్ తుఫాను నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి..

23.87 లక్షల హెక్టార్ల వ్యవసాయ పంటలపై ప్రత్యేక దృష్టి : రాష్ట్రంలో నవంబర్ 14 నాటికి 21.32 లక్షల హెక్టార్లలో ఖరీఫ్ పంటలు పొలాల్లో ఉండగా, 2.55 లక్షల హెక్టార్లలో రబీ పంటలు వేశారని మంత్రి తెలిపారు. మొత్తం 23.87 లక్షల హెక్టార్లలో పంటలు ఉన్నాయని, ఇందులో వరి 13.60 లక్షల హెక్టార్లు, కంది 4.42 లక్షల హెక్టార్లు, పత్తి 1.92 లక్షల హెక్టార్లలో సాగులో ఉన్నాయని వివరించారు. ముఖ్యంగా తీరప్రాంతంలోని 10 జిల్లాల్లో 9.51 లక్షల హెక్టార్లలో పంటలు ఉండగా, అందులో 9.16 లక్షల హెక్టార్లలో వరి పంట ఉందన్నారు. కోతకు సిద్ధంగా ఉన్న వరి, మొక్కజొన్న, పత్తి తదితర పంటలను వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ముందుగానే సేకరించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా కాలువలు శుభ్రం చేయాలని, భారీ వర్షాల సమయంలో ఎరువులు, పురుగుమందుల పిచికారీ నిలిపివేయాలని తెలిపారు. వర్షాలు తగ్గి నేల అనుకూలంగా మారిన తర్వాతే రబీ విత్తనాలు వేయాలని సూచించారు.

16 జిల్లాల్లో 2.69 లక్షల హెక్టార్ల ఉద్యాన పంటల రక్షణకు చర్యలు : తుఫాను ప్రభావానికి గురయ్యే అవకాశం ఉన్న 16 జిల్లాల్లో 2,69,831 హెక్టార్ల ఉద్యాన పంటలపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు. ఇందులో మిరప 1,08,615 హెక్టార్లు, కొబ్బరి 98,526 హెక్టార్లు, పసుపు 24,469 హెక్టార్లతో పాటు అరటి, బొప్పాయి, కూరగాయల పంటలు ఉన్నాయని తెలిపారు. పల్నాడు, కోనసీమ, మార్కాపురం, ఏలూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. అరటి, బొప్పాయి మొక్కలకు ఊతం ఏర్పాటు చేయాలని, కోతకు సిద్ధమైన పంటలను ముందుగానే మార్కెట్లకు తరలించాలని సూచించారు. నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవడంతో పాటు శాస్త్రవేత్తల సూచనలను రైతులకు చేరవేయాలని ఆదేశించారు.

సముద్రంలోని 173 బోట్లపై నిరంతర పర్యవేక్షణ

రాష్ట్రంలోని 1,053 కిలోమీటర్ల తీరప్రాంతంలో ఉన్న 12 జిల్లాల్లో మత్స్యశాఖ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్లు మంత్రి తెలిపారు. మొత్తం 30,808 బోట్లలో నవంబర్ 16 ఉదయం 10 గంటల నాటికి 30,635 బోట్లు సురక్షితంగా తీరానికి చేరాయని, మిగిలిన 173 బోట్లను కూడా క్షేమంగా తీరం చేర్చేందుకు చర్యలు చేపట్టామన్నారు. కాకినాడలో 78, బాపట్లలో 38, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో చెరో 24, కృష్ణా జిల్లాలో 9 బోట్లు సముద్రంలో ఉన్నాయని వివరించారు. మత్స్యకారులకు ఇప్పటికే 1,08,250 వాయిస్ హెచ్చరికలు పంపించామని, 8,217 బోట్లను నాభిమిత్ర వ్యవస్థ ద్వారా ట్రాక్ చేస్తున్నామని చెప్పారు. తీరప్రాంతంలోని 555 మత్స్యకార గ్రామాలు, 350 ఫిష్ ల్యాండింగ్ కేంద్రాల్లో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు.

ఆక్వా రైతులు అప్రమత్తంగా ఉండాలి

తుఫాను సమయంలో మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని మంత్రి సూచించారు. ఆక్వా రైతులు చెరువుల గట్లను బలోపేతం చేసుకోవాలని, నీటిలో ఆక్సిజన్, పీహెచ్, లవణీయత స్థాయిలను పర్యవేక్షించాలని తెలిపారు. బోట్లు, వలలు, విద్యుత్ పరికరాలను సురక్షితంగా ఉంచుకోవాలన్నారు. అన్ని హేచరీలతో పాటు 1,446 అంతర్గత మత్స్యకార సహకార సంఘాలకు ముందస్తు సూచనలు జారీ చేసినట్లు వెల్లడించారు.

పంట నష్టాల నమోదులో నిర్లక్ష్యం వద్దు : తుఫాను ప్రభావంతో ఉద్యాన పంటలకు నష్టం జరిగితే 24 గంటల్లో ప్రాథమిక నివేదికలు, వారం రోజుల్లో రైతులవారీగా పూర్తి వివరాలు అందించాలని మంత్రి ఆదేశించారు. వ్యవసాయ పంటల నష్టాలను రెవెన్యూ శాఖతో కలిసి అంచనా వేయాలని, 33 శాతానికి మించి నష్టం జరిగిన పంటలకు నిబంధనల ప్రకారం ఇన్‌పుట్ సబ్సిడీ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో కంట్రోల్ రూమ్‌ల ద్వారా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, వ్యవసాయ పంటల పరిస్థితిపై ప్రతిరోజూ ఉదయం 11 గంటలకు, సాయంత్రం 5 గంటలకు ూూూ×మీ యాప్‌లో నివేదికలు నమోదు చేయాలని తెలిపారు. రైతులకు 155251 టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా అవసరమైన సూచనలు అందించాలన్నారు. రైతులు పండించిన పంటలను, మత్స్యకారుల ప్రాణాలను, జీవనోపాధిని కాపాడటమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని, విపత్తు సమయంలో అధికారులు పూర్తి బాధ్యతతో పనిచేయాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..

ఈ క్రమంలో సెన్సెక్స్ 500 పాయింట్లకు పైగా పెరిగింది.సోమవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 510.40 పాయింట్లు (0.63 శాతం) లాభపడి 82,102.85 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 146.80 పాయింట్లు (0.58 శాతం) పెరిగి 25,291.10 వద్ద ముగిసింది.

నిఫ్టీలో మ్యాక్స్ హెల్త్‌కేర్ ఇన్‌స్టిట్యూట్, ఐటీసీ, టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ షేర్లు అత్యధికంగా లాభపడ్డాయి. బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ రంగాల సూచీలు ఈ సెషన్‌లో మెరుగైన పనితీరు కనబరిచాయి. మరోవైపు ఆటో, రియల్టీ, ఫార్మా రంగాల సూచీలు నష్టాల్లో ముగిశాయి.ప్రధాన సూచీలు లాభాల్లో ఉన్నప్పటికీ విస్తృత మార్కెట్‌లో మాత్రం అమ్మకాల ఒత్తిడి కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 0.51 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 1.10 శాతం నష్టపోయాయి. ప్రధానంగా పెద్ద కంపెనీల బ్యాంకింగ్, వినియోగ వస్తువుల షేర్లలో కొనుగోళ్లు జరగ్గా.. చిన్న, మధ్యస్థాయి కంపెనీల షేర్లలో మాత్రం ఆ ఉత్సాహం కనిపించలేదు.గత రెండు వారాలుగా బలమైన ర్యాలీ నమోదు చేసిన నిఫ్టీ.. ప్రస్తుతం ఒక పరిధిలోనే కదులుతోందని మార్కెట్ నిపుణులు విశ్లేషించారు. తదుపరి దశలో కొనుగోళ్లు పెరిగే ముందు 25,000-25,500 స్థాయిల మధ్య స్వల్ప దిద్దుబాటు లేదా స్థిరీకరణ ఉండొచ్చని అంచనా వేశారు. నిఫ్టీకి 24,800 స్థాయి కీలక మద్దతుగా ఉంటుందని పేర్కొన్నారు.మరోవైపు అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ సుమారు 0.40 శాతం పెరిగి 94 స్థాయి కంటే బలంగా కదిలింది. ఇటీవలి వారాల్లో విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (ఎఫ్ఐఐలు) రూ.50 వేల కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టడం రూపాయికి మద్దతుగా నిలిచిందని విశ్లేషకులు తెలిపారు. రూపాయి 93.50-94.25 పరిధిలో కదలవచ్చని అంచనా వేశారు.

విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయమునకు చేరుకున్న
కేంద్ర హోం మంత్రి అమిత్‌షా



రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు, ఇతర ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు.

విజయవాడలోని ఒక కార్యక్రమంలో పాల్గొను నిమిత్తం గన్నవరం చేరుకున్న కేంద్ర హోంమంత్రికి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రితో పాటు రాష్ట్ర హోం, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత, రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్, రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా, ఏలూరు రేంజ్ ఐజి జివిజి అశోక్ కుమార్ కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజి, జిల్లా ఎస్పీ వి. విద్యా సాగర్ నాయుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 20 సూత్రాల కార్యక్రమ అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్, ప్రోటోకాల్ డైరెక్టర్ టీ మోహన్ రావు, బిజెపి రాష్ట్ర కార్యక్రమాల ప్రోటోకాల్ ఇంచార్జ్ పాటూరి నాగభూషణం కేంద్ర హోంమంత్రికి ఘనంగా స్వాగతం పలికారు.అనంతరం ఆయన భద్రత బలగాల నడుమ ప్రత్యేక వాహనంలో రోడ్డు మార్గాన విజయవాడకు బయలుదేరి వెళ్లారు.

స్థానిక ఎన్నికల కాంట్రాక్టును పోలీసులకు ఇచ్చినట్టుంది

ఎన్నికల్లో బ్యాలెట్ బాక్స్‌ను తరలిస్తున్న వారిని అడ్డుకున్నందుకు మా అభ్యర్థులను అభినందించాల్సింది పోయి, అక్రమ కేసులు పెట్టి ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిని 10 రోజులుగా జైలులో పెట్టడం దుర్మార్గమని ఆక్షేపించారు. బ్యాలెట్ బాక్స్‌ను ఎక్కడికో తీసుకెళుతుంటే అడ్డుకుని మళ్లీ అధికారులకు అప్పగించే ప్రయత్నం మాత్రమే తమ నాయకులు, కార్యకర్తలు చేశారని చెప్పారు. వీడియోల్లో చూసినా ఇదే కనిపిస్తోందని, ఇందులో హత్యాయత్నం ఎక్కడుందని, దోషులను వదిలేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడిన వారిపై కేసులు పెడతారా? అని సజ్జల రామకృష్ణారెడ్డి నిలదీశారు.

రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు పోలీసులు, వైయస్సార్‌సీపీ మధ్య జరుగుతున్నట్లు ఉంది తప్ప, వెన్నుపోటు పార్టీ కూటమికి, వైయస్సార్‌సీపీ మధ్య అన్నట్లు లేదని ప్రొటెం రీజినల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. ఎక్కడ చూసినా అంతులేని అన్యాయం, అక్రమ కేసులు, 307 సెక్షన్లు, అరెస్టులే కనిపిస్తున్నాయని, ప్రజాస్వామ్య వ్యవస్థను ఇంత పెద్ద ఎత్తున నాశనం చేసిన ఘనత భారతదేశంలో ఒక్క చంద్రబాబుకే దక్కుతుందని ఆయన ధ్వజమెత్తారు. పోలీసుల ద్వారా కొత్త పద్ధతుల్లో ప్రజాస్వామ్యంపై దాడి చేస్తున్నారన్న ఆయన, అది ప్రజాస్వామ్యంపై జరుగుతున్న దాడిగా అభివర్ణించారు. మీడియాతో మాట్లాడిన నేతలు ఇంకా ఏమన్నారంటే..”

గుంటూరు సబ్‌జైలులో అక్రమ కేసులో అరెస్టయి నిర్బంధంలో ఉన్న మా పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమట?ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిని ఇప్పుడే కలిసి వచ్చాం. ఆయనపై బనాయించిన కేసు మామూలు తప్పుడు కేసు కాదు. ఇంత అన్యాయమైన కేసును గతంలో ఎప్పుడూ చూసి ఉండము. రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియను ఏ విధంగా అరాచకంగా మార్చేశారో సుప్రీంకోర్టు కూడా గమనించింది. రాష్ట్రంలో అసలు ప్రజాస్వామ్యం ఉందా లేదా అనే చర్చ జాతీయ స్థాయిలో కూడా జరుగుతోంది. బ్యాలెట్ బాక్స్‌ను పక్కకు తీసుకెళ్తుంటే అడ్డుకున్న మా పార్టీ అభ్యర్థులను అభినందించాల్సింది పోయి వారిపైనే అక్రమ కేసులు పెట్టారు. బ్యాలెట్ బాక్స్‌ను ఆపి తిరిగి అధికారులకు అప్పగించే ప్రయత్నం మాత్రమే మా నాయకులు, కార్యకర్తలు చేశారు. ఆ వీడియోల్లో కూడా ఇదే స్పష్టంగా కనిపిస్తోంది. అలాంటి ఘటనలో మా నాయకుడు అప్పిరెడ్డిని పది రోజులుగా జైలులో నిర్బంధించడం దారుణం.చాలా రోజులుగా మా పార్టీ సీనియర్ నాయకులను ఒక్కొక్కరినీ టార్గెట్ చేసి జైలుకు పంపాలనే కుట్ర జరుగుతోంది. పోలీసులు తమ బాధ్యతను మరిచిపోయి ఒక కిరాయి సైన్యంలా వ్యవహరిస్తున్నారు. యూనిఫామ్‌లో ఉన్న పోలీసులు వెన్నుపోటు పార్టీ కార్యకర్తల్లా పని చేస్తుంటే.. పోలీసుల వెనక నిలబడిన ఆ పార్టీ నాయకులు ఎన్నికల్లో గెలిచినట్లు మీసాలు తిప్పుతున్నారు. ప్రజలకు ఏం చేశామో చెప్పి ఓట్లు అడగాల్సిన ఎన్నికల్లో, ఇచ్చిన హామీలు అమలు చేయలేక ప్రజల దగ్గరకు వెళ్లే ధైర్యం లేక పోలీసులకు కాంట్రాక్టు ఇచ్చేశారు. చంద్రబాబు, ఆయన కొడుకు పోలీసు వ్యవస్థను తమ రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటున్నారు. డీజీపీ నుంచి కింది స్థాయి పోలీసు సిబ్బంది వరకు రాజ్యాంగం, చట్టం ఇచ్చిన అధికారాలను దుర్వినియోగం చేస్తూ ఎన్నికల పేరుతో ఒక నాటకం నడిపించారు.

ఈ కేసులో హత్యాయత్నం, దాడులంటూ ఎస్ఐ రాత్రి 11.30 గం.కు ఎఫ్ఐఆర్ నమోదు చేస్తే, అదే రాత్రి 12.30 గం.కు జిల్లా ఎస్పీ, కలెక్టర్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని చెబుతారు. ఇంతకన్నా విడ్డూరం ఇంకా ఏమైనా ఉంటుందా. ఇంకా వీడియోల్లో ఎక్కడా అప్పిరెడ్డి లేరు. ఎస్సై లేరు. బస్సు లేదు. దాడికి వచ్చిన జనాలు కూడా లేరు. ఒక మహిళా అభ్యర్థి బ్యాలెట్ బాక్స్‌ను పక్కకు తీసుకెళ్తున్నారని అనుమానించి ప్రశ్నించడం, దాన్ని తిరిగి అధికారులకు అప్పగించే ప్రయత్నం చేయడం మాత్రమే కనిపిస్తోంది. అలాంటి ఘటనకు డెకాయిటీ, హత్యాయత్నం వంటి తీవ్రమైన సెక్షన్లు పెట్టి జైలులో నిర్బంధించడం ఎంతవరకు న్యాయం? ఈ అరాచక సంస్కృతి ఇక్కడితో ఆగదు. చంద్రబాబు నాటిన విత్తనం రేపు పెరిగి వ్యవస్థలనే కూల్చేసే ప్రమాదం ఉంది. ప్రజల కోసం, ప్రజాస్వామ్యం కోసం నిలబడటానికి మేము సిద్ధంగా ఉన్నాం. ఈ రోజు రాష్ట్రంలో జరుగుతున్న అనర్థాలు, అక్రమ కేసులు, ఎన్నికల బీభత్సం గురించి మీడియా ప్రతినిధులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీకి, పోలీసులకు మధ్యే స్థానిక ఎన్నికలు జరుగుతున్నాయి తప్ప వెన్నుపోటు పార్టీ, వైయస్సార్‌సీపీ మధ్య కాదు. ఎక్కడ చూసినా అన్యాయం, దుర్మార్గం, హత్యాయత్నం (సెక్షన్. 307) కేసులు పెట్టి, మా పార్టీ నాయకులను అరెస్టు చేయడం కనిపిస్తోంది. ఎన్నికల్లో చురుగ్గా పాల్గొంటున్న మా పార్టీ నాయకులను టార్గెట్ చేసి జైలులో పెడుతున్నారు. ఆ తర్వాత తమకు నచ్చినట్లు ఎన్నికల ఫలితాలు ప్రకటించుకుంటున్నారు. ఇలాంటి పద్ధతులు ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రమాదకరం. భారతదేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను ఇంత పెద్ద ఎత్తున నాశనం చేసిన ఘనత చంద్రబాబు నాయుడికే దక్కుతుంది.

పోలీసులంతా పసుపు చొక్కాలు వేసుకోకుండానే వెన్నుపోటు పార్టీ కార్యకర్తల్లా పని చేస్తున్నారు. అన్యాయం చేస్తున్నది మీరే.. వాటికి బాధ్యత వహించాల్సింది కూడా మీరే. ప్రతి కానిస్టేబుల్ నుంచి డీజీపీ వరకు ఎంత ఉప్పు తింటే అన్ని నీళ్లు తాగాల్సిన పరిస్థితి తప్పకుండా వస్తుంది. ఇది వైయస్సార్‌సీపీ మీద జరుగుతున్న దాడి కాదు. ప్రజాస్వామ్యం మీద జరుగుతున్న దాడి. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలనుకునే ప్రతి ఒక్కరూ ఈ దాడిని ఎదుర్కోవాల్సిన అవసరం ఉంది. మేము అధికారంలో ఉన్నప్పుడు ఎన్నికలు ఎలా నిర్వహించామో, ఈరోజు తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికలు ఎలా నిర్వహిస్తోందో ప్రజలు గమనించాలని “సజ్జల పేర్కొన్నారు.

ప్రజాభూమి
ఎన్టీఆర్, కృష్ణా
మంగళవారం, నవంబర్ 17, 2026
3



మచిలీపట్నం రీజనల్ రిపోర్టర్, ప్రజా భూమి

కలియుగంలో భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబం గారంగా, ఆపదలో ఉన్నవారికి అభయమిచ్చే దైవంగా పాండురంగ స్వామి భక్తుల హృద యాల్లో కొలువై ఉన్నారు. మచిలీపట్నం సమీ పంలోని చిలకలపూడిలో వెలసిన శ్రీ పాండు రంగ స్వామి క్షేత్రం భక్తి, ఆధ్యాత్మికతకు ప్రతీక గా విరాజిల్లుతోంది. కీర పండరీపురంగా ప్రసిద్ధి గాంచిన ఈ పుణ్యక్షేత్రంలో ఈ నెల 19వ తేదీ నుంచి 24వ తేదీ వరకు స్వామివారి ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తు న్నారు. ఆరు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు. పాండురంగ స్వామిని దర్శిం చి, మనసారా ప్రార్థిస్తే కష్టాలు తొలగి సుఖసంతో షాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

భక్త నరసింహం సంకల్పమే పుణ్యక్షేత్ర ఆవిర్భావం..!

ఈ క్షేత్ర చరిత్ర ఎంతో విశిష్టమైనది. 1889 ఏప్రిల్ 4న విశాఖపట్నం జిల్లా బొబ్బిలి తాలూకాలోని ఉత్తరావెల్లి గ్రామంలో జన్మించిన నరసింహం చిన్ననాటి నుంచే దైవభక్తిని అలవ ర్చుకున్నారు. తన 18వ ఏట చిలకలపూడికి వచ్చి వ్యాపారంలో స్థిరపడిన ఆయన, క్రమంగా పాండురంగ విఠలుని ఆరాధనలో నిమగ్నమ య్యారు. పండరీపురం యాత్ర సందర్భంగా మహీపతి గూండా మహరాజ్‌ను గురువుగా స్వీక రించి, వారి నుంచి విఠల మంత్రోపదేశం, తులసీ మాలను పొందారు. గురువుల ఆశీస్సులతో చిలకలపూడిలో పాండురంగ స్వామి ఆలయాన్ని నిర్మించాలనే మహత్తర సంకల్పానికి శ్రీకారం చుట్టారు. ఆ సంకల్పమే నేటి కీర పండరీపురం క్షేత్రానికి పునాదిగా నిలిచింది.

చంద్రభాగ తీరం నుంచి చిలకలపూడికి దివ్యానుభూతి..!

ఆలయ నిర్మాణానికి ప ండ రీపుర ంలోని చంద్రభాగ నదీ తీరపు ఇసుక, గులకరాళ్లను తీసుకురా వాలని నరసింహం సంకల్పించారు. నది ఉద్ధృతంగా ప్రవహిస్తున్న సమయంలో ఆయన చేసిన ప్రార్థనకు అనుగుణంగా ఇసుక దిబ్బ ఏర్పడిందని క్షేత్ర చరిత్ర చెబుతోంది. అక్కడి నుంచి తెచ్చిన ఇసుక, రాళ్లలో లభించిన ఒక గుండ్రని రాయిలో పాండురంగుని దివ్య జ్యోతి ప్రవేశించిందని భక్తుల విశ్వాసం. అనం తరం స్వామివారు నరసింహానికి స్వప్నంలో దర్శనమిచ్చి, 1929 నవంబర్ 13న కార్తీక శుద్ధ ఏకాదశి పర్వదినాన కీర పండరీపురంలో సాక్షాత్కరిస్తానని అనుగ్రహించినట్లు స్థలపు రాణం వివరిస్తోంది. ఆ దివ్యసందేశంతో ఆలయ నిర్మాణం పూర్తిచేసిన నరసింహం స్వామివారి ఆగమనానికి ఎదురుచూశారు. నిర్ణీత రోజున అనేక ప్రార్థనల అనంతరం ఆలయ గర్భగుడి తలుపులు తెరుచుకోగా, సుమారు మూడు అడుగుల ఎత్తైన పాండురంగ స్వామి విగ్రహం దివ్య తేజస్సుతో దర్శనమిచ్చిం దని క్షేత్ర చరిత్ర పేర్కొం టోంది. ఈ అద్భుత ఘట్టం నాటి నుం చి చిలకలపూడి పాండుర ంగ క్షేత్రం విశేష ఖ్యాతిని పొందింది.

❖ భక్తుల కొంగుబంగారం పాండురంగడు ❖ నవంబర్ 19 నుంచి 24 వరకు వైభవంగా పాండురంగ స్వామి ఉత్సవాలు ❖ భక్తుని కోసం సాక్షాత్కరించిన దైవం..!

ఆధ్యాత్మిక వైభవానికి నిలయం..!

ఈ పుణ్యక్షేత్రంలో ప్రధాన ఆలయంతోపాటు ఆంజనేయస్వామి ఆలయం, సహస్రలింగ కైలా స మండపం, రాధ, రుక్మిణి, సత్యభామ, అష్ట లక్ష్మి ఆలయాలు భక్తులను విశేషంగా ఆకట్టు కుంటాయి. భక్త నరసింహం చేపట్టిన సహస్రకో టి విఠలనామ యజ్ఞంలో దేశవ్యా ప్తంగా భక్తులు పాల్గొని విఠలనామాలను లిఖించగా, ఆ పవిత్ర గ్రంథాలను ఆలయ ప్రాంగణంలోని విఠల్ కోటి స్థూపంలో భద్రపరిచారు. షిర్డీ సాయిబాబా మందిరం, ప్రాచీన అశ్వత్థ వృక్షం, సిద్ధేశ్వర ఆలయం ఈ క్షేత్ర ఆధ్యాత్మిక శోభను మరింత పెంచుతున్నాయి. ఆలయ నిర్మాణానికి జీవితాన్ని అంకితం చేసిన భక్త నరసింహం 1974 జనవరి 16న పరమపదించారు. ఆయన సమాధి, విగ్రహం కూడా ఆలయ ప్రాంగణంలో భక్తులకు దర్శనమిస్తున్నాయి.

ఉత్సవాలకు తరలిరానున్న భక్తజనం..!

ఈనెల 19వ తేదీ నుండి 24వ తేదీ వరకు అనగా గురువారం దశమి నుండి పౌర్ణమి వరకు చిలకల పూడి పాండురంగ స్వామి దేవాలయంలో స్వామి వారి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడా నికి ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు క్షేత్ర నిర్మాణ భక్త నరసింహం మునిమనవడు ఆలయ నిర్వాహకులు టేకి నరసింహం తెలిపారు. శ్రీ పాండురంగ స్వామి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు.కార్తీక మాసంలో జరిగే పాండురంగ స్వామి ఉత్సవాలు ఈ క్షేత్రంలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ఈ నెల 19 నుంచి 24వ తేదీ వరకు జరగనున్న ఉత్సవాల సందర్భంగా స్వామివారి దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు. పాండురంగ నామస్మరణలు, భక్తి కార్యక్రమా లతో క్షేత్రం ఆధ్యాత్మిక సందడిని సంతరించుకో నుంది. తరతరాలుగా భక్త నరసింహం వంశీకుల ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ ఆలయం నేడు ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోంది. భక్తుల పాలిట కల్పవల్లిగా, కష్టాలను తొలగించే దైవంగా కొలువుదీరిన పాండురంగ స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందేందుకు భక్తులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. భక్తి భావంతో పాండురంగ నామాన్ని స్మరిస్తే స్వామివారి కరుణాకటాక్షాలు లభిస్తాయని భక్తుల నమ్మకం. జై పాండురంగ విఠలా! నామస్మరణతో ఆలయ ప్రాంగణమంతా భక్తి ప్రపత్తులతో విరాజిల్లు తుంది.

48వ డివిజన్‌లో ముమ్మరంగా కాలువల పూడికతీత పనులు







ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ: 48వ డివిజన్ పరిధిలోని పలు ప్రాం తాల్లో కాలువల పూడికతీత పనులు నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ 48వ డివిజన్ కార్పొరేటర్ శ్రీ ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి) ఆధ్వర్యంలో గోవిందరాజుల వారి సందులో కాలువల పూడికతీత పనులు చేపట్టారు.అలాగే శీను హోటల్ ఎదురుగా ఉన్న గంగానమ్మ గుడి సందులో, పాలరాయి మార్వాడి గుడి సందులో సైతం కాలువల్లో పేరుకుపోయిన పూడికను తొలగించారు.కాలువల్లో మురు గు నీరు సజావుగా ప్రవహిం చేలా పూడికతీత పనులు చేపట్టి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకు న్నారు. డివిజన్‌లో పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యతనిస్తూ ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు.

బాధితులకు ఎల్ఓసి పత్రాలు అందజేత

కూటమి నాయకులతో కలిసి అందజేసిన కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్



ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ

అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి చికిత్స నిమిత్తం ఎమ్మెల్యే సుజనా చౌదరి సహకారంతో ఎల్ ఓ సీ పత్రాలు మంజూరయ్యాయి కొత్తపేటలో నివాసముంటున్న కోలా వెంకటేశ్వరరావు (42) రోడ్డు ప్రమాదంలో గాయపడగా అత్యవసర వైద్యం నిమిత్తం రూ 10 లక్షల ఎల్ ఓ సీ మంజూరైంది భవానిపురానికి చెందిన చీదెళ్ళ హేమ సుందరరావు (58) బ్రెయిన్ స్ట్రోక్ కు గురై అత్యవసర వైద్యం కోసం దరఖాస్తు చేసుకోగా రూ 7.98 లక్షల ఎల్ ఓ సీ మంజూరైంది ఊర్మిళ నగర్ కు చెందిన మూలకా ఆది రెడ్డి (55) భవనం పై నుంచి పడి గాయపడగా అత్యవసర వైద్యం కోసం రూ 6.35 లక్షల విలువైన ఎల్ ఓ సీ అదేవిధంగా ఫ్రైజర్ పేటకు చెందిన కలకోటి నాగలక్ష్మి (28) తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతూ వైద్య సాయం కోసం దరఖాస్తు చేసుకోగా రూ 2.80 లక్షల ఎల్ ఓ సీ మంజూరైంది..ఆ పత్రాలను కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ భవానిపురం ఎన్డీయే కార్యాలయంలో కూటమి నేతలతో కలిసి అందజేశారు త్వరితగతిన స్పందించి ఎల్ ఓ సీ పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే సుజనా చౌదరి కు బాధితుల కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు 47వ డివిజన్ టీడీపీ కార్పొరేటర్ ఈగల సాంబశివరావు, 40 వ డివిజన్ జనసేన పార్టీ అధ్యక్షుడు బొల్లేపల్లి కోటేశ్వరరావు, బీజేపీ మైనార్టీ మోర్చా స్టేట్ వైస్ ప్రెసిడెంట్ షర్మిల, మహంతిపురం బీజేపీ మండల అధ్యక్షురాలు పగిడిపల్లి రాజేశ్వరి, టీడీపీ నాయకులు నల్లిబెల్లి కనకరావు, ముదిరి శ్రీను, దుర్గా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీతో పదవిని నిర్వహిస్తా.... మచిలీపట్నం మేయర్ అబ్దుల్ అబీద



ప్రజా భూమి ప్రతినిధి మచిలీపట్నం

మచిలీపట్నం నగర ప్రజలు ఎంతో నమ్మకంతో అత్యధిక మెజార్టీతో మేయర్ గా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ తన పదవికి వన్నె తెచ్చే విధంగా నీతి నిజాయితీతో మచిలీపట్నం మేయర్ గా తన పదవీ బాధ్యతలు నిర్వహిస్తానని మచిలీపట్నం కార్పొరేషన్ మేయర్ అబ్దుల్లా అబీద అన్నారు. వేమూరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మచిలీపట్నం మేయర్ మరియు కార్పొరేటర్ల అభినందన సభ రాజా గారి సెంటర్ లోని వి.వి.ఎస్ ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగానగర మేయర్ అబ్దుల్ అబీధా మాట్లాడుతూ మచిలీపట్నం ప్రజలు ఎంతో విజ్ఞతతో చదువుకున్న వ్యక్తులను మేయర్ గా కార్పొరేటర్ గా ఎన్నుకున్నారని నగరాన్ని అభివృద్ధి చేసే బాధ్యత సమిష్టిగా నిర్వహి స్తామని ఆమె తెలియజేశారు. మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలసౌరి రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర మరియు కూటమి నాయకుల సంపూర్ణ సహాయ సహకారాలతో నగరాన్ని 60 డివిజన్లో అభివృద్ధి పథంలో నడిపిస్తామని అన్నారు. నగర ప్రజలు కూడా తమకు సహకారాన్ని అందించాలని, స్వచ్ఛంద సంస్థల సహకారం కూడా తీసుకుంటామని అన్నారు. 16వ డివిజన్ కార్పొరేటర్ హసీంబేగ్ మాట్లాడుతూ తన తండ్రి కలీం బేగ్ మరియు తల్లి మొవ్వ పార్వతి కౌన్సిలర్లుగా మచిలీపట్నంలో సేవలు అందించరని నగర ప్రజలు తమ కుటుంబ రాజకీయ చరిత్రను గుర్తించి అబ్దుల్ అభీదా కు మేయర్ గా పని చేసే అవకాశం కల్పించడం తమ కుటుంబ అదృష్టంగా భావిస్తున్నామని, మచిలీ పట్నం ప్రజలకు సేవలు అందించి ప్రజల రుణం తీర్చుకుంటామని అన్నారు. సభకు అధ్యక్షత వ హించిన న్యాయవాది లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వేమూరి వెంకటసుబ్బయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తమ సంస్థ సుబ్బయ్య వంద సంవత్సరాలు పూర్తి చేసిన సందర్భంగా అభినందన కార్యక్రమం ఏర్పాటు చేయడం సంతోషదాయకం అని అన్నా రు. ఎంతో చరిత్ర కలిగిన మచిలీపట్నం ని గత కీర్తి తిరిగి పొందే విధంగా నగరాన్ని అభివృద్ధి బాటలో నడిపించడానికి రాజకీయాలకు అతీతంగా నూతన కార్యవర్గం కృషి చేయాలని అన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి వెంకట బాబా ప్రసాద్ మాట్లాడుతూ నగర ప్రజలు చంద్రబాబు నాయు డు పవన్ కళ్యాణ్ బిజెపి పై నమ్మకంతో అత్యధిక మెజార్టీతో కూటమి అభ్యర్థులను గెలిపించరని అందుకు ప్రజలను తీర్చుకుంటామని అన్నారు. వేమూరి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వేమూరి వెంకట రమే ష్ మాట్లాడుతూ ఎందరో రాజకీయ నాయకులకు వేదికైనా సుబ్బయ్య హోటల్ వంద సంవత్స రాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నూతన మేయర్ మరియు కార్పొరేటర్లు అభినందన ఏర్పా టు చేయడం జరిగిందని తెలియజేశారు.నగర అభివృద్ధికి తమ సంస్థ సంపూర్ణ సహాయ కార్యక్రమాలు అందిస్తుందని అన్నారు. నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు మరకాని సమతా కీర్తి, దింటకుర్తి వెంకట సుధాకర్, అన్నం ఆనంద్, పిట్టా సౌమ్యశ్రీ కోటి, సీనియర్ మాజీ కౌన్సిలర్ గనిపిశెట్టి గోపాల్, నగర ప్రముఖులు వేమూరి బాలు తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మరకా ని బాబి, వనజ మెస్ అధినేత మురళి, మోడ్రన్ ఆప్టికల్ యజమాని నియాజుద్దీన్, కూతుబుద్దీన్, మాగంటి రమణ, న్యాయవాదులు మాటూరి రాజేష్,లంకిశెట్టి సాయిపణి సంతోష్, సింగ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



శ్రీ కనకదుర్గమ్మ వారికి స్వర్ణాభరణాల సమర్పణ


ప్రజా భూమి ప్రతినిధి విజయవాడ



విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న జగన్మాత శ్రీ కనకదుర్గమ్మ వారికి కార్తీక మాసం పురస్కరించుకుని ఒక భక్త కుటుంబం భక్తిశ్రద్ధ లతో స్వర్ణ కానుక లను సమర్పించారు.విజయ వాడ వన్ టౌన్‌కు చెంది న భక్తులు ప్రసూనాంబ, . ప్రసాద్ కుటుంబసభ్యులతో కలిసి సోమవారం దేవస్థాన కార్యాలయానికి విచ్చేశారు. శ్రీ అమ్మ వారి మూలవిరాట్ అలంకరణ నిమిత్తం 192.500 గ్రాముల బంగారు కాసుల పేరు, 104.300 గ్రాముల బంగారు సూత్రాలు మరియు గొలుసు లను (మొత్తం 296.800 గ్రాముల బంగారు ఆభర ణాలను) దేవస్థానం చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), కార్యనిర్వహణాధికారి (ఈవో) శీనా నాయ క్ సమక్షంలో ఆలయానికి అందజేశారు.స్థా నాచార్య శ్రీ శివ ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ లు నిర్వహించిన అనంతరం, దేవస్థాన అధికారులు ఆలయ నిబంధనల ప్రకారం ఈ ఆభరణాలను స్వీక రించి దాతలకు రశీదును అందజేశారు. అనంతరం దాతల కుటుంబానికి శ్రీ అమ్మవారి ప్రత్యేక దర్శనం కల్పించి, వేద ఆశీర్వచనంతో పాటు అమ్మవారి ప్రసాదాలు మరియు శేషవస్త్రాలను బహూకరించారు.



శ్రీ కనకదుర్గమ్మ అలంకరణకు 63 గ్రాముల బంగారు హారం విరాళం





రాయచూర్ భక్తురాలు శిరీష భక్తితో బంగారు హారం సమర్పణ

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ

విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి అలంకరణ నిమిత్తం కర్ణాటక రాష్ట్రం రాయచూర్‌కు చెందిన భక్తురాలు శిరీష 63 గ్రాముల బంగారు హారాన్ని ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ)కు భక్తిశ్రద్ధలతో అందజేశారు.ఈ సందర్భంగా ఆలయ నిబంధనల ప్రకారం భక్తురాలికి అధికారిక రసీదును అందజేశారు. అనంతరం శ్రీ అమ్మవారి దర్శనం కల్పించి, ఆశీర్వచన ఏర్పాట్లు చేశారు.శ్రీ అమ్మవారిపై తమకున్న భక్తిని చాటుకుంటూ బంగారు హారాన్ని సమర్పించిన భక్తురాలు శిరీషను ఆలయ అధికారులు అభినందించారు.

సిరివెళ్ల పాలెం సర్పంచ్ పై దాడి కేసు కొట్టివేత

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నంః



మచిలీపట్నం మండలం సిరివెళ్లపాలెం గ్రామ మాజీ సర్పం చ్ సిరివెళ్ల బలరామమూర్తి పై దాడి చేసి గాయపరిచారని అభియోగము మోపిన క్రిమినల్ కేసులో ముగ్గురు నింది తులపై నేరం రుజువు కాకపోవడంతో కేసు కొట్టివేస్తూ మచి లీపట్నం మొబైల్ కోర్టు మెజిస్ట్రేట్ జె బి టి ఎస్ దేవి సోమ వారం తీర్పు చెప్పారు. మచిలీపట్నం మండలం మంగిన పూడి శివారు సిరివెళ్లపాలెం సర్పంచి గా పనిచేసిన సిరివెళ్ల బలరామమూర్తి 2020 సంవత్సరంలో గ్రామంలో కాలువల తవ్వింపు విషయంలో ఏర్పడిన ఘర్షణ పురస్కరించు కుని అదే గ్రామానికి చెందిన నిందితులు సిరివెళ్ల రాంబాబు (57) సిరివెళ్ల వెంకటేశ్వరమ్మ (50) సిరివెళ్ల నాగమల్లేశ్వరరావు (28) కలిసి తనను అసభ్యకరంగా దూషించి కర్రలతో కొట్టి గాయప చ్చారని 2020 అక్టోబర్ 18 వ తేదీన బందర్ తాలూకా పోలీస్ స్టేషన్లో సర్పంచి బలరా మూర్తి ఫిర్యాదు చేశాడు. బందరు తాలూకా పోలీసులు కేసు విచారణ చేసి నిందితుల ముగ్గురిపై324,506 ఐపీసీ సెక్షన్లు క్రింద చార్జీషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో గ్రామ సర్పంచ్ అనధికారికంగా పనిచేస్తూ కేవలం రాజకీయ కక్షతో అక్రమంగా కేసు బనా యించినట్లు నిందితులు పేర్కొన్నారు. కేసు విచారణలో ఆరుగురు సాక్షులను విచారించారు. కేసు విచారణ అనంతరం నిందితులపై నేరారోపణకు తగిన సాక్ష్యాధారాలు లేవని కేసు కొట్టివేస్తూ న్యాయమూర్తి దేవి తీర్పు చెప్పారు. నిందితులు తరపున న్యాయవాదులుగా లంకిశెట్టి బాలాజీ, వందంశెట్టి జగతిశ్రీ, లంకిశెట్టి సాయి ఫణి సంతోష్ చిన్నంశెట్టి ఆశా నాగ మౌనిక కేసు వాదించారు.

మానవత్వం చాటుకున్న కార్పొరేటర్ చంటి..

పెట్రోల్ అయిపోయిన వ్యక్తికి తక్షణ సాయం!

ప్రజా భూమి ప్రతినిధి విజయవాడ


మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో పోలీస్ కంట్రోల్ రూమ్ నుంచి తుమ్మలపల్లి కళాక్షేత్రం మీదుగా ఓ వ్యక్తి తన ద్విచక్ర వాహ నంపై లగేజీతో వెళ్తుండగా మార్గమధ్యంలో పెట్రోల్ అయిపోవడంతో బండిని తోసుకుంటూ వెళ్తున్నాడు.అదే సమయంలో అటుగా వెళ్తున్న 48వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వర రావు (చంటి) ఆ వ్యక్తిని గమనించి, ఏమైందని ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు. తన బండిలో పెట్రోల్ అయిపోయిందని ఆ వ్యక్తి చెప్పడంతో వెంటనే స్పందించిన చంటి తన ద్విచక్ర వాహనంలోని పెట్రోల్‌ను బాటి ల్ ద్వారా తీసి ఆ వ్యక్తి వాహ నంలో పోశారు.అనుకోని సమయంలో అం దిన ఈ సహాయంతో ఆ వ్యక్తి ఎంతో సంతోషం వ్యక్తం చేస్తూ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి) హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపి తన ప్రయాణాన్ని కొనసాగించారు.ఆ వ్యక్తి ముఖంలో కనిపించిన ఆనందాన్ని చూసి చంటి కూడా ఎంతో సంతోషం వ్యక్తం చేశారు.



ప్రజాభూమి

ఏలూరు, పశ్చిమగోదావరి 4

మంగళవారం 17 నవంబర్ 2026



ఈవిఎం గోడౌన్ ను తనిఖీ చేసిన
జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి

ప్రజాభూమి బ్యూరో ఏలూరు జిల్లా

ఏలూరు, జిల్లా కలెక్టరేటు ప్రాంగణంలో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగు మిషన్ల గోడౌన్ ను సోమవారం జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి తనిఖీ చేశారు. ఈవిఎం గోడౌన్ వద్ద సిసి కెమేరాలతో ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను, ఈవిఎం యంత్రాలు బి.యులు, సియులు, వివిప్యాట్ లను, అధికారులతో కలిసి కలెక్టర్ వెట్రిసెల్వి పరిశీలించారు. అనంతరం పరిశీలన రిజిస్టరులో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి సంతకం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు మేరకు ఈవీఎం గోడౌన్ తనిఖీలో భాగంగా ఈవిఎం గోడౌన్ కు వేసిన భద్రతా సీళ్లు, సిసి కెమెరాలు పనితీరు, అగ్నిమాపక దళ పరికరాలు, మొదలైనవి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ భారతీయ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవిఎం గోడౌన్ కు పటిష్ట భద్రత కల్పించామన్నారు. ఎప్పటి కప్పుడు గౌడౌన్ క్షుణంగా తనిఖీ చేసి ఎన్నికల సంఘానికి నివేదిక పంపిస్తున్నామన్నారు. ఈవిఎం గోడౌన్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఇంచార్జి జిల్లా రెవెన్యూ అధికారి జి.రవీందర్, ఎన్నికల విభాగం సిబ్బంది నాయక్, ప్రభృతులు పాల్గొన్నారు.

మేయర్ రెడ్డి అప్పలనాయుడుని సత్కరించిన టీమ్ కాపు సంక్షేమ సేవాసంఘం



ప్రజాభూమి బ్యూరో ఏలూరు జిల్లా

ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఘన విజయం సాధించిన మేయర్ రెడ్డి అప్పలనాయుడిని పులి శ్రీరాములు సారధ్యంలో కాపుసంక్షేమ సేవాసంఘ టీమ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పులి శ్రీరాములు మాట్లాడుతూ రానున్న రోజుల్లో మేయర్ రెడ్డి అప్పల నాయుడు మరిన్ని ఉన్నతమైన పదవులను అధిరోహించాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది కానాల రామకృష్ణ, జిల్లా కాంట్రాక్టర్ల సంఘ అధ్యక్షులు మోటేపల్లి చంద్రశేఖర్,సీనియర్ జర్నలిస్ట్ సోడిశెట్టి శాంతకుమార్, కాపుసంక్షేమ సేవాసంఘ నాయకులు వాసా రాజు, సామర్ల వెంకటేశ్వర రావు,పాటే రాంబాబు ,బడే సతీష్ నాయుడు, విశాల శేషగిరి,గాదం రామకృష్ణ,
దండిపాటి జగన్,పాలేటి భాస్కర రావు,మంచెం వెంకటేశ్వర రావు గాదం శ్యామ్ సురాధ్య ,కాకర్ల శ్రీను,రావూరి మోహన్,పులి మార్కండేశ్వరరావు,వరిదే నారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో భావవ్యక్తీకరణకు వేదికగా వ్యాసరచన పోటీలు



ప్రజా భూమి ప్రతినిధి ఆగిరిపల్లి

59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఆగిరిపల్లి శాఖా గ్రంథాలయంలో 9వ తరగతి విద్యార్థులకు “నాకు నచ్చిన పుస్తకం” అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు తాము చదివిన పుస్తకాలు, వాటి ద్వారా పొందిన అనుభవాలను వ్యాసాల రూపంలో వివరించారు. ఈ కార్యక్రమంలో సరస్వతీ విద్యాలయం ఆంగ్ల ఉపాధ్యాయురాలు పి. మానస, గ్రంథాలయ పాఠకుడు మల్లవెల్లి రాంబాబు, గ్రామ పెద్దలు, పాఠకులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు.

రేషన్ మాఫియాపై ఉక్కుపాదం

- డీఎస్ఓ బాబు విలియమ్స్ హెచ్చరిక



ప్రజాభూమి ఏలూరు

జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే పీడీ చట్టం కింద కేసులు నమోదు చేస్తామని జిల్లా పౌర సరఫరాల అధికారి బాబు విలియమ్స్ హెచ్చరించారు.సోమవారం నిర్వహించిన తనిఖీల్లో భాగంగా కొయ్యలగూడెం మండలం రాజవరం, కన్నాపురం గ్రామాల్లో రేషన్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశామని, బియ్యం నిల్వల్లో ఎలాంటి వ్యత్యాసాలు గుర్తించలేదని తెలిపారు. రేషన్ బియ్యాన్ని ఇతరులకు విక్రయిస్తే సంబంధిత కార్డులను రద్దు చేస్తామని స్పష్టం చేశారు.ప్రస్తుతం జిల్లాలో 9 ధరణి కేంద్రాల ద్వారా రాయితీపై బీపీటీ సన్న బియ్యం అందిస్తున్నామని, త్వరలో ప్రతి మండల కేంద్రంలోనూ ధరణి కేంద్రాలను ఏర్పాటు చేసి నాణ్యమైన సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తామని చెప్పారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాపై నిఘా మరింత పెంచుతామని డీఎస్ఓ వెల్లడించారు.

లయన్స్ సేవల విస్తరణకు సభ్యత్వ పెంపు, విరాళాలు కీలకం

ప్రజాభూమి ఏలూరు



గ్రీన్ సిటీలోని లయన్స్ భవనంలో జిల్లా 316 జి గ్లోబల్ యాక్షన్ టీమ్,ఎల్సీఐఎఫ్ కాంక్లేవ్‌ను జిల్లా గవర్నర్ డాక్టర్ డి. సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని లయన్స్ గాట్ ఏరియా లీడర్ ముల్పూరి ఉపేంద్ర ప్రారంభించారు.ఈ సందర్భంగా ముల్పూరి ఉపేంద్ర మాట్లాడుతూ లయన్స్ సేవలను విస్తృతం చేయడానికి సభ్యత్వాన్ని పెంచుకోవాలని సూచించారు. ఎల్సీఐఎఫ్ ఏరియా లీడర్ సీహెచ్ కృష్ణంరాజు సంస్థ బలోపేతానికి విరాళాలు అందించాలని కోరారు.ముఖ్య అతిథి డాక్టర్ ఏ. గోపాలరావు మాట్లాడుతూ సభ్యత్వ పెంపుతో పాటు అంతర్జాతీయ సంస్థకు విరాళాలు అందించడం కూడా ముఖ్యమన్నారు.జిల్లా గవర్నర్ డాక్టర్ డి. సుబ్బారావు మాట్లాడుతూ సభ్యత్వం,విరాళాల ద్వారా అంతర్జాతీయ సంస్థ నుంచి మరిన్ని నిధులు పొంది సేవా కార్యక్రమాలను విస్తరించవచ్చని తెలిపారు.కార్యక్రమంలో మల్టిపుల్ కౌన్సిల్ కార్యదర్శి జి. శేషగిరిరావు,కోశాధికారి ఎన్.వి.వి.ఎస్.పాపారావు నాయుడు,ప్రథమ వైస్ గవర్నర్ ఆర్.వి.ఎస్. సూర్యనారాయణరాజు, ద్వితీయ వైస్ గవర్నర్ వి. సత్య స్వరూప్ పాల్గొన్నారు.ఫ్యాకల్టీ సభ్యులు అనిల్ కుమార్ సేయట్,మేక శ్రీరామ్ సురేష్,దామర్ల శ్రీశాంతి, కాకరాల వేణుబాబు శిక్షణ అందించారు.జిల్లా క్యాబినెట్ కార్యదర్శి ఎల్. వెంకటేశ్వరరావు స్వాగతం పలికారు.జిల్లా పూర్వ గవర్నర్లు కే.వి. కిషోర్ కుమార్,డాక్టర్ పి. విజయభాస్కర్ రెడ్డి, కోశాధికారి కే.బి. రావు, పుట్టా విజయశ్రీ,సీహెచ్ అవినాష్ రాజ్,వెల్లంకి నరేష్ కుమార్, వి. రత్నకుమార్,డాక్టర్ ఎస్. రాజ్యలక్ష్మి,ఉలుసు భాస్కరరావు,ఎం. శ్రీహరి, వి. విష్ణుకుమార్ పాల్గొన్నారు.

చింతలపూడి నగర పంచాయతీ రిజర్వేషన్లలో
బీసీలకు తీవ్ర అన్యాయం!

- జనాభా ప్రాతిపదికన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలి
- జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏలూరు జిల్లా డిమాండ్



ప్రజా భూమి బ్యూరో ఏలూరు జిల్లా

చింతలపూడి నగర పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లలో బీసీలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏలూరు జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏలూరు జిల్లా కలెక్టర్ కె. వెట్రీ సెల్విని కలిసి వినతిపత్రం సమర్పించారు. చింతలపూడి నగర పంచాయతీ పరిధిలో బీసీ జనాభా సుమారు 55 నుంచి 60 శాతం వరకు ఉన్నట్లు స్థానిక అంచనాలు సూచిస్తున్నప్పటికీ, మొత్తం 23 వార్డులకు గాను బీసీలకు కేవలం ఒకే ఒక్క వార్డు (4.35 శాతం) కేటాయించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని నాయకులు పేర్కొన్నారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు న్యాయమైన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేలా ప్రస్తుత రిజర్వేషన్లను పునఃపరిశీలించాలని, ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి తగిన న్యాయం జరిగేలా నివేదిక పంపించాలని కలెక్టర్‌ను కోరారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం, చింతలపూడి నగర పంచాయతీ విషయంలో బీసీలకు తగిన ప్రాతినిధ్యం ఎందుకు కల్పించలేదని నాయకులు ప్రశ్నించారు. బీసీల హక్కుల కోసం పోరాడుతామని చెప్పే ప్రతిపక్ష పార్టీలు సైతం ఈ అన్యాయంపై స్పందించకపోవడం విచారకరమన్నారు.

బీసీ కులాల అభ్యర్థులు ఎన్నికల్లో పోటీ చేసి ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములయ్యేలా తగిన రిజర్వేషన్లు కల్పించాలని, ఈ సమస్యపై ప్రభుత్వం తక్షణమే స్పందించి న్యాయమైన నిర్ణయం తీసుకోవాలని బీసీ అఖిలపక్ష సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బీసీల రాజకీయ హక్కుల సాధన కోసం ప్రజల పక్షాన ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు:

జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షులు లక్కోజు రాజగోపాలచారి, రాష్ట్ర బీసీ మహిళా నాయకురాలు, చింతలపూడి బీసీ ఐక్యవేదిక అధ్యక్షురాలు పట్నాల విజయలక్ష్మి, రాష్ట్ర గౌడ సంఘం ఉపాధ్యక్షులు సిహెచ్. అశోక్ గౌడ్, రాష్ట్ర బీసీ నాయకులు నరం ముత్యాలరావు, రాష్ట్ర బీసీ జేఏసీ ఉపాధ్యక్షులు ఉక్కుసూరి గోపాలకృష్ణ, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం ఎన్నికల ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి అప్పలభక్తుల శివకేశవరావు (శివశ్రీ), బీసీ నాయకులు ద్రోణాదుల శ్రీనివాస్, రాష్ట్ర సంచార జాతుల అధ్యక్షులు అన్నపునేని మురళి తదితర బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.


ఐక్యతతోనే గ్రామాల అభివృద్ధి..

- పంచాయతీ ఎన్నికల్లో నూరుశాతం విజయం సాధించాలి

ప్రజా భూమి ప్రతినిధి ఆగిరిపల్లి



ఆగిరిపల్లి మండలం సింహాద్రి అప్పారావుపేట--రాజవరం గొల్లగూడెంలోని కాట్రగడ్డ గార్డెన్స్‌లో సోమవారం కూటమి నాయకులు, స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందిన, ఓటమి పాలైన అభ్యర్థులతో రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పార్టీకోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ భవిష్యత్తులో తగిన గుర్తింపు, అవకాశాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. గెలుపోటములను పక్కనపెట్టి గ్రూపులు, పంతాలు విడనాడి 25 గ్రామపంచాయతీల్లో కూటమి శ్రేణులంతా ఐక్యంగా పనిచేసి నూరుశాతం విజయం సాధించాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు 50 శాతానికి తగ్గకుండా ప్రాతినిధ్యం కల్పించడం సామాజిక న్యాయంలో భాగమని, గ్రామాల సమగ్ర అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా ప్రజలంతా ఏకగ్రీవాలకు సహకరించాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపీ అగ్రిమిషన్ వైస్‌చైర్మన్, నియోజకవర్గ పరిశీలకులు మర్రిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభ్యర్థులు పాల్గొన్నారు.



సమాచార హక్కు చట్టంపై
అవగాహన సదస్సు

ప్రజాభూమి ఏలూరు

59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సోమవారం టీమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కమ్మ శివరామ కృష్ణ అధ్యక్షత వహించగా, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం. శేఖర్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ రాము సూర్యారావుతో పాటు పలువురు నాయకులు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో బ్రహ్మాస్త్రం వంటిదని పేర్కొన్నారు. అనంతరం రాము సూర్యారావును ఆయన సేవలను గుర్తిస్తూ శాలువాతో ఘనంగా సన్మానించారు. తదుపరి వివిధ పాఠశాలల విద్యార్థులకు కరెంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జ్ అంశాలపై క్విజ్ పోటీలు నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా జి.వరసాయిలక్ష్మి, పి. అనురాధ వ్యవహరించారు. అలాగే గ్రంథాలయ ఉద్యమకారులు ఎస్.ఆర్. రంగనాథన్, అయ్యంకి వెంకట రమణయ్య, పాతూరి నాగభూషణం చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం నిర్వాహకులు, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెరువులో గల్లంతైన యువ లెక్చరర్.. మృతదేహం లభ్యం

ప్రజా భూమి ప్రతినిధి ఆగిరిపల్లి

ఆగిరిపల్లి మండలం తోటపల్లి గ్రామంలోని బ్రహ్మయ్యలింగం చెరువులో ఈతకు వెళ్లి గల్లంతైన యువకుడు వీరంకి లోకేష్ (23) మృతదేహాన్ని సోమవారం పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెలికితీశారు. కృష్ణా జిల్లా మచిలీపట్నం బర్రిపోతుల పాలెం గ్రామానికి చెందిన లోకేష్ తోటపల్లి హిల్ స్కూల్‌లో పార్ట్‌టైమ్ గణిత అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. ఆదివారం పాఠశాల విద్యార్థులతో కలిసి చెరువులో ఈతకు వెళ్లిన సమయంలో లోతైన ప్రాంతంలోకి వెళ్లి నీట మునిగి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది చెరువులో గాలింపు చేపట్టి మృతదేహాన్ని గుర్తించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఆగిరిపల్లి ఎస్సై వి. సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పాలకొల్లు మున్సిపల్ చైర్‌పర్సన్ కూటమి అభ్యర్థిగా అబోతుల ఉషారాణి నామినేషన్

- మంత్రి నిమ్మల నాయకత్వంలో కూటమి భారీ బైక్ ర్యాలీ..
- రెండున్నరేళ్లలో పాలకొల్లు నియోజకవర్గానికి రూ.1,275 కోట్ల నిధులు తీసుకొచ్చాం:
- మంత్రి నిమ్మల

ప్రజాభూమి ప్రతి నిధి పాలకొల్లు



పాలకొల్లు మున్సిపల్ ఎన్నికల సమరంలో కూటమి ప్రచార జోరు మొదలైంది. మున్సిపల్ చైర్‌పర్సన్ కూటమి అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీకి చెందిన అబోతుల ఉషారాణి సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. పట్టణంలోని పలు వార్డులకు కౌన్సిలర్లుగా కూటమి బలపరిచిన టిడిపి జనసేన బిజెపిలకు చెందిన కఅభ్యర్థులు సైతం తమ నామినేషన్లు దాఖలు చేశారు.

భారీ మోటర్ సైకిల్ ర్యాలీ...
భారీ బైక్ ర్యాలీతో సందడి

నామినేషన్ల కార్యక్రమానికి ముందు మంత్రి నిమ్మల రామానాయుడు నాయకత్వంలో కూటమి శ్రేణులు భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించాయి. పూలపల్లి వై జంక్షన్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు సాగిన ఈ ర్యాలీలో మంత్రి నిమ్మల స్వయంగా ద్విచక్ర వాహనం నడుపుతూ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. ర్యాలీ మార్గంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పలు చోట్ల స్వయంగా వాహనాలను క్రమబద్ధీకరిస్తూ ట్రాఫిక్ క్లియర్ చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పెద్ద సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వ రెండున్నరేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మెచ్చి ప్రజలు కూటమి అభ్యర్థులకు అఖండ విజయాన్ని అందించారన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ సంక్షేమ పథకాల అమలులో ఎక్కడా రాజీ పడకుండా ముందుకు సాగుతున్నామని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని పేర్కొన్నారు. పాలకొల్లు మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థిగా ఉన్నత విద్యావంతురాలైన అబోతుల ఉషారాణిని బరిలోకి దించామని, కూటమి ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న విశ్వాసంతో ఆమెతో పాటు కూటమి అభ్యర్థులందరినీ భారీ మెజారిటీతో గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. గత రెండున్నరేళ్లలోనే పాలకొల్లు నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.1,275 కోట్ల నిధులు తీసుకొచ్చి అనేక అభివృద్ధి పనులు చేపట్టామని మంత్రి తెలిపారు. భవిష్యత్తులోనూ మరిన్ని నిధులు తీసుకొచ్చి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఉండాలంటే మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయాన్ని ప్రజలు బాధ్యతగా తీసుకోవాలని కోరారు.

2029 విజయానికి స్థానిక ఎన్నికలే సంకేతం

ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి ప్రజలు అందించిన విజయాన్ని రెండున్నరేళ్ల పాలనకు రిటర్న్ గిఫ్ట్‌గా భావిస్తున్నామని నిమ్మల అన్నారు. కూటమి సమర్థ నాయకత్వం, జవాబుదారీతనం, అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయం చేస్తూ సాగిస్తున్న పాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని పేర్కొన్నారు. 2029 ఎన్నికల ఫలితాలకు ప్రస్తుత స్థానిక ఎన్నికల విజయాలు సూచికగా నిలుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జరగబోయే మున్సిపల్, పంచాయతీ ఎన్నికల్లోనూ కూటమి విజయపరంపర కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ పాలనలో చోటుచేసుకున్న అరాచకాలను ప్రజలు మరచిపోలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే వాటిని అరికట్టిందని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణకు తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ అభ్యర్థి ఉషారాణి, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, ఏఎంసీ మాజీ చైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు, జనసేన నాయకులు బోనం చినబాబు, తుల రామలింగేశ్వరరావు, బిజెపి నాయకులు కొండ ప్రసాద్, టిడిపి నాయకులు పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాభూమి
కోనసీమ
5
మంగళవారం 17 నవంబర్ 2026

బంగాళాఖాతంలో బలపడుతున్న వాయుగుండం

- రెండు దిశల్లో తుపాను ముప్పుపై ఉత్కంఠ


ప్రజాభూమి బ్యూరో ఏలూరు జిల్లా.

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం క్రమంగా బలపడుతూ ఉత్తర వాయువ్య దిశగా పయనిస్తోంది. నవంబర్ 15 ఉదయం 11:30 గంటల ఐఎండి పరిశీలన ప్రకారం ఇది విశాఖపట్నానికి సుమారు 960 కిలోమీటర్ల దక్షిణ-ఆగ్నేయ దిశలో కేంద్రీకృతమై ఉంది. గడిచిన కాలంలో ఆరు గంటల్లో గంటకు 15 కిలోమీటర్ల వేగంతో కదిలింది.

తుపాను తీవ్రత పెరిగే అవకాశం..

ఐఎండి అంచనా ప్రకారం నవంబర్ 15 రాత్రికి తీవ్ర వాయుగుండంగా, 16వ తేదీన తుపానుగా, 17వ తేదీన తీవ్ర తుపానుగా బలపడే అవకాశం ఉంది. నవంబర్ 18 నాటికి అత్యంత తీవ్ర తుపానుగా మారవచ్చని, 19వ తేదీ నాటికి గంటకు 120--130 కిలోమీటర్ల వేగంతో, అప్పుడప్పుడు 145 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచవచ్చని అంచనా.

రెండు ట్రాక్‌లపై ఉత్కంఠ..



ఈ తుపాను ప్రయాణ మార్గంపై ప్రస్తుతం రెండు రకాల అంచనాలు చర్చలో ఉన్నాయి. మొదటి అంచనా ప్రకారం తమిళనాడు సముద్ర ప్రాంతం మీదుగా ఆంధ్రప్రదేశ్ తీరానికి చేరి కాకినాడ పరిసరాల్లో తీరం దాటే అవకాశం ఉంది. మరో అంచనా ప్రకారం దిశ మార్చుకుని పశ్చిమ బెంగాల్‌లోని సుందర్బన్స్ మీదుగా బంగ్లాదేశ్ వైపు వెళ్లే అవకాశముంది. అయితే రెండో మార్గం అధికారికంగా ధ్రువీకరించబడలేదు. ఐఎండి తాజా అధికారిక అంచనా మాత్రం ఈ వ్యవస్థ మరింత బలపడి వాయువ్య దిశగా కదులుతూ ఆంధ్రప్రదేశ్ తీరం వైపు వచ్చే అవకాశాన్ని సూచిస్తోంది. ఖచ్చితంగా ఎక్కడ తీరం దాటుతుందనేది ఇంకా స్పష్టత రాలేదు.

ఉత్తరాంధ్రకు అప్రమత్తత..

విశాఖపట్నం, గంగవరం, కాకినాడ పోర్టుల్లో దూరపు హెచ్చరిక సంకేతాలు కొనసాగుతున్నాయి. ఉత్తరాంధ్ర తీరంలో సముద్రం అల్లకల్లోలంగా మారే అవకాశం ఉండటంతో మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని హెచ్చరికలు జారీ అయ్యాయి. నవంబర్ 19, 20 తేదీల్లో కోస్తాంధ్రలో భారీ నుంచి అతిభారీ వర్షాలు, అక్కడక్కడ అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండి తెలిపింది. తుపాను మార్గం, తీవ్రతపై త్వరలో మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. విశాఖతో పాటు ఉత్తరాంధ్ర తీరప్రాంత ప్రజలు వాతావరణ శాఖ, ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికలను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించింది.



మేయర్ రెడ్డి అప్పలనాయుడుకు తూర్పు కాపు సంఘం నాయకుల ఆహ్వానం

ప్రజాభూమి ఏలూరు

నగర మేయర్ రెడ్డి అప్పలనాయుడుని తూర్పు కాపు సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా మేయర్‌కు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.అనంతరం కార్తీక మాసాన్ని పురస్కరించుకుని తూర్పు కాపు సంఘం ఆధ్వర్యంలో డిసెంబర్ 6వ తేదీన నిర్వహించనున్న వన సమారాధన కార్యక్రమానికి మేయర్ రెడ్డి అప్పలనాయుడుని ఘనంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా కార్యక్రమం విశిష్టతను వివరించి, కుటుంబ సభ్యులు,సంఘ పెద్దలు,నాయకులు, సభ్యుల సమక్షంలో నిర్వహించనున్న ఈ వేడుకకు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.తూర్పు కాపు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ వన సమారాధన కార్యక్రమంలో మేయర్ పాల్గొని వేడుకను మరింత వైభవంగా తీర్చిదిద్దాలని నాయకులు ఆకాంక్షించారు.

కోట మండలంలో ప్రశాంతంగా నామినేషన్లు


- తాడిచర్ల పంచాయతీ నుండి పెద్ద ఎత్తున నామినేషన్లు

ప్రజా భూమి ప్రతినిధి, కామవరపుకోట

పంచాయతీ ఎన్నికలు కామవరపుకోట మండలంలో వేడెక్కాయి. మేజర్ పంచాయతీలోని అనేక వాటి నుండి కూటమి నాయకులు, వైఎస్ఆర్సిపి నాయకులు పెద్ద ఎత్తున నామినేషన్ దాఖలు చేశారు. ప్రధాన పార్టీలతో పాటుగా స్వతంత్ర అభ్యర్థులు కూడా పెద్ద ఎత్తున నామినేషన్ దాఖలు చేయడం విశేషం. నామినేషన్ లో ఉపసంహరణ అనంతరం ఎంతమంది నిలబడతారో, ఎంతమంది ఉపసంహరించుకుంటారు తేలవలసి ఉంది. ఒకే పార్టీ నుండి పలువురు నాయకులు వారి అనుసర గణంతో నామినేషన్ వేయించారు. కామవరపుకోట మండలంలో పంచాయితీ ఎన్నికల నామినేషన్లు కోలాహలంగా నిర్వహిస్తున్నారు. ఎవరికి వారు తీన్మార్ డబ్బులు, మోటారు సైకిల్ ర్యాలీలు, అభిమానులతో ర్యాలీలు నిర్వహించారు. ఏది ఏమైనా కామవరపుకోట పంచాయతీలో నామినేషన్ల పర్వం ప్రశాంతంగా నిర్వహించారు. తడికిల



పూడి పోలీసులు అత్యంత పకడ్బందీగా కంట్రోల్ నిర్వహించారు. మండలంలోని అన్ని పంచాయతీల నుండి కార్తీక సోమవారం అవడంతో ప్రతి ఒక్కరు నామినేషన్ దాఖలు చేశారు.కామవరపుకోట నుండి తాడిచర్ల పంచాయతీ తెలుగుదేశం పార్టీ ఎన్డీఏ సర్పంచ్ అభ్యర్థిగా మానుకొండ పార్థ సారధి 10 వర్డ్స్ మెంబెర్స్ ఈ రోజు కామవరపుకోట పంచాయతీ కార్యాలయంలకి ర్యాలీగా వెళ్లి నామినేషన్ వేశారు. ఈ కార్యక్రమంలో అబ్బూరి సూర్యప్రకాశరవు, అబ్బూరి లక్ష్మి నారాయణ, ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



అధిష్టానం ఆశీస్సులు తనకే ఉంటాయని ఆశిస్తున్నా

- టిడిపి తరపున నామినేషన్ వేసిన రోజా రమణి వెల్లడి

ప్రజాభూమి ప్రతినిధి పాలకొల్లు

సీఎం చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ ఆశీస్సులు తనకే ఉంటాయని, బిఫోర్మ్ తనకే ఇస్తారని ఆకాంక్షిస్తున్నట్లు టిడిపి రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు, మాజీ మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ కర్నెన రోజారమణి తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు పురపాలక సంఘ వైర్ పర్సన్ అభ్యర్థిని గా టిడిపి తరపున, ఇండిపెండెంట్గా నామినేషన్ దాఖలు చేసిన కర్నెన రోజా రమణి సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. తను బీసీ తూర్పు కాపు సామాజిక వర్గానికి చెందిన మహిళనని ఎమ్మెల్యే ఎలక్షన్ తో పాటు ఏ ఎలక్షన్ వచ్చిన టిడిపికి సేవలందించి అభ్యర్థులు గెలిపించడంలో తాను, తన భర్త గౌరనాయుడు కష్టం ఎంతో ఉందని తెలిపారు. తనకు పట్టణంలో పూర్తిస్థాయి అనుభవం ఉందని ప్రజల సమస్యలను పరిష్కరించగల పాలన అనుభవం తనకు ఉందని తెలిపారు. టీడీపీ లో మహిళ కష్టాన్ని అధిష్టానం ఎప్పుడూ గుర్తిస్తుందని ఆశిస్తూ ఉన్నట్లు తెలిపారు. 19వ తారీకు చివర క్షణం వరకు టిడిపి చైర్పర్సన్ అభ్యర్థిత్వం తనకే వస్తుందని ఆశతో, ద్రుడ నమ్మకంతో ఉంటానని రోజారమణి వెల్లడించారు.

సాహితీమూర్తులను గౌరవించడం అభినందనీయం

- ఎమ్మెల్యే బడేటి చంటి,చింతమనేని ప్రభాకర్

ప్రజాభూమి ఏలూరు

వైఎంహెచ్ఏ హాలులో గుప్తా ఫౌండేషన్ వ్యవస్థాపకులు మడుపల్లి మోహన్ గుప్తా ఆధ్వర్యంలో నిర్వహించిన 'గుప్తా అవార్డ్స్--2026, శ్రీ కృష్ణమూర్తి సాహిత్య పురస్కార' ప్రదానోత్సవంలో ఎమ్మెల్యేలు చంటి,ప్రభాకర్లు విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశేష సేవలందించిన పద్మశ్రీ అవార్డు గ్రహీత ప్రముఖ వయోలిన్ విద్వాంసులు అన్నవరపు రామస్వామి, వైద్యరంగంలో సేవలందిస్తున్న డాక్టర్ సూరి ప్రముఖ పరిశోధకురాలు డాక్టర్ కాత్యాయని శ్రీ కృష్ణమూర్తి సాహిత్య పురస్కారాలను అందుకున్నారు. పురస్కార గ్రహీతలను శాలువాలతో సత్కరించి, వారి పాదాలకు నమస్కరించి ఆశీస్సులు తీసుకున్నారు. సాహితీవేత్తలు, ప్రముఖులను గుర్తించి గౌరవించడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు.సమాజ హితం కోసం మడుపల్లి మోహన్ గుప్తా చేపడుతున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని కొనియాడారు.దెందులూరు నియోజకవర్గం



లోనూ స్వచ్ఛందంగా ముందుకొచ్చి పలు నిర్మాణ పనులకు సహకరించడం ఆయన సేవా నిరతికి నిదర్శనమన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, టీ టీ డి మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు, సాహితీ అవార్డు గ్రహీతలు విజయవంతం చేసిన గుప్తా ఫౌండేషన్ కుటుంబ సభ్యులకు,సాహితీ అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు.

కార్తీకమాసం మొదటి సోమవారం సందర్భంగా పంచారామ యాత్రికులకు బాదంపాలు వితరణ



ప్రజాభూమి ప్రతినిధి,పాలకొల్లు

కార్తీకమాసం మొదటి సోమవారం సందర్భంగా పాలకొల్లు పెద్దగోపురం వద్ద యునైటెడ్ కాపు సర్వీస్ క్లబ్ ఆధ్వర్యంలో పంచారామ యాత్రికులకు, భక్తులకు బాదంపాలు వితరణ కార్యక్రమం నిర్వహించారు.క్లబ్ సభ్యులు, వెంకటేశ్వర మెడికల్స్ అధినేత యూ కెఎ న్ అందే హరిప్రసాద్ గారి ఆర్థిక సహకారంతో ఉదయం 9 గంటల నుంచి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. యూ కెఎ న్సీ గవర్నర్ యూ కే ఎన్ పెనుమాక రామమోహనరావు , టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కోలా రజనీకుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొని భక్తులకు బాదంపాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సుమారు 3,000 మంది పంచారామ యాత్రికులు, భక్తులు బాదంపాలను ప్రసాదంగా స్వీకరించారు. కార్తీకమాసంలో భక్తులకు సేవ చేయడం ఎంతో సంతృప్తినిస్తుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు డాక్టర్ సంగీనీడి వెంకటరంగారావు, ప్రధాన కార్యదర్శి గంధం యేసుపాదం, కోశాధికారి శిరిగినీడి రాంబాబు, ఫౌండర్ పోకల రాము, దాత అందే హరిప్రసాద్, క్లబ్ సభ్యులు సత్తినీడి రాజా, లంకలపల్లి ఖగరాజు, యర్రంశెట్టి వెంకటరత్నం, పశ్యావుల రవికుమార్, కర్రా నరసింహారావు, మంగెన సాయి, చుండూరి రంగయ్యానాయుడు, భీమానాదం సత్యనారాయణ, టౌన్ ఏఎస్ఐ శివాజీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలి



- అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు: జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ

ప్రజాభూమి ఏలూరు

జిల్లాలో ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే బియ్యం విక్రయించాలని,అధిక ధరలకు విక్రయించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ హెచ్చరించారు. సోమవారం జేసీ కార్యాలయంలో ధరల నియంత్రణపై అధికారులు, వ్యాపారులు, రైతులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీపీటీ 3291 (సోనా), బీపీటీ 5204 (సాంబ), కేఎన్ఎం రకాల బియ్యం కిలో రూ.66, హెచ్ఎంటీ, ఆర్ఎన్ఆర్ రకాలు రూ.76, జైశ్రీరామ్ రూ.82, ఎంటీయూ కామన్ రకం రూ.47 చొప్పున మాత్రమే విక్రయించాలని స్పష్టం చేశారు.ఎంఆర్పీ కంటే అధిక ధరలకు విక్రయించడం, ప్యాకెట్లపై ధరలను ట్యాంపరింగ్ చేయడం వంటి ఉల్లంఘనలపై జిల్లాలో ఇప్పటివరకు 64 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.బియ్యం, వరి వ్యాపారులు ప్రతి



శుక్రవారం తమ నిల్వల వివరాలను కేంద్ర ప్రభుత్వ ఫుడ్ స్టాక్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు.అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత సృష్టించే ప్రయత్నాలు చేసినా, తప్పుడు స్టాక్ వివరాలు నమోదు చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అధికారులు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ బియ్యం నిల్వలు, విక్రయ ధరలపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.ఈ సమావేశంలో డీఎస్ఓ బాబు విలియమ్స్, పౌర సరఫరాల సంస్థ అధికారి శివరామమూర్తి, ఉద్యానవన శాఖ డీడీ సాజా నాయక్ తదితర అధికారులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు

- కార్తీక సోమవారం సందర్భంగా ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ
- శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు..
- భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, కార్తీక దీపారాధనలు.

ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట

పవిత్ర కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా కొత్తపేట నియోజకవర్గ పరిధిలోని శైవక్షేత్రాలన్నీ భక్తజన సందోహంతో కిటకిటలాడాయి.ఎక్కడ చూసినా హరహర మహాదేవ, ఓం నమఃశివాయ, శంభో శంకర నామస్మరణలు మార్మోగగా, ఆలయాలన్నీ భక్తి పారవశ్యంతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. నియోజకవర్గంలోని ప్రసిద్ధ స్వయంభూ పుణ్యక్షేత్రమైన కొత్తపేట మండలం పలివెల గ్రామంలోని శ్రీ ఉమా కొప్పేశ్వరస్వామి ఆలయానికి తెల్లవారుజాము నుంచే భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తూ మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్ఛారణల నడుమ స్వామివారికి పంచామృతాలతో విశేష అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. కార్తీక సోమవారం కావడంతో భక్తుల రద్దీ భారీగా పెరిగింది. దీంతో ఆలయ ప్రాంగణంలోని క్యూలైన్లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం ఆధ్వర్యంలో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయడంతో భక్తులు క్రమపద్ధతిలో స్వామివారిని దర్శించుకున్నారు.



మహిళలు ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించి భక్తిశ్రద్ధలతో దీపారాధనలు నిర్వహించారు. ఆలయ ఈఓ పి. కామేశ్వరరావు పర్యవేక్షణలో దేవస్థాన సిబ్బంది భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టి దర్శన ప్రక్రియ సజావుగా సాగేలా చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా భక్తుల సహకారంతో దేశ్వస్థానం నందు ఏర్పాటు చేసిన ప్రసాద వితరణ కార్యక్రమాన్ని తోట వెంకటేశ్వరావు తన సిబ్బందితో కలిసి పంపిణీ చేశారు.

కార్తీక తొలి సోమవారం.. శివాలయాల్లో భక్తిపారవశ్యం

ప్రత్యేక అభిషేకాలు, పూజలు



ప్రజా భూమి ప్రతినిధి ఆగిరిపల్లి

కార్తీక మాసంలోని తొలి సోమవారం సందర్భంగా ఆగిరిపల్లి మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని పరమశివునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆగిరిపల్లిలోని శోభనాచల గట్టుపై వెలసిన స్వయంభు బ్రహ్మసూత్ర సహిత దుర్గాపార్వతీ సమేత మల్లికార్జున స్వామి, బస్టాండ్ సమీపంలోని గంగ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరాలయం,వరాహ పుష్కరిణి సమీపంలోని ముక్తేశ్వర స్వామి సన్నిధిలో పరమేశ్వరునికి పంచామృత, ఫలరస అభిషేకాలతో పాటు మహాన్యాస పూర్వక ఏకరుద్రాభిషేకం, స్నపనాలంకరణ, అర్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో ఆకాశదీపోత్సవాన్ని నిర్వహించారు. కార్తీక మాసంలో ఆకాశదీపం వెలిగించడం ద్వారా లోకక్షేమం, కుటుంబ సౌభాగ్యం కలగాలని పరమేశ్వరుడిని ప్రార్థించడం సంప్రదాయంగా వస్తోంది. దీపాల వెలుగులతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకోగా, హరహర మహాదేవ శంభో శంకర నామస్మరణతో పరిసరాలు మార్మోగాయి.

ప్రజాభూమి

అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా 6

మంగళవారం 17 నవంబరు 2026

నార్పల శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమకారులకు ఘన నివాళులు

59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ప్రత్యేక కార్యక్రమం.. విద్యార్థులకు గ్రంథాలయ ఉద్యమ ప్రాధాన్యతపై అవగాహన

ప్రజా భూమి -- నార్పల:



59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మూడో రోజు సోమవారం నార్పల శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమకారులను స్మరించుకుంటూ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హెచ్ఎం వెంకటేశులు, ఉపాధ్యాయులు రాము, శ్రీ లక్ష్మీనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రముఖ గ్రంథాలయ ఉద్యమకారులైన అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్.ఆర్. రంగనాథన్, గాడిచర్ల హరిసర్వోత్తమరావు చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గ్రంథాలయ అధికారి కావేరి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమ అభివృద్ధిలో ఉద్యమకారులు పోషించిన కీలక పాత్రను వివరించారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో గ్రంథాలయ ఉద్యమం అందించిన సేవలు, ప్రజల్లో చదువుపై ఆనక్తి పెంపొందించడంలో గ్రంథాలయాల ప్రాముఖ్యతను తెలియజేశారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పాఠకులతో పాటు 15 మంది పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తచెరువు సర్పంచి అభ్యర్థిగా వడ్డే నాగమణి



ప్రజాభూమి ప్రతినిధి,కొత్తచెరువు : కొత్తచెరువు మేజర్ పంచాయతీ వైఎస్సార్సీపీ సర్పంచి అభ్యర్థిగా వడ్డే నాగమణిని పార్టీ ఖరారు చేసింది. ఆమె గతంలో 2011--2016 మధ్య ఎంపీపీగా పనిచేశారు. జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు వడ్డే నారాయణ సతీమణి అయిన నాగమణికి రాజకీయ అనుభవం, స్థానికంగా ఉన్న పరిచయాలను పరిగణనలోకి తీసుకుని పుట్టపర్తి నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇన్ఛార్జి, మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్రెడ్డి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. గ్రామ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తారనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



ప్రజాభూమి, హిందూపురం టౌన్

విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకొని నవ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ అనంత గోపాలకృష్ణ నూచించారు.గ సోమవారం పట్టణ సమీపంలోని ఐకాన్ జూనియర్ కళాశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సురక్షిత బచ్ పన్ అభియాన్ లో భాగంగా న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చట్టరీత్యా బాల్యవివాహాలను నిషేధించడం జరిగిందన్నారు. 18 సంవత్సరాల లోపు బాలికలకు వివాహాలు చేస్తే అలాంటి సమాచారాన్ని అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. దీనికి తోడు 14 సంవత్సరాల లోపు బాలబాలికలందరకి ఉచిత నిర్బంధ విద్య అమలు చేస్తున్నట్లు తెలిపారు. బాలికలు లైంగిక వేధింపులకు గురవుతుంటే వెంటనే ఆఱూ విషయాన్ని తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. విద్యార్థి దశ ఎంతో కీలకమైందని మంచి నిర్ణయాలు తీసుకొని మంచి స్నేహితులతో చదువు పట్ల ఏకాగ్రతగా ఉంటూ ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు సుదర్శన్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థికి మేధస్సు ఉంటుందని, దాన్ని సరైన మార్గంలో ఉంచి చదువుపై దృష్టి సారించాలన్నారు. తల్లిదండ్రులు ఎన్నో కష్టనష్టాలకోర్చి విద్యాభ్యాసం కోసం పంపిస్తున్నారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాగా చదువుకొని మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించే బాధ్యత విద్యార్థులపై కూడా ఉంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రవిచంద్ర, జగదీష్, కళాశాల ప్రిన్సిపాల్ బైరిశెట్టి, పిఎల్వీలు తదితరులు పాల్గొన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా కృషి చేయాలి

-విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి

-జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఏం. లాజరు

ప్రజాభూమి, హిందూపురం టౌన్

పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని శ్రీ సత్యసాయి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఏం. లాజరు సూచించారు. సోమవారం హిందూపురం మండలం కె.బసవనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బృందంతో సమావేశమై మార్చిలో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలపై సమీక్షించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా బోధన సాగించి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. అదే విధంగా బడి మానేసిన పిల్లలు, బాల కార్మికులను గుర్తించి తిరిగి పాఠశాలల్లో చేర్పించే బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడూ తీసుకోవాలని కోరారు. 14 సంవత్సరాలు నిండిన వారికి ఓపెన్ స్కూల్ విధానం ద్వారా పరీక్షలు రాసి చదువును కొనసాగించే అవకాశం కల్పించాలని తెలిపారు. విద్యకు దూరమైన పిల్లలను గుర్తించి వారికి విద్యావకాశాలు కల్పించడంలో ఉపాధ్యాయులు చొరవ చూపాలన్నారు. ఈ సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.హెచ్. రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నార్పల మండలంలో రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ ప్రచురణ

18 నుంచి 20 వరకు నామినేషన్ల స్వీకరణ.. గ్రామాల వారీగా కేంద్రాల కేటాయింపు

సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు అధికారుల ఏర్పాట్లు.. గ్రామాల్లో మొదలైన రాజకీయ సందడి

ప్రజా భూమి – నార్పల



నార్పల మండలంలో 2026 రెండో విడత గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారులు ఎన్నికల ప్రక్రియను ప్రారంభించారు. ఇందులో భాగంగా నార్పల మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల అధికారిక నోటిఫికేషన్‌ను ప్రచురించారు. ఈ నెల 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు మూడు రోజుల పాటు సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు.

గ్రామాల వారీగా నామినేషన్ కేంద్రాలు

నోటిఫికేషన్ ప్రకారం నార్పల గ్రామ పంచాయతీకి నార్పల వెలుగు కార్యాలయంలో నామినేషన్లు స్వీకరించనున్నారు. బి.వప్పూరు గ్రామాన్ని నామినేషన్ కేంద్రంగా ఏర్పాటు చేసి బి.వప్పూరు, బండ్లపల్లి, సిద్ధరాచర్ల, హెచ్. శోధనపల్లి, బొందలవాడ గ్రామ పంచాయతీలకు సంబంధించిన నామినేషన్లు స్వీకరించనున్నారు. గూగుడు గ్రామ కేంద్రంగా గూగుడు, గంగనవల్లి, రంగాపురం, గుంజెపల్లి గ్రామ పంచాయతీలకు నామినేషన్లు స్వీకరించనున్నారు. నడిమిదొడ్డి గ్రామ కేంద్రంగా నడిమిదొడ్డి, నాయనవల్లి, గడ్డంనాగేవల్లి, వెంకటంవల్లి గ్రామ పంచాయతీలకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ నిర్వహించనున్నారు. అదేవిధంగా కేసేపల్లి గ్రామ కేంద్రంగా కేసేపల్లి, దుగుమర్రి, చామలూరు గ్రామ పంచాయతీలకు సంబంధించిన నామినేషన్లు స్వీకరించనున్నారు.

మూడు రోజుల పాటు నామినేషన్ల స్వీకరణ

ఈ నెల 18, 19, 20 తేదీల్లో నిర్ణీత సమయంలో అభ్యర్థులు తమ నామినేషన్లను సంబంధిత కేంద్రాల్లో దాఖలు చేయాల్సి ఉంటుంది. సర్పంచ్ పదవితో పాటు వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేయాలనుకునే అభ్యర్థులు అవసరమైన పత్రాలతో నామినేషన్లు సమర్పించాలి. ఎన్నికల నోటిఫికేషన్ ప్రచురణతో నార్పల మండలంలోని గ్రామాల్లో రాజకీయ సందడి మొదలైంది. ఇప్పటికే వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ఆశావహులు అభ్యర్థుల ఎంపికపై చర్చలు ప్రారంభించారు. సర్పంచ్ పదవుల కోసం పోటీ పడే అభ్యర్థులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. గ్రామాల్లో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్న నేపథ్యంలో రానున్న రోజుల్లో ఎన్నికల పోరు మరింత ఆసక్తికరంగా మారనుంది. మండల పరిషత్ కార్యాలయంలో నోటిఫికేషన్ ప్రచురించడంతో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారులు తదుపరి ఏర్పాట్లపై దృష్టి సారించారు.

గ్రామ పంచాయతీ 2వ సాధారణ ఎన్నికలు - 2026 రెండవ విడత ఎన్నికల షెడ్యూల్ ను విడుదల చేసిన డిపిఓ నాగరాజునాయుడు..

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం గ్రామ పంచాయతీ 2వ సాధారణ ఎన్నికలు - 2026 రెండవ విడత ఎన్నికల షెడ్యూల్ ను విడుదల చేయగా, సోమవారం అనంతపురం నగరంలోని డిపిఓ కార్యాలయంలో డిపిఓ నాగరాజునాయుడు జిల్లాకు సంబంధించి గ్రామ పంచాయతీ 2వ సాధారణ ఎన్నికలు - 2026 రెండవ విడత ఎన్నికల షెడ్యూల్ ను విడుదల చేశారు. అనంతపురం జిల్లాలో రెండవ విడతలో 9 మండలాల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని డిపిఓ తెలిపారు. రెండవ విడత ఎన్నికల షెడ్యూల్ వివరాలు (ఎ) ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ (ఎన్నికల నిర్వహణ) నియమావళి, 2006లోని 6వ నియమం క్రింద రిటర్నింగు అధికారి ఫారము-1 లో ఎన్నికల నోటీసు జారీ చేయవలసిన తేది 18.11.2026 (ఈ తేది నుండి ఉదయము 10.30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చు) (బి) సదరు నియమావళిలోని 5వ నియమం క్రింద రిటర్నింగు అధికారి వార్డు వారీగా గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితాను ప్రదర్శించుట 18.11.2026 నామినేషన్ల స్వీకరణకు ఆఖరు తేది 20.11.2026 (సాయంత్రం 5.00 గంటల వరకు) నామినేషన్ల పరిశీలన 21.11.2026 (ఉదయం 8.00 గంటల నుండి) తిరస్కరించబడిన నామినేషన్లపై అప్పీలేట్ అధికారి (సంబంధిత రెవెన్యూ డివిజినల్ అధికారి) వద్ద అప్పీలు చేసుకొను తేది 22.11.2026 (సాయంత్రం 5.00 గంటల వరకు) అప్పీలేట్ అధికారి ద్వారా అప్పీళ్ళ పరిష్కారం 23.11.2026 అభ్యర్థిత్వములు ఉపసంహరణకు ఆఖరు తేది 24.11.2026 (మధ్యాహ్నం 3.00 గంటల వరకు) పోటీ చేయు అభ్యర్థుల తుది జాబితా ప్రచురణ 24.11.2026 (మధ్యాహ్నం 3.00 గంటల తరువాత) పోలింగు తేదీ 29.11.2026 (ఉదయం 7.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు) ఓట్ల లెక్కింపు తేది 29.11.2026 (మధ్యాహ్నం 2.00 గంటల నుండి) ఫలితాల ప్రకటన ఓట్ల లెక్కింపు పూర్తయిన వెంటనే (ఎ) ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ చట్టం, 1994 లోని సెక్షను 14 (10) క్రింద ఉప సర్పంచు ఎన్నిక నిర్వహించు తేదీ ఫలితాలు ప్రకటించిన తేదీన (బి) ఏదైనా కారణం రీత్యా ఫలితాలు ప్రకటించిన తేదీన ఉప సర్పంచు ఎన్నిక జరుగనియెడల, ఆ మరుసటి రోజున గ్రామ పంచాయతీకి సెలవు దినం అయినప్పటికీ, ఉప సర్పంచు ఎన్నిక తప్పనిసరిగా నిర్వహించవలెను. రీపోలింగ్ తేది 30.11.2026 (ఉదయం 7.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు) ఓట్ల లెక్కింపు మధ్యాహ్నం 2.00 గంటల నుండి ఫలితాల ప్రకటన ఓట్ల లెక్కింపు పూర్తయిన వెంటనే అనంతపురం జిల్లాలో రెండవ విడతలో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగే మండలాల వివరాలు అనంతపురం జిల్లాలో రెండవ విడతలో గ్రామ పంచాయతీ ఎన్నికలు మొత్తం 9 మండలాల్లో జరగనున్నాయి. అందులో గుంతకల్లు రెవెన్యూ డివిజన్ లోని గుత్తి, గుంతకల్, పామిడి, అనంతపురం రెవెన్యూ డివిజన్ లోని సింగనమల, నార్పల, పుట్లూరు, యల్లనూరు, బుక్కరాయసముద్రం, గార్లదిన్నె మండలాల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టడం జరుగుతోంది. ఈ కార్యక్రమంలో డిపిఓ కార్యాలయం అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

చిలమకూరు సచివాలయం ఎక్కడ...?

ఎలాంటి సూచిక బోర్డు అమర్చని అధికారులు..!

ప్రజాభూమి యల్లనూరు



మండల పరిధిలోని చిలమకూరు గ్రామ వార్డు సచివాలయం తెలియక చిలమకూరు అచ్యుతాపురం కోడుమూర్తి సంబంధించిన గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి ఇంతకు మునుపు చిలమకూరు గ్రామంలోనే సచివాలయం సిబ్బంది పాత భవనంలో నుంచి ప్రభుత్వ సేవలు ప్రజలకు అందుబాటులో ఉంటూ కొనసాగించే వారు అయితే నెల రోజులు గడుస్తు న్నప్పటి కీ ఏమాత్రం ప్రజలకు సమాచారం ఇవ్వకుండా నూతన భవనం లోకి మారడంతో ఇక్కడి నుంచి సిబ్బంది తమ ప్రభుత్వ సేవలు అందించి నప్పటికీ చిలమకూరు గ్రామ చివర ప్రధాన రోడ్డు అవతలి వైపు ఉన్నట్లు అతికొద్ది మందికి మాత్రమే తెలుసు కానీ చాలామందికి తెలియదు అంటే ప్రధాన రోడ్డు ఆనుకొని ఒక సూచిక బోర్డు అయినా ఏర్పాటు చేయాలి లేదా గ్రామ సచివాలయం నూతన భవనం పై (గ్రామ సచివాలయం చిలమకూరు) కనిపించే విధంగా రాసి ఉండాలి ఇవేవీ సూచికలు లేకుండా ప్రజలను తప్పు దారి పట్టించడమే అని స్పష్టంగా కనిపిస్తుంది తమ పనుల నిమిత్తం వచ్చినటు వంటి వారి సమయం వృధా అవడంతో పాటు పింఛన్లు రేషన్ కార్డులే కాకుండా అత్యవ సర ధ్రువ పత్రాలు ఆలస్యం అవడంతో వారి పనులకు ఆటంకం కలిగించడంలో సంబంధిత అధికారులు బాధ్యులే కదా.. అంటూ ఆయా గ్రామ ప్రజలు చర్చించు కుంటున్నట్లు సమాచారం ఇదిలా ఉంటే సచివాలయ సిబ్బంది లోపలికి వెళ్లాలంటే చుట్టూ మురుగు నీరు నిలువ ఉండడంతో వెళ్లలేక అవస్థలు పడి ఉద్యోగరీత్యా వెళ్లక తప్పదు మరి దుర్వాసన వెదజల్లుతూ వాటి పైన దోమలు చేరడంతో సిబ్బంది ఇబ్బందులకు గురైతే వారు ప్రజలకు ఏ విధమైన సౌకర్యాలతో ప్రజలకు సేవ చేస్తారో మండల డెవలప్మెంట్ అధికారికే తెలియాలి ఏది ఏమైనా ఇప్పటికైనా ఆయా గ్రామాలలో దండోరా వేయించాలని మరియు సూచిక బోర్డు లు ఏర్పాటు చేసి ప్రజలు, సిబ్బందికి ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా మట్టి రోడ్డు ఏర్పాటు చేసి చుట్టూ పరిసరాలు శుభ్రంగా ఉండేటట్లు తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత జిల్లా స్థాయి అధికారులను ప్రజలు కోరడమైనది.

వైఎస్సార్సీపీకి నార్పలలో గట్టి షాక్.. టీడీపీలోకి 40 కుటుంబాల చేరిక

కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై తెలుగుదేశం పార్టీలో చేరిక

ప్రజా భూమి శింగనమల



నార్పల మండలంలో వైఎస్సార్సీపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మండలంలోని బండ్లపల్లి గ్రామపంచాయతీ పరిధికి చెందిన వైఎస్సార్సీపీకి చెందిన 40 కుటుంబాలు ఆ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరాయి. శింగనమల నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ సమక్షంలో వీరంతా తెలుగుదేశం పార్టీలో చేరగా, ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న సుపరిపాలన పట్ల ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన వారు తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ పేర్కొన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్య పాలనకు భిన్నంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ, ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో రోజురోజుకూ విశ్వాసం పెరుగుతోందని తెలిపారు. తెలుగుదేశం పార్టీకి ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణతో పార్టీ మరింత బలోపేతం అవుతోందని అన్నారు. పార్టీ బలోపేతం కోసం కష్టపడే ప్రతి నాయకుడికి, కార్యకర్తకు తగిన గుర్తింపు, గౌరవం ఉంటాయని, అందరినీ కలుపుకొని నియోజకవర్గ అభివృద్ధి, పార్టీ విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. వైఎస్సార్సీపీ నుంచి టీడీపీలో చేరిన ముఖ్య నాయకులు: వెంకటనారాయణరెడ్డి, దేవనాథ్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, లక్ష్మీరెడ్డి, శివశంకర్ రెడ్డి, మల్లేశ్వరమ్మ, స్నేహలత రెడ్డి తదితరులు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ఆలం వెంకట నరసా నాయుడు, నార్పల మండల కన్వీనర్ కుళ్లాయప్ప , సింగిల్ విండో ప్రెసిడెంట్ ఉమామహేశ్వర నాయుడు, తెలుగుదేశం నాయకులు సుధాకర్ రెడ్డి, సాంబశివారెడ్డి, మధుసూదన్ రెడ్డి, లక్ష్మీనారాయణ, స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మైనార్టీలకు సముచిత స్థానం కల్పించాలి

-సంప్రదాయాన్ని కొనసాగించాలని విజ్ఞప్తి

ప్రజాభూమి, హిందూపురం టౌన్



హిందూపురం మున్సిపల్ వైస్ చైర్మన్ పదవిపై ముస్లిం ఐక్యవేదిక గళమెత్తింది. వైస్ చైర్మన్ పదవి ముస్లింల ఆత్మగౌరవానికి ప్రతీక అని, మున్సిపల్ పాలకవర్గంలో మైనార్టీలకు సముచిత స్థానం కల్పించాలని జామియా మసీదు పెద్దలు, మౌలానాలు డిమాండ్ చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో ముస్లిం సామాజిక వర్గానికి చెందిన 18 మంది కౌన్సిలర్లుగా ఎన్నికైన నేపథ్యంలో వైస్ చైర్మన్ పదవిని తమ సామాజిక వర్గానికి కేటాయించాలని కోరారు. ఈ మేరకు సోమవారం జామియా ఈద్గా మైదానంలోని కార్యాలయంలో ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి, అనంతరం ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి, పార్టీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. అలాగే మున్సిపల్ చైర్మన్ పురిడి మంజునాథ్‌ను కలిసి తమ అభ్యర్థనను వివరించారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ, హిందూపురం మున్సిపాలిటీలోణ కొన్నేళ్లుగా కొనసాగుతున్న సంప్రదాయం ప్రకారం చైర్మన్ పదవి హిందూ సామాజిక వర్గానికి కేటాయిస్తుండగా, వైస్ చైర్మన్ పదవిని ముస్లిం మైనార్టీలకు ఇచ్చి గౌరవిస్తూ వస్తున్నారనిణ గుర్తుచేశారు. ఈసారి కూడా అదే సంప్రదాయాన్ని కొనసాగించి ముస్లిం సామాజిక వర్గానికి చెందిన వారిలో ఒకరికి వైస్ చైర్మన్ పదవి కల్పించాలని కోరారు. మున్సిపల్ కౌన్సిల్‌లో 18 మంది ముస్లిం కౌన్సిలర్లు ఉండటం ఆ సామాజిక వర్గానికి ఉన్న ప్రాతినిధ్యానికి నిదర్శనమన్నారు. ఇంతటి ప్రాతినిధ్యం ఉన్నప్పటికీ కీలకమైన వైస్ చైర్మన్ పదవిలో అవకాశం కల్పించకపోతే మైనార్టీల మనోభావాలు దెబ్బతింటాయని అభిప్రాయపడ్డారు. వైస్ చైర్మన్ పదవి కేవలం ఒక రాజకీయ హోదా మాత్రమే కాదని, ముస్లిం సమాజ ఆత్మగౌరవం, ఐక్యత, రాజకీయ గుర్తింపుతో ముడిపడి ఉన్న అంశమని పేర్కొన్నారు. రానున్న శాసనసభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ముస్లిం మైనార్టీలకు తగిన ప్రాధాన్యత ఇచ్చి గౌరవించాలని నాయకత్వానికి విజ్ఞప్తి చేశారు. ముస్లిం సమాజం ఆకాంక్షలను గుర్తించి సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జామియా మసీదు ముతవల్లి అమీర్జాన్ భాష, ఫరూక్, మాజీ ముతవల్లీలు నూరుల్లా, పీఎస్ కలీముల్లా, మౌలానా షఫీక్, ముస్తార్ మౌలానా, సమీముల్లా మౌలానా, జాకీర్ మౌలానా, ఉమర్ ఫారూఖ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి
వైఎస్ఆర్ కడప, శ్రీ అన్నమ్మయ్య 7
మంగళవారం 17 నవంబరు 2026

శివాలయాల్లో భక్తుల సందడి - సిద్ధవటం ఆలయంలో ప్రత్యేక పూజలు

- పర్యాటక అభివృద్ధికి కృషి చేయాలని డిప్యూటీ కలెక్టర్ సూచన

ప్రజాభూమి, సిద్ధవటం: కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా సిద్ధవటం మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. నిత్యపూజ కోన, కబర్దీశ్వర ఆలయం, సిద్ధవటేశ్వర ఉమామహేశ్వర ఆలయాలతో పాటు మండలంలోని పలు శివాలయాల్లో భక్తులు వేకువజామునే చేరుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మండల కేంద్రమైన సిద్ధవటంలో పెన్నా నది ఒడ్డున వెలసిన శ్రీ సిద్ధవటేశ్వర స్వామి ఆలయంలో కార్తీక సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మదనపల్లి తెలుగు గంగ డిప్యూటీ కలెక్టర్ మాధవ కృష్ణారెడ్డి మాట్లాడుతూ సిద్ధవటం శ్రీశైల దక్షిణ ముఖద్వారంగా ప్రసిద్ధి చెందిన మహా పుణ్యక్షేత్ర



మన్నారు. కార్తీక సోమవారం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో శివ దర్శనానికి తరలిరావడం ఆనందంగా ఉందన్నారు. పెన్నా నది పరిసర ప్రాంతాల్లో అనేక ప్రాచీన, పవిత్ర ఆలయాలు, చారిత్రక శిల్ప సంపద ఉన్నాయని తెలిపారు. సిద్ధులు తపస్సు చేసిన పుణ్యభూమిగా పేరుగాంచిన సిద్ధవటంలో ప్రాచీన శిల్పాలు, అటవీ ప్రాంతాల్లోని చారిత్రక ఆనవాళ్లు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి ప్రాంతాన్ని రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసి మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా జ్యోతి శివక్షేత్రంలో ఇసుక తవ్వకాల సందర్భంగా వెలుగులోకి వచ్చిన పురాతన శివలింగాలు, శిల్పాలను పరిరక్షిస్తూ ఆలయాన్ని శ్రీశైలం దేవస్థానం ఆధ్వర్యంలో మరింత అభివృద్ధి చేయాలని సూచించారు. అనంతరం ఆలయ సంప్రదాయాల ప్రకారం డిప్యూటీ కలెక్టర్ మాధవ కృష్ణారెడ్డిని ఆలయ నిర్వాహకులు ఘనంగా సత్కరించి ఆలయ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో శ్రీ సాయి హైస్కూల్ కరస్పాండెంట్ పోలు వెంకటసుబ్బయ్య, సుబ్బారెడ్డి, యోగేశ్వరరెడ్డి, శ్రీనివాసులరావు, సోమిరెడ్డి పాల్గొన్నారు.

కార్తీక సోమవారం వేళ నిత్యపూజ కోనకు ఉచిత బస్సు సౌకర్యం

శివభక్తుల కోసం బస్సు ప్రారంభించిన శ్రీ నలంద విద్యాసంస్థల అధినేత వెంకటసుబ్బయ్య

ప్రజాభూమి, సిద్ధవటం: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని వంతాటివల్లి గ్రామ సమీపంలోని లంకమల్ల అభయారణ్యంలో వెలసిన శ్రీ నిత్యపూజేశ్వర స్వామివారి క్షేత్రానికి శివభక్తుల సౌకర్యార్థం ఉచిత బస్సు సదుపాయం ఏర్పాటు చేశారు. మండల కేంద్రమైన సిద్ధవటం ఎగువపేటలోని శ్రీ నలంద విద్యాసంస్థల అధినేత బాలు గారి వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన



ఉచిత బస్సు సౌకర్యాన్ని సిద్ధవటం మండల ఫారెస్ట్ రేంజ్ అధికారి పోలీస్‌లైన్ క్రాస్ వద్ద జెండా ఊపి ప్రారంభించారు. కార్తీక సోమవారం సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో నిత్యపూజ కోనకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా నిత్యపూజ కోన ఏవో సురేష్‌రెడ్డి మాట్లాడుతూ నాలుగు వారాలపాటు నిర్వహించనున్న కార్తీక మహోత్సవాల సందర్భంగా శివభక్తుల రాకపోకలకు విద్యాసంస్థల అధినేతలు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం అభినందనీయమన్నారు. భక్తులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకుని నిత్యపూజేశ్వర స్వామివారిని దర్శించుకోవాలని కోరారు. కార్తీక మాసంలో నిత్యపూజ కోనకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ఆలయ నిర్వాహకులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాజేంద్రప్రసాద్, రంగనాయకస్వామి ఆలయ అర్చకులు రంగయ్య శాస్త్రి, ఎండోమెంట్ చారిటబుల్ అధ్యక్షులు మునికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చింతలపల్లి పంచాయతీ టీడీపీ బలపరచిన సర్పంచ్ అభ్యర్థిగా గంధం విజయ్ భాస్కర్ నామినేషన్ దాఖలు..

ప్రజాభూమి పోరుమామిళ్ల :
కడప జిల్లా, కలసపాడు మండలం చింతలపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా గంధం విజయ్ భాస్కర్ నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ప్రతిపాదకుడు ఖనిజం పాములేటి సమక్షంలో ఎన్నికల అధికారులకు నామినేషన్ పత్రాలను సమర్పించారు.



నామినేషన్ కేంద్రాలను తనిఖీ చేసిన ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

-శాంతియుత ఎన్నికల నిర్వహణకు పటిష్ట బందోబస్తు

ప్రజాభూమి, సిద్ధవటం: స్థానిక నంద్యాల ఎన్నికల నేపథ్యంలో ఒంటిమిట్ట, సిద్ధవటం ప్రాంతాల్లో కొనసాగుతున్న సర్పంచ్ నామినేషన్ ప్రక్రియను జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ సోమవారం పరిశీలించారు. నామినేషన్ కేంద్రాలను సందర్శించి భద్రతా ఏర్పాట్లను స్వయంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టామని, సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మొదటి విడతలో ఎన్నికలు జరుగుతున్న అన్ని ప్రాంతాల్లో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, నామినేషన్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని పోలీసు సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు అందజేశారు.



అట్టహాసంగా జింకా సుబ్బమ్మ నామినేషన్

ప్రజాభూమి, సిద్ధవటం: స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా సిద్ధవటం మండలంలో రెండో రోజు నామినేషన్ల ప్రక్రియ పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య ప్రశాంతంగా కొనసాగింది. మాధవరం-1 గ్రామ పంచాయతీ సర్పంచ్‌అభ్యర్థిగా జింకా సుబ్బమ్మ సోమవారం అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. ముందుగా పార్వతీపురంలోని శ్రీ శీతల గంగమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి,కొబ్బరికాయ సమర్పించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం వందలాది మంది మద్దతుదారులతో ర్యాలీగా బయలుదేరి మాధవరం-2 సచివాలయంలో నామినేషన్ పత్రాలను సమర్పించారు. సర్పంచ్ అభ్యర్థితో పాటు ఆమెకు మద్దతుగా నిలిచిన వార్డు సభ్యుల అభ్యర్థులు కూడా నామినేషన్లు దాఖలుచేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ అభ్యర్థి ప్రతినిధి జింకా శ్రీనివాసులు మాట్లాడుతూ తమపై ప్రేమాభిమానాలతో తరలివచ్చిన గ్రామ ప్రజలు, ఓటర్లు, తెలుగుదేశం కూటమి నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదే ఆదరణను కొనసాగిస్తూ ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేసి జింకా సుబ్బమ్మను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి కూటమి నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన ఎర్రబల్లె

పద్నాలుగవ అయ్యప్ప స్వామి మండల పూజ ఘనం - భక్తిశ్రద్ధలతో పడిపూజ

ప్రజాభూమి, పులివెందుల
పులివెందుల మండలం పరిధిలోని ఎర్రబల్లె గ్రామంలో పద్నాలుగవ అయ్యప్ప స్వామి మండల పూజ కార్యక్రమాన్ని సోమవారం గురుస్వాములు, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల పూజ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. అయ్యప్ప స్వామి నామస్మరణ, భక్తుల శరణుఘోషతో ఎర్రబల్లె గ్రామం మార్మోగింది. మండల పూజను పురస్కరించుకుని గ్రామంలో అరటి బెరడులతో ప్రత్యేక మండపాలను ఏర్పాటు చేసి, వాటిని వివిధ రకాల పూలతో అందంగా అలంకరించారు. మండపాలలో అయ్యప్ప స్వామి, వినాయకుడు, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి చిత్రపటాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పులివెందుల గురుస్వామి వెంకటరామి రెడ్డి , ఎర్రబల్లి గురుస్వాములు శ్రీను , నారాయణ , రమణయ్య ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో సాగాయి. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, అనంతరం ప్రత్యేక అలంకరణతో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులకు అవకాశం కల్పించారు. అయ్యప్ప భక్తులు నిర్వహించిన భజనలు, భక్తిగీతాలు కార్యక్రమానికి ప్రత్యేక



ఆకర్షణగా నిలిచాయి. అనంతరం సంప్రదాయ బద్ధంగా పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. పద్దెనిమిది పవిత్ర పడి మెట్లకు ప్రత్యేక పూజలు చేసి, అయ్యప్ప స్వామి మహిమలను స్మరించుకుంటూ భక్తులు శరణుఘోషతో పూజల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా పద్దెనిమిదవ అయ్యప్ప మాల ధరించిన భక్తులను గురుస్వాములు ఘనంగా దుశ్శాలువాలతో సత్కరించారు. అనంతరం భక్తులందరికీ బిక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.మండల పూజలో భాగంగా నిర్వహించిన లడ్డూ వేలం పాటలో పులివెందుల రెడ్డి మెస్ యజమాని కుల్లాయి రెడ్డి ఇరవై ఐదు వేల రూపాయలతో లడ్డూను దక్కించుకున్నారు.సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ మండల పూజ గ్రామంలో పండుగ వాతావరణాన్ని నెలకొల్పింది.

59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాభూమి,పులివెందుల
పట్టణములోని గ్రంథాలయంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయ ఉద్యమకారులను స్మరించారు. గ్రంథాలయాధికారి కృష్ణ కిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో జాతీయ గ్రంథాలయ



ఉద్యమకారులు గాడిచర్ల హరి సర్వోత్తమరావు, అయ్యంకి వెంకట రమణయ్య, ఎస్.ఆర్. రంగనాథన్ ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించి వారిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణ కిషోర్ రెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయాలను కేవలం పుస్తక భాండాగారాలుగా కాకుండా ప్రజా చైతన్య కేంద్రాలుగా తీర్చిదిద్దడంలో జాతీయ గ్రంథాలయ ఉద్యమకారులు జీవితాంతం కృషి చేశారని ఆయన గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో లైబ్రరీ హెల్పర్ లక్ష్మీ నరసమ్మ, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలకు టిడిపి శ్రేణుల సన్నద్ధత

- గ్రామాల్లో రఘునాథ్ రెడ్డి, రవితేజ రెడ్డి విస్తృత పర్యటన
- కూటమి నాయకులు, కార్యకర్తలతో ఎన్నికల సన్నద్ధతపై చర్చ

ప్రజాభూమి, వేంపల్లె
పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని అలవలపాడు, రామిరెడ్డిపల్లె, ముతుకూరు, నాగూరు గ్రామాల్లో టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి రవితేజ రెడ్డి కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి విస్తృతంగా పర్యటించారు. ఆయా గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలతో సమావేశమై గ్రామాల వారీగా పార్టీ పరిస్థితులు, ఎన్నికల సన్నద్ధతపై చర్చించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి



కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రజా సంక్షేమం, గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను తెలియజేశారు. రానున్న పంచాయతీ ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ కూటమి విజయానికి కృషి చేయాలని సూచించారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, రాష్ట్ర హౌసింగ్ డైరెక్టర్ జగన్నాథ రెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షుడు నామా వేమకుమార్, నాయకులు బాలస్వామి రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి (దిల్మాంగే), గౌస్, దక్కా రమేష్, మదక శ్రీను, మారుతి, గంగాధర్ రెడ్డి, అహ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

పులివెందులలో అంగరంగ వైభవంగా శ్రీ పుష్పయాగ మహోత్సవం

ప్రజాభూమి, పులివెందుల
పులివెందుల పట్టణంలోని శ్రీ పద్మావతి సమేత కళ్యాణ వెంకటరమణ స్వామి దేవస్థానంలో సోమవారం శ్రీ పుష్పయాగ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు.దేవస్థాన ప్రధాన అర్చకులు వరదాచార్యులు గారు తెల్లవారుజాము నుంచే కళ్యాణ వెంకటరమణ స్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు ఏర్పాటుచేసిన



రకరకాల పువ్వులు చేతబట్టి ఆలయం చుట్టూ ప్రాకారోత్సవం నిర్వహించారు. పూలతో అలంకరించిన ఆలయం, భక్తుల భక్తి భావం కార్యక్రమానికి ప్రత్యేక శోభను తెచ్చాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వరదాచార్యులు మాట్లాడుతూ లోక కళ్యాణార్థం, తెలిసో తెలియకో జరిగిన లోపాల నివారణ కోసం, ప్రకృతి వైపరీత్యాలు, అంటువ్యాధుల నుండి మానవాళిని కాపాడి లోకమంతా సుభిక్షంగా ఉండాలని ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారని తెలిపారు.

పోరుమామిళ్ల మేజర్ పంచాయతీ జనసేన సర్పంచ్ అభ్యర్థిగా జోడు సావిత్రమ్మ నామినేషన్

ప్రజాభూమి పోరుమామిళ్ల :
కడప జిల్లా పోరుమామిళ్ల మేజర్ గ్రామపంచాయతీ జనసేన పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా జోడు తిరువతయ్య సతీమణి జోడు సావిత్రమ్మను పార్టీ ప్రకటించింది. పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకు గ్రామ నాయకులు, కార్యకర్తల ఏకాభిప్రాయంతో ఆమె అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు. దీంతో జనసేన పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. ఈ నేపథ్యంలో కడప పార్లమెంట్ నిర్వాహక దళ్ అధ్యక్షుడు, పోరుమామిళ్ల-1 ఎంపీటీసీ శీలం శెట్టి లక్ష్మయ్య ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. జోడు సావిత్రమ్మ నాయకులు, కార్యకర్తలతో కలిసి పోరుమామిళ్లలోని వెంకటేశ్వర స్వామి ఆలయం సమీపం నుంచి పంచాయతీ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, నగిరి రమణ, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జోడు సావిత్రమ్మకు మద్దతు తెలిపారు.



నాగలకుంట్ల (సంచర్ల) సర్పంచ్ అభ్యర్థిగా ముత్యాల లక్ష్మీదేవి నామినేషన్ దాఖల్

ప్రజాభూమి పోరుమామిళ్ల :
కడప జిల్లా పోరుమామిళ్ల మండలం నాగలకుంట్ల (సంచర్ల) గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా ముత్యాల లక్ష్మీదేవి సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. యువత రాజకీయాల్లో చురుకుగా పాల్గొనాలని, గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షిస్తూ ఆమె ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో నాలుగు గ్రామాలకు చెందిన యువత, టీడీపీ కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో సోమవారం సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయడం పట్ల గ్రామంలో ముఖ్యంగా మహిళలు యువత ఆమెకు మద్దతుగా సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా ముత్యాల లక్ష్మీదేవి మాట్లాడుతూ. గ్రామ ప్రజల ఆశీస్సులు, సహకారంతో ఎన్నికల బరిలో నిలుస్తున్నానని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధి, తాగునీటి సమస్య పరిష్కారం, పారిశుద్ధ్యం, రహదారుల మెరుగుదల, వీధి దీపాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేయడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. తండ్రి ఆశయాలను నెరవేర్చడంతో పాటు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గ్రామ పంచాయతీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని ఆమె వెల్లడించారు.



కార్తీక మొదటి సోమవారం.. శివనామ స్మరణతో మారుమోగిన క్షేవక్షేత్రాలు!

పోరుమామిళ్లలోని శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు -- భక్తులతో కిటకిటలాడిన ఆలయం

ప్రజాభూమి పోరుమామిళ్ల :
కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా కడప జిల్లా పోరుమామిళ్ల పట్టణంలోని పురాతన ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ బాలా త్రిపుర సుందరి దేవి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం శివనామ స్మరణతో మారుమోగింది. తెల్లవారుజాము నుంచే ఆలయానికి భక్తులు పెద్ద



సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.కార్తీక మాసంలో తొలి సోమవారానికి ఎంతో ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉండటంతో భక్తులు ఉదయం నుంచే ఆలయానికి చేరుకుని స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది. హరహర మహాదేవ, ఓం నమఃశివాయ అనే శివనామ స్మరణతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి. ఈ సందర్భంగా భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలను వెలిగించి తమ భక్తిని చాటుకున్నారు. దీపాల వెలుగులతో ఆలయ ప్రాంగణం ఆహ్లాదకరంగా, భక్తి పారవశ్యంతో నిండిపోయింది. కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని తమ కుటుంబాలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు మధు శర్మ మాట్లాడుతూ కార్తీక మాస విశిష్టతను, ఈ మాసంలో శివారాధన, అభిషేకాలు, అర్చనలు, దీపారాధన చేయడం వల్ల కలిగే ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను భక్తులకు వివరించారు. కార్తీక మాసంలో ప్రతి సోమవారానికి విశేషమైన ప్రాధాన్యత ఉంటుందని, భక్తులు నియమ నిష్ఠలతో శివనామ స్మరణ చేస్తూ పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. భక్తుల రాకతో పోరుమామిళ్లలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

రుద్ర సూర్య-చంద్రుడిగా దర్శనమిచ్చిన శ్రీ దుర్గా గవిమల్లేశ్వర స్వామి

- కార్తీకమానం తొలి సోమవారం ప్రత్యేక పూజలు
- స్వామివారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

ప్రజాభూమి, వేంపల్లె
స్థానిక పవిత్ర పాపాగ్ని నదీ తీరాన వెలసిన శ్రీ దుర్గా గవిమల్లేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీకమాసం తొలి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ చైర్మన్ పినుపోలు రాఘవేంద్రప్రసాద్ తెలిపారు. ఆలయ అర్చకులు దుర్భాక ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో తెల్లవారుజామున 5 గంటల నుంచి





స్వామివారికి అభిషేకం, నివేదన, మంత్రపుష్పం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని రుద్ర సూర్య-చంద్రుడిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. స్వామివారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. ఆలయ ధ్వజస్తంభం ఆవరణలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించడంతో ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మారుమోగింది. పలువురు భక్తులు అన్నదాన కార్యక్రమం నిర్వహించగా, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు 8

మంగళవారం 17 నవంబరు 2026

కార్తీక మాసంలో సంగమేశ్వర, భీమేశ్వరుని సేవలో హరీష్ నాయుడు కుటుంబం

ప్రత్యేక పూజలు.. భారీ అన్నదాన కార్యక్రమం

ప్రజాభూమి ప్రతినిధి, వాకాడు



కోట మండలం గూడలి గ్రామంలోని దశాబ్దాల చరిత్ర కలిగిన శ్రీ సంగమేశ్వర, భీమేశ్వర స్వామి ఆలయాల్లో కార్తీక మాసం సందర్భంగా వాకాడు మండల టీడీపీ నాయకుడు కల్లూరు హరీష్ నాయుడు కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి భక్తిశ్రద్ధలతో పూజలు సమర్పించి, భక్తుల కోసం భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అన్నదాన కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

బాలిరెడ్డిపాలెంలో వెంకటయ్య మృతి.. నేతల నివాళి

ప్రజాభూమి ప్రతినిధి, వాకాడు



వాకాడు మండలంలోని బాలిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ఈదురు సుధాకర్ తండ్రి ఈదురు వెంకటయ్య (70) సోమవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీజేపీ తిరుపతి జిల్లా ఉపాధ్యక్షుడు పాపారెడ్డి పురుషోత్తం రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకుడు సన్నారెడ్డి విజయశేఖర్ రెడ్డి మృతుడి నివాసానికి చేరుకుని భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఈదురు సుధాకర్ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కష్టకాలంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఎన్టీఆర్ విగ్రహం నుంచి ర్యాలీగా బయలుదేరిన సర్పంచ్ అభ్యర్థి నగరం జయలిత

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.



రేణిగుంట పట్టణ గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా నగరం భాస్కర్ (ల్యాబ్ భాస్కర్) సతీమణి నగరం జయలిత నామినేషన్ దాఖలు చేసేందుకు మద్దతు దారులతో కలిసి ర్యాలీగా బయలుదేరారు. పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద నుంచి కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో పట్టణ పరివీధుల్లోర్యాలీ నిర్వహించారు. అనంతరం నామినేషన్ కేంద్రానికి చేరుకుని నామినేషన్ పత్రాలు సమర్పించేందుకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జి. పాల్యం సర్పంచ్ అభ్యర్థిగా హేమంత్ రెడ్డి నామినేషన్



ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.

రేణిగుంట మండలంలోని జి .పాల్యం గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా హేమంత్ రెడ్డి గ్రామ ప్రజలతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఆయన నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులకు సమర్పించారు. జి. పాల్యం సర్పంచ్ స్థానానికి హేమంత్ రెడ్డి,పోటీకి దిగడంతో గ్రామంలో ఎన్నికల సందడి నెలకొంది.

సి.ఎస్.ఆర్ నిధులతో ఉద్యానవన సమగ్రాభివృద్ధి

-నెలలోపు పనులు పూర్తి చేస్తాం

-పురోగతిని పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

ప్రజాభూమి, హిందూపురం టౌన్

సీఎస్ఆర్ నిధులతో పట్టణంలోని ఆబాద్‌పేట ప్రాంతంలో ఉన్న ఇందిరా పార్కు ఉద్యానవనాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి పట్టణ ప్రజలకు అంకితం చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. ఇప్పటికే పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను సోమవారం మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గంగాధర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మదన్‌మోహన్, ఏఈ జనార్దన్‌తో కలిసి కమిషనర్ పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆదేశాల మేరకు రూ. 15.50 లక్షల సీఎస్ఆర్ నిధులతో పార్కు అభివృద్ధి, పునరుద్ధరణ పనులు చేపట్టినట్లు వివరించారు. ఈ పనులకు ఎంఎస్ టీఎన్ఎంఆర్ ప్రాజెక్ట్స్ సంస్థ నిధులు సమకూరుస్తోందని తెలిపారు. పార్కులో పాడైపోయిన చిన్నారుల ఆట వస్తువులకు మరమ్మతులు చేయడంతో పాటు కొత్త ఆట పరికరాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రహరీ గోడ పునరుద్ధరణ, రంగులు వేయడం, వాకింగ్ ట్రాక్ మరమ్మతులు, ఫౌంటెన్ పునరుద్ధరణ పనులు చేపడుతున్నామన్నారు. పార్కులో పచ్చదనం పెంపొందించేందుకు మొక్కలు నాటడంతో పాటు ఓపెన్ జిమ్‌లోని వ్యాయామ పరికరాలకు మరమ్మతులు చేసి రంగులు వేయనున్నట్లు తెలిపారు. అన్ని పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని, మరో మూడు, నాలుగు వారాల్లో పనులను పూర్తి చేసి పట్టణ ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని కమిషనర్ మల్లికార్జున వెల్లడించారు.



షార్ట్‌ఫిల్మ్‌కు ద్వితీయ బహుమతి -మహిళల అక్రమ రవాణాపై అవగాహన

-కలెక్టర్ చేతుల మీదుగా రూ.20 వేల నగదు పురస్కారం.. -విద్యార్థినులను అభినందించిన ప్రిన్సిపాల్

ప్రజాభూమి, హిందూపురం టౌన్



మహిళల అక్రమ రవాణా వంటి తీవ్రమైన సామాజిక సమస్యపై అవగాహన కల్పిస్తూ షార్ట్‌ఫిల్మ్ రూపొందించి జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించిన హిందూపురం ఎన్ఎస్పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్. అంజలీదేవి అభినందించారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన జిల్లా స్థాయి షార్ట్‌ఫిల్మ్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థినులు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా రూ.20 వేల నగదు బహుమతిని అందుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ప్రిన్సిపాల్ అంజలీదేవి ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతో కలిసి జిల్లా కలెక్టర్ అందించిన చెక్కును చూపిస్తూ వివరాలను వెల్లడించారు. కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గౌతమి, నవిత, నిఖిత దుర్గ, రిస్పారాణి మహిళల అక్రమ రవాణా అంశాన్ని ఇతివృత్తంగా తీసుకొని షార్ట్‌ఫిల్మ్ రూపొందించారు. మహిళలు, బాలికలు ఎదుర్కొంటున్న అక్రమ రవాణా సమస్యలు, వాటి పట్ల సమాజంలో అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకతను ఈ చిత్రం ద్వారా చాటిచెప్పారు. విద్యార్థినులు రూపొందించిన షార్ట్‌ఫిల్మ్‌కు జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం లభించడంతో పాటు జిల్లా కలెక్టర్ ప్రశంసలు అందుకోవడం విశేషమని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సమస్యలపై అవగాహన పెంపొందించుకొని సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. ఈ విజయం ఇతర విద్యార్థినులకు కూడా స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. విజేతలైన విద్యార్థినులతో పాటు వారికి మార్గనిర్దేశం చేసిన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రంగనాయకులును, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ యశోద రాణి, అధ్యాపకులు నాగమణి, సీనియర్ అసిస్టెంట్ నరసింహులు అభినందించారు.

ఆరోగ్యంతోనే చదువులో రాణింపు -విద్యార్థినులకు దోమతెరల పంపిణీ

ప్రజాభూమి, హిందూపురం టౌన్



గురుకుల పాఠశాలల్లో చదువుతున్న పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థినుల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని వైద్యాధికారిణి డాక్టర్ ఉషారాణి పేర్కొన్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని ఆటోనగర్ సమీపంలో ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాల (బాలికల)లో సోమవారం విద్యార్థినులకు ఉచితంగా దోమతెరలను పంపిణీ చేశారు. ప్రస్తుతం వాతావరణ మార్పుల కారణంగా మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా వంటి దోమల ద్వారా వ్యాపించే సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వాటిని ముందుగానే అరికట్టేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు డాక్టర్ ఉషారాణి తెలిపారు. హాస్టళ్లలో ఉంటూ చదువుకునే విద్యార్థినులకు రాత్రివేళ దోమల బెడద లేకుండా ప్రశాంతమైన నిద్ర కల్పించడం, తద్వారా చదువుపై ఏకాగ్రత పెంపొందించడమే దోమతెరల పంపిణీ ప్రధాన ఉద్దేశమని వివరించారు. ఈ సందర్భంగా జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి లక్ష్మీనాయక్ మాట్లాడుతూ, దోమతెరలను క్రమం తప్పకుండా తప్పకుండా వినియోగించడం ద్వారా ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. ప్రశాంతమైన నిద్రతో పాటు విద్యార్థినుల్లో చదువుపై ఏకాగ్రత, పాఠశాల హాజరుశాతం కూడా పెరుగుతాయని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ నాగమణి మాట్లాడుతూ, ఆరోగ్యంగా, శారీరకంగా దృఢంగా ఉన్నప్పుడే విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించగలరన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఆరోగ్య పరిరక్షణ సదుపాయాలనుగ విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. అనంతరం పాఠశాలలో పరిశుభ్రత నిర్వహణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. మలేరియా సబ్‌యూనిట్ అధికారి శివన్న మాట్లాడుతూ, విద్యార్థినుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని, ప్రభుత్వం పంపిణీ చేసిన దోమతెరలను ప్రతి ఒక్కరూ సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది వెంకటేశ్వర్లు, రాఘవేంద్రనాయుడు, ముస్తఫా, భాస్కర్, తిమ్మక్క, పద్మజ, ఉపాధ్యాయ బృందం, బోధనేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

48 రోజుల పాటు అయ్యప్ప స్వాములకు అన్నదానం

-ఈ నెల 18 నుంచి జనవరి 5 వరకు కార్యక్రమం..-కరపత్రాలు విడుదల చేసిన అన్నదాన కమిటీ ప్రతినిధులు

ప్రజాభూమి, హిందూపురం టౌన్



అయ్యప్ప స్వాముల దీక్షకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా, భక్తులకు ఆధ్యాత్మిక సేవ అందించాలనే సంకల్పంతో 48 రోజుల పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అయ్యప్ప స్వామి అన్నదాన కమిటీ అధ్యక్షులు డీఈ రమేష్ కుమార్ తెలిపారు. బెంగళూరు రోడ్డులోని అయ్యప్ప స్వామి దేవాలయ అన్నదాన భవన్‌లో ఈ నెల 18వ తేదీ నుంచి 2027 జనవరి 5వ తేదీ వరకు అన్నదాన కార్యక్రమం కొనసాగుతుందని వెల్లడించారు. ఈ మేరకు సోమవారం ఆలయంలో భక్తుల సమక్షంలో అన్నదాన కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా డీఈ రమేష్ కుమార్ మాట్లాడుతూ, కీర్తిశేషులు బాలన్ గురుస్వామి శిష్య బృందం ఆధ్వర్యంలో గత 16 సంవత్సరాలుగా దాతల సంపూర్ణ సహకారంతో ఈ మహత్తర అన్నదాన కార్యక్రమాన్ని నిరంతరాయంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయ్యప్ప మాలధారణ చేసిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారి దీక్ష సజావుగా కొనసాగేందుకు ధర్మబద్ధంగా అన్నదాన సేవ అందిస్తున్నామన్నారు. శాస్త్రోక్త సంప్రదాయాలను అనుసరిస్తూ దాతల నుంచే భిక్షను స్వీకరించి, ఆ భిక్షను భక్తులకు అందించే విధానాన్ని కొనసాగిస్తున్నట్లు వివరించారు. దాతల దాతృత్వం, భక్తుల సహాయ సహకారాలతో నిర్వహించే ఈ అన్నదాన కార్యక్రమంలో మాలధారణ చేసిన అయ్యప్ప స్వాములు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ప్రసాదంగా అన్నదానాన్ని స్వీకరించాలని, ఈ సేవలో భాగస్వాములై అయ్యప్ప స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు నంబూరి శంకర్ గురుస్వామి, రవి ఠాగూర్, కమిటీ సభ్యులు శ్రీరాములు, సంజీవ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గణపతి, అయ్యప్ప స్వామి హోమాలు

కార్తీక మాసం ప్రారంభం, అయ్యప్ప స్వాముల మాలధారణలను పురస్కరించుకుని హిందూపురం పట్టణంలోని బెంగళూరు రోడ్డులో వెలసిన అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం గణపతి, అయ్యప్ప స్వామి సమేత వివిధ దేవతా హోమాలను వైభవంగా నిర్వహించారు. శబరిమలైలోని అయ్యప్ప స్వామి సన్నిధానంలో అనుసరించే సంప్రదాయాలను ఇక్కడ కూడా కొనసాగిస్తూ వేదమంత్రోచ్ఛారణల నడుమ హోమ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

కార్తీక మాసం సందర్భంగా పలువురు భక్తులు అయ్యప్ప స్వామి మాలధారణ చేసి మండల దీక్షను ప్రారంభించారు. ఆలయ ప్రాంగణం అయ్యప్ప నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు నంబూరు శంకర్, అన్నదాన కమిటీ అధ్యక్షులు డి.ఈ. రమేష్ కుమార్, రవి గురుస్వామితో పాటు భక్తులు కె.టి. శ్రీధర్, శ్రీరాములు, ఆటో సంజీవ, పవన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ ఋష్యశృంగ మహాముని జ్ఞాపకార్థం ఘనంగా అన్నదాన కార్యక్రమం

అంతర్జాతీయ వత్రిక దినోత్సవ నందర్భంగా జర్నలిస్టులకు నన్మానం
అన్నదాన కార్యక్రమం చేవట్టి నంవత్సరం నందర్భంగా

ప్రజా భూమి శింగనమల



మండల కేంద్రంలోని శ్రీ ఆత్మారాముడి దేవాలయం వద్ద శ్రీ ఋష్యశృంగ మహాముని స్వామివారి జ్ఞాపకార్థం కార్తీకమాసం సందర్భంగా ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జె. రామ్ చరణ్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. సుమారు 2,000 మంది భక్తులకు అన్నదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అంతర్జాతీయ పత్రిక దినోత్సవం సందర్భంగా మండలంలోని ఉన్న జర్నలిస్టులకు సన్మాన కార్యక్రమం చేయడం జరిగింది కార్యక్రమానికి ఎంతో తోడ్పడుతున్నారని జర్నలిస్టులందరికీ చిన్న సన్మానం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా జె. రామ్ చరణ్ యాదవ్ మాట్లాడుతూ.. కార్తీకమాసం పవిత్రతను పురస్కరించుకుని, ప్రజలకు సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని శ్రీ ఋష్యశృంగ మహాముని స్వామివారిని ప్రార్థిస్తూ ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. అన్నదానం మహాదానమని, భక్తులకు సేవ చేయడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

పారా స్పోర్ట్స్ సెలక్షన్స్ లో రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైన రామచంద్ర

ప్రజా భూమి శింగనమల



శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానం నందు శ్రీ సత్య సాయి డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ మరియు శాప్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పారా స్పోర్ట్స్ ఎంపికలలో హిందూపురానికి చెందిన ఎ.రామ చంద్ర తైక్వాండో క్రీడలో అద్భు తమైన ప్రతిభ కనబరిచి ఒకటి,రెండు,మూడు తేదీలలో విజయనగరం జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవడం జరిగింది ఎంపికైన రామచంద్ర ను శ్రీ సత్య సాయి జిల్లా క్రీడా శాఖాధికారి కిషోర్, ఎస్ ఎన్ ఏ కోఆర్డినేటర్ పుల్లన్న, శాప్ కోచ్లు ప్రతాప్, ఓం ప్రకాష్ మరియు తైక్వాండో కోచ్ రాజేష్ తైక్వాండో ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు కె.శాంతరాజ్ తదితరులు అభినందించారు.

రీసర్వే పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలి - జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్..

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం



రీసర్వే పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ ఆదేశించారు. సోమవారం జిల్లాలో రీ సర్వే మీద నగరంలోని జాయింట్ కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, ఐ.ఏ.ఎస్ సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ సుయష్ కుమార్, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఏడీ సర్వే, ఎస్‌డీసీ, కేఆర్ఆర్‌సీ అధికారులు, సంబంధిత సెక్షన్ అధికారులతో రీ సర్వే పురోగతి, భూ రికార్డుల్లో ఉన్న లోపాలు, పరిష్కరించాల్సిన పెండింగ్ సమస్యలపై జాయింట్ కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా రీ సర్వేకు సంబంధించిన సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. భూ రికార్డుల ఖచ్చితత్వాన్ని నిర్ధారిస్తూ, రీ సర్వే ప్రక్రియను నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం సమర్థవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

భక్తి శ్రద్ధలతో కార్తీక సోమవారం పూజలు

శివనామ స్మరణతో మారుమోగిన శివ క్షేత్రాలు

ప్రజా భూమి ప్రతినిధి రామచంద్రపురం



కార్తీక మొదటి సోమవారం నందర్భంగా మండలంలోని రాయలచెరువు కట్టకింద వెలిసి ఉన్న శ్రీ భవాని జలకంఠేశ్వర స్వామివారి ఆలయంలో ఉదయం నుంచి భక్తులు పోటెత్తారు. దేవదేవుళ్ళు శివకేశువులకు అత్యంత ప్రీతికరమైన కార్తీక మాసం మొదటి సోమవారం శివ క్షేత్రాలు శివనామస్మరణతో మారుమోగాయి.ప్రాత కాలంనుంచే స్వామివారికి విశేష అభిషేకాలు, రుద్రాభిషేకాలు దీపారాధన నైవేద్య సమర్పణ ప్రత్యేక పూజలు ఆలయ అర్చకులు నిర్వహించారు. శ్రీ కామాక్షి సమేత కోటిలింగేశ్వర స్వామి ఆలయంలో మహిళలు ఉదయం నుంచే కార్తీక దీపారాధన భక్తిశ్రద్ధలతో పిండితో నెయ్యి దీపాలు వెలిగించి మొక్కలు తీర్చుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ నిర్వహకులు మహిళాభక్తుల సౌకర్యార్థం దీపారాధనకు ప్రత్యేక ప్రదేశాలను ఏర్పాటు చేశారు. భక్తులు శివనామ స్మరణతో ఆలయంలో భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు తీసుకున్నారు.

ప్రజాభూమి
తిరుపతి,చిత్తూరు 9
మంగళవారం 17 నవంబరు 2026

ఎరువుల పంపిణీలో కొత్త విధానం.. రైతులకు ఎఫ్ఎఫ్ఎస్ యాప్ తప్పనిసరి!

మంగళవారం నుంచి అమలులోకి నూతన విధానం.. యాప్‌లో నమోదు చేసుకున్న తర్వాతే ఎరువుల బుకింగ్

ప్రజా భూమి -- నార్పల:

రైతులకు ఎరువుల పంపిణీని మరింత పారదర్శకంగా నిర్వహించడంతో పాటు, ఎరువుల కొరత, అక్రమ విక్రయాలకు అడ్డుకట్ట వేసే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ ఎఫ్ఎఫ్ఎస్ నూతన విధానాన్ని మంగళవారం నుంచి అమలు చేయనుంది. ఈ మేరకు నార్పల మండల వ్యవసాయ అధికారి పత్రికా ప్రకటన విడుదల చేశారు.ఈ విధానం ప్రకారం రైతులు తమ మొబైల్ ఫోన్లలో ఎఫ్ఎఫ్ఎస్ యాప్‌ను వినియోగించి ఫార్మర్ ఐడీ, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్, భూమి వివరాలు, సాగు చేస్తున్న వంట వివరాలను నమోదు చేసుకోవాలి. అనంతరం తమకు అవసరమైన ఎరువులను యాప్ ద్వారా బుక్ చేసుకోవాలి. బుకింగ్ పూర్తయిన



తర్వాత వచ్చే క్యూఆర్ కోడ్ లేదా టోకెన్ నంబర్ ఆధారంగా ఎంపిక చేసుకున్న ఎరువుల దుకాణంలో ఎరువులు పొందవచ్చు.

రైతులకు అవగాహన కల్పించనున్న వ్యవసాయ సిబ్బంది

గ్రామ వ్యవసాయ సహాయకులు గ్రామాల్లోని రైతులకు ఎఫ్ఎఫ్ఎస్ యాప్ వినియోగంపై అవగాహన కల్పించనున్నారు. రైతుల ఫార్మర్ ఐడీ, ఆధార్ లింక్ మొబైల్ నంబర్, భూమి, సర్వే నంబర్లు, పంట వివరాలను పరిశీలించి యాప్‌లో నమోదు చేసుకునేందుకు సహకరించనున్నారు. ఎరువుల బుకింగ్ నుంచి క్యూఆర్ కోడ్ పొందడం, డీలర్ల వద్ద ఈ-పీఓఎస్ యంత్రం ద్వారా ఎరువులు కొనుగోలు చేసే విధానం వరకు వివరించనున్నారు.

ఎంఆర్పీ ధరలకే ఎరువుల విక్రయాలు

ఎరువుల డీలర్ల వద్ద అందుబాటులో ఉన్న నిల్వలు, ఎరువుల లభ్యతను గ్రామ వ్యవసాయ సహాయకులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. రైతులకు నిర్ణీత గరిష్ఠ చిల్లర ధర ప్రకారమే ఎరువులు విక్రయించాలి. ప్రతి విక్రయానికి తప్పనిసరిగా ఈ-పీఓఎస్ యంత్రం ద్వారా బిల్లు జారీ చేయాలని డీలర్లకు ఆదేశాలు జారీ చేశారు.

రైతులు వివరాలు సిద్ధంగా ఉంచుకోవాలి

రైతులు తమ ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్, ఫార్మర్ ఐడీ వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులు సూచించారు. వాస్తవంగా సాగు చేస్తున్న వంట, భూమి వివరాలను మాత్రమే యాప్‌లో నమోదు చేయాలి. కొత్త విధానం అమలులో ఎదురయ్యే సాంకేతిక సమస్యలు, ఎరువుల కొరత వంటి ఇబ్బందులను గ్రామ వ్యవసాయ సహాయకులు వెంటనే మండల వ్యవసాయ అధికారి దృష్టికి తీసుకెళ్లాలి.ఎరువుల పంపిణీలో పారదర్శకతను పెంచి, అర్హులైన రైతులకు అవసరమైన ఎరువులను సకాలంలో అందించడమే ఈ నూతన విధానం ప్రధాన లక్ష్యమని నార్పల మండల వ్యవసాయ అధికారి తెలిపారు.

ప్రజల నమ్మకమే నా బలం.. వారి సమస్యల పరిష్కారమే నా లక్ష్యం!

గెలిపించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు.. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటా

ప్రజా భూమి -- నార్పల

నార్పల మండలంలో తనపై విశ్వాసం ఉంచి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించిన ప్రజలకు నార్పల మూడవ ఎంపీటీసీ సభ్యురాలు, కాబోయే ఎంపీపీ స్వాతిలతా రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో ప్రజలు అందించిన విజయాన్ని బాధ్యతగా భావిస్తూ, వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.సోమవారం నుల్తాన్‌పేటలోని మూడవ వార్డు పరిధిలో ఉన్న ఎస్సీ కాలనీ, గార్బాయి కొట్టాలు, జగనన్న కాలనీ, టెంకాయ చెట్ల వీధి, కురుబగేరి తదితర ప్రాంతాల్లో ఆమె పర్యటించారు. ఈ



సందర్భంగా ప్రతి ప్రాంతంలోని ప్రజలను కలుసుకుని, తన విజయానికి సహకరించిన ఓటర్లకు పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.

పదవి కాదు.. ప్రజాసేవే ప్రధాన బాధ్యత

ఈ సందర్భంగా స్వాతిలతా రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వమ్ము చేయనని తెలిపారు. ఏ కాలనీలోనైనా, ఏ వీధిలోనైనా ప్రజలకు తాగునీరు, రోడ్లు, పారిశుద్ధ్యం తదితర సమస్యలు ఎదురైతే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రమాణ స్వీకారం పూర్తయిన మరునాటి రోజు నుంచే ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు.ఎంపీటీసీ సభ్యురాలిగా, ఎంపీపీగా ప్రజలకు సేవ చేయడమే తన ప్రధాన లక్ష్యమని, ప్రజలకు ఎప్పుడు అవసరమైనా అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉంటూ, వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తనను గెలిపించిన ప్రతి ఒక్కరికీ మరోసారి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుల్తాన్‌పేటకు చెందిన పల్లె నాగభూషణ్ రెడ్డి, గూడపరెడ్డి దినేష్ రెడ్డి, బిమిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, గూడపరెడ్డి దామోదర్ రెడ్డి, తీగల శ్రీకాంత్ రెడ్డి, పల్లె బాలకృష్ణ రెడ్డి, నొస్సం అనిల్ రెడ్డి, గూడపరెడ్డి శివారెడ్డి, నొస్సం చెంద్రాయుడు, తీగల శంకర్ రెడ్డి, కొవ్వూరి విశ్వనాథ్ రెడ్డి, బంకు దాసు, రిక్షా పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులు ప్రజారోగ్య రక్షకులు

సబ్బులు, కొబ్బరి నూనె పంపిణీ చేసిన మున్సిపల్ కమిషనర్ తనూజ



ప్రజాభూమి, పులివెందుల

ప్రజారోగ్యాన్ని కాపాడటంలో పారిశుధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకమని మున్సిపల్ కమిషనర్ తనూజ అన్నారు.శనివారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పారిశుధ్య కార్మికుల సంక్షేమం, ఆరోగ్య పరిరక్షణలో భాగంగా శానిటేషన్ కార్మికులకు సబ్బులు, కొబ్బరి నూనె పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజారోగ్యాన్ని కాపాడటంలో పారిశుధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకమని, కార్మికుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని వారికి సబ్బులు, కొబ్బరి నూనె అందజేస్తున్నట్లు తెలిపారు.రానున్న రోజుల్లో శానిటేషన్ పనులను మరింత శ్రద్ధతో నిర్వహించాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ ప్రసాద్ , మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల రిజర్వేషన్లు ఖరారు

-వివరాలను వెల్లడించిన ఎంపీడీవో



ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం మండలంలోని 14 గ్రామ పంచాయతీల సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు సంబంధించిన రిజర్వేషన్ల వివరాలను పెనుకొండ సబ్ కలెక్టర్ ఆనంద్‌కుమార్ సూచనల మేరకు సోమవారం ఎంపీడీవో దామోదరమ్మ వెల్లడించారు. ఇందులో భాగంగా బాలంపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానం ఎస్సీ జనరల్‌కు, బీరేపల్లి, బేవినహళ్లి, గోళ్లాపురం పంచాయతీలు బీసీ మహిళలకు కేటాయించారు. చలివెందుల, కొటిపి, సంతేబిదనూరు, తూముకుంట పంచాయతీలు జనరల్ కేటగిరీకి రాగా, చౌళూరు, మలుగూరు, పూలకుంట పంచాయతీలు జనరల్ మహిళలకు కేటాయించారు. కగ్గల్లు, కిరికెర పంచాయతీలు బీసీ జనరల్‌కు, మనేసముద్రం పంచాయతీ ఎస్సీ మహిళకు రిజర్వు చేసినట్లు తెలిపారు. సర్పంచ్ స్థానాలతో పాటు ఆయా గ్రామ పంచాయతీల్లో వార్డు సభ్యుల స్థానాలకు కూడా కేటగిరీల వారీగా రిజర్వేషన్లు ఖరారు చేసినట్లు వెల్లడించారు. రిజర్వేషన్ల ప్రకటనతో గ్రామాల్లో పంచాయతీ ఎన్నికలపై ఆశావహుల్లో ఆసక్తి నెలకొంది. తమకు అనుకూలమైన రిజర్వేషన్లు రావడంతో కొందరు పోటీకి సిద్ధమవుతుండగా, ఇతర స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థుల కోసం రాజకీయ నాయకులు అన్వేషణ ప్రారంభించారు. దీంతో గ్రామాల్లో ఎన్నికల వాతావరణం క్రమంగా వేడెక్కుతోంది.

పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా జరగాలి

- ఎన్నికల నియమావళిని పాటించాలి

- నేరపూరిత కార్యకలాపాలకు దూరంగా ఉండాలి

- సీఐ నరసింహులు



ప్రజాభూమి, వేంపల్లె

రానున్న పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని సీఐ టి. నరసింహులు సూచించారు. ఈ మేరకు ఆయన మండలంలోని కుమ్మరాంవల్లి గ్రామంలో పర్యటించి గ్రామస్థులకు ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ ఎన్నికల సందర్భంగా ప్రతి ఒక్కరూ పాటించాల్సిన నియమాలు, చేయాల్సినవి, చేయకూడని పనుల గురించి వివరించారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల రోజున నేరపూరిత కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, గొడవలు, అల్లర్లకు పాల్పడకుండా శాంతిభద్రతలకు సహకరించాలని హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా గ్రామస్థులు పోలీసులకు సహకరించాలని సీఐ నరసింహులు కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజూ హోరెత్తిన నామినేషన్ల సందడి

బి ఎన్ కండ్రిగ మండలంలో 228 నామినేషన్లు..

సర్పంచ్‌కు 79, వార్డులకు 149 దాఖలు



ప్రజా భూమి ప్రతినిధి:- బుచ్చినాయుడు కండ్రిగ

తిరుపతి జిల్లా, బి ఎన్ కండ్రిగ మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ రెండో రోజు ఉత్సాహంగా కొనసాగింది. సోమవారం నాటికి మండలవ్యాప్తంగా మొత్తం 228 నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో సర్పంచ్ స్థానాలకు 79, వార్డు సభ్యుల స్థానాలకు 149 నామినేషన్లు నమోదయ్యాయి.మండలంలోని పల్లమాల గ్రామ పంచాయతీలో 63 నామినేషన్లు దాఖలు కాగా, సర్పంచ్‌కు 9, వార్డులకు 54 వచ్చాయి. పర్లపల్లిలో 62 (సర్పంచ్ 16, వార్డులు 46), కాటూరులో 38 (సర్పంచ్ 17, వార్డులు 21) నామినేషన్లు నమోదయ్యాయి.అలాగే బి.ఎన్ కండ్రిగ ఎంపీడీవో కార్యాలయంలో 26 (సర్పంచ్ 8, వార్డులు 18), బి.ఎన్ కండ్రిగ గ్రామ పంచాయతీలో 19 (సర్పంచ్ 14, వార్డులు 5), కరణిలో 20 (సర్పంచ్ 15, వార్డులు 5) నామినేషన్లు దాఖలయ్యాయి. రెండో రోజే పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలు కావడంతో గ్రామాల్లో ఎన్నికల సందడి నెలకొంది. ప్రధాన రాజకీయ పార్టీల మద్దతుతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా బరిలో నిలిచేందుకు ఆసక్తి చూపుతుండటంతో మండలంలో ఎన్నికల వాతావరణం వేడెక్కుతోంది.

కార్తీక మాసం తొలి సోమవారం.. కాశీ విశ్వేశ్వరుడికి విశేష పూజలు!

పంచామృత అభిషేకం.. వినాయకుని రూపంలో స్వామివారి అలంకరణ.. భక్తులతో కిక్కిరిసిన ఆలయం



ప్రజా భూమి -- నార్పల:

కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా నార్పల క్షేత్రంలోని శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామివారికి పంచామృత అభిషేకం నిర్వహించి, వినాయకుని రూపంలో విశేషంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక అర్చనలు, మహానైవేద్యం సమర్పించి మహామంగళహారతి నిర్వహించారు.కార్తీక మాసం తొలి సోమవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. స్వామివారి అభిషేకాలు, ప్రత్యేక హారతుల్లో పాల్గొని భక్తితో పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. కార్తీక మాసంలో శివారాధనకు విశేష ప్రాధాన్యత ఉండటంతో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఆలయ అర్చకులు నిర్వహించారు.

కోడుమూర్తి ఎస్సీ స్మశాన వాటికకు దారి ఇవ్వండి సార్....?

శవాన్ని మోసుకెళ్లాలన్నా ఇబ్బందే ఇంకెన్నాళ్ళు ఈ అవస్థలు...?

ఎమ్మెల్యే శ్రావణి శ్రీ న్యాయం చేయాలని కోరిన గ్రామస్తులు..!



ప్రజాభూమి యల్లనూరు

మండల పరిధిలోని కోడుమూర్తి ఎస్సీ గ్రామ ప్రజల అవస్థలు అంతా ఇంతా కాదు ఒక మనిషి చనిపోతే వారిని స్మశానానికి ఎలా మోసుకు పోవాలో అన్నది ఆ వ్యక్తి యొక్క కుటుంబ సభ్యులు పాలిట చాలెంజ్ గా ఉందని చెప్పడంలో ఏమాత్రం సందేహం లేదు గత తరాల కాలం నాటి నుండి ఇదే సమస్య తలెత్తడంతో ఈ తరం యువత మాత్రం అప్పుడు ఎలా వెళ్లారో ఇప్పుడు ఈ ముళ్ళ కంపల నడుమ కాళి బాటగుండ శవాన్ని మోసు కెళ్లాలంటే మా వల్ల కాదు మహా ప్రభో అంటున్నారు శవాన్ని ఎత్తుకెళుతున్న వారు ముళ్ళ కంపలు తొక్కుకుంటూ దారి పొడవున దట్టమైన ముళ్ళ కంపలతో కప్పి ఉంచడంతో పాటుగా చుట్టూ వరి పొలాల నడుమ బురదలో తొక్కుకుంటూ, జారుకుంటూ మోసు కెళ్తున్న వారిని చూస్తూ వచ్చినటువంటి బంధువులు ఆ గ్రహానికి గురి చేసినట్లు ప్రత్యక్షంగా కనిపిస్తుంది ఎక్కడైనా హిందూ సాంప్రదాయ పద్ధతిలో శవాన్ని నలుగురు మోసుకెళ్లాలి ఇక్కడ మాత్రం ముగ్గురు మాత్రమే మోసుకుంటూ వెళ్లాల్సిందే అంటే ఎలా ఉందో రెవెన్యూ అధికారులే పరిస్థితి అర్థం చేసుకోవాలి ఇది ఇలా ఉంటే అగ్రకులాల వారు ఏమాత్రం ఎస్సీల స్మశాన భూమి అని చూడకుండా స్మశానం కొంతవరకు ఆక్రమించడంతో పాటు ఎస్సీలకు దారి లేకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నప్పటికీ పలుమార్లు ఇదే సమస్యను ఎస్సీలు గ్రీవెన్స్‌లో అర్జీ రూపంలో కూడా ఇవ్వడం జరిగింది తాసిల్దార్ వారి దృష్టికి ఎన్నోసార్లు ఈ ప్రధాన సమస్య కావడంతో ప్రభుత్వం వారికి నివేదిక పంపామని బాధితులకు తప్పకుండా ఇంకొంత భూమిని కేటాయిస్తామని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు అయితే దారి సమస్య ప్రధాన సమస్యగా పరిగణించి దారిపై దృష్టి ఉంచి ఎస్సీల పైన రెవెన్యూ అధికారులు న్యాయం చేయాలని తెలపడంతో పాటు ఈ గ్రామానికి చెందిన ఎస్సీ ప్రజలు మాట్లాడుతూ శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ కోడుమూర్తి ఎస్సీ గ్రామ ప్రజల పట్ల చిత్తశుద్ధి లేదని ఎమ్మెల్యే కావడం కోసం మాట ఇచ్చారు ఎమ్మెల్యే అయిన తర్వాత పట్టించుకోలేదు అంటే మేము ఓటుకు తప్ప దేనికి పనికి రామనే భావన ఎమ్మెల్యే శ్రావణి కి ఉంది అనడంలో సందేహం లేదు ఎస్సీలమంతా కలిసికట్టుగా మాకు మంచి చేస్తుందని నమ్మి ఓటు వేసినందుకు మాకు తగిన శాస్తి జరిగిందని ఇప్పటినుంచి ఎవరు మమ్మల్ని అగ్రకులాల వారి ఆక్రమణకు స్మశాన భూమి దారి ఆక్రమణకు గురైంది కనుక ఇప్పటినుంచి మాకు ఎవరు న్యాయం చేస్తారో వారిని మాత్రమే మా ఎస్సీ కాలనీ వాసులు ఆదరిస్తారని నిర్మొహమాటంగా మాట్లాడుతూ వారి ఆవేదనలు వ్యక్తపరచడం జరిగింది.

మార్పు చేసినపంచాయతీ ఎన్నికల తేదీలు.

ప్రజాభూమి, పుట్టూరు.

పుట్టూరు మండలంలో సర్పంచులు ఎన్నికలకు సంబంధించి న మూడో విడత నుండి రెండో విడతకు మార్చినట్లు ఎంపీడీవో అలివేలు అమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. నోటిఫికేషన్ వెలబడడంతో 18వ తేదీ నుండి 20వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 21వ తేదీ నామినేషన్ల పరిశీలన, 22న తిరస్కరణ పై అపీలు చేసుకునే అవకాశం 24వ తేదీ వరకు ఉపసంహరణ, అదే రోజు సాయంత్రం పోటీలో ఉన్న వారికి గుర్తులు కేటాయించడం జరుగుతుందని ఆమె తెలిపారు. 29న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎన్నికల నిర్వహించడం జరుగుతుందనీ ఒంటి గంట తర్వాత ఓట్ల లెక్కింపు నిర్వహించడం జరుగుతుందని ఆమె తెలిపారు.

59 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు



ప్రజాభూమి, పుట్టూరు.

పుట్టూరు శాఖ గ్రంథాలయం నందు ఈరోజు 59 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా గ్రంథాలయ ఉద్యమకారులైనటువంటి డాక్టర్ ఎస్ ఆర్ రంగనాథన్, గాడి చర్ల హరిసర్వోత్తమరావు, అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరి నాగభూషణం, వావిలాల గోపాలకృష్ణయ్య మొదలగువారు గ్రంథాలయాల అభివృద్ధికి చేసిన సేవను గుర్తు చేసుకుని వారి చిత్రపటా లకు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగినది. కార్యక్రమంలో లైబ్రేరియన్ ప్రకాష్ రెడ్డి , టీచర్ నాగేశ్వర రెడ్డి పాల్గొనడమైనది . గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలని ఈ విజ్ఞాన నిలయాలను ఉపయోగించుకుని విద్యార్థినీ విద్యార్థులు అభివృద్ధి చెందాలని ప్రసంగించారు. అజ్ఞానాన్ని తొలగించే ఒక జ్ఞానజ్యోతి గ్రంథాలయం అని కొనియాడారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ , పాఠకులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొనడమైనది .

సీటీఓ కృష్ణవేణి లంచాలపై సమగ్ర విచారణ జరపాలి



ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం వాణిజ్య పన్నుల శాఖ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ (సీటీఓ) కృష్ణవేణిపై వచ్చిన అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలను నిగ్గుతేల్చాలని ఆర్టీఐ యాక్టివిస్ట్ ఆర్ముగైజేషన్ డిమాండ్ చేసింది. వ్యాపారులు, చిరు వ్యాపారుల నుంచి నెలవారీ మామూళ్ల వసూలు చేస్తున్నారనే ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేపట్టాలని కోరింది. ఈ మేరకు ఆ సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. రామచంద్ర నాయక్ విజయవాడలోని వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్‌కు సోమవారం లిఖిత పూర్వకంగా ఫిర్యాదు అందజేశారు. హిందూపురం సీటీఓపై గతంలో చోటుచేసుకున్న పరిణామాలతో పాటు ప్రస్తుతం వెలుగులోకి వచ్చిన ఆరోపణలను కూడా సమగ్రంగా పరిశీలించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ముఖ్యంగా వ్యాపారులు, చిన్నచిన్న దుకాణాలు నిర్వహించే చిరు వ్యాపారుల నుంచి నెలవారీ మామూళ్ల వసూలు చేస్తున్నారనే ఆరోపణలపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఈ వ్యవహారంపై స్థానిక స్థాయిలో కాకుండా శాఖకు చెందిన ఉన్నతాధికారులతో ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేసి విచారణ జరిపించాలని కోరారు. ఆరోపణలకు సంబంధించిన అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి, బాధ్యులెవరో గుర్తించాలని సూచించారు. విచారణలో ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత అధికారిని విధుల నుంచి తొలగించడంతో పాటు శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని రామచంద్ర నాయక్ డిమాండ్ చేశారు. వ్యాపారులు, చిరు వ్యాపారులు ఎలాంటి ఒత్తిళ్లు, ఇబ్బందులు లేకుండా తమ వ్యాపారాలు నిర్వహించుకునేలా శాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

కొండరాజు పల్లి సర్పంచ్ అభ్యర్థిగా బిజెపి నాయకుడు ఎదురు భాస్కర్ రెడ్డి నామినేషన్



ప్రజాభూమి పోరుమామిళ్ల :

కాశినాయన మండల పరిధిలోని కొండరాజు పల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవికి భారతీయ జనతా పార్టీ (బిజెపి) బలపరిచిన అభ్యర్థిగా కాశినాయన మండల బిజెపి ఉపాధ్యక్షుడు ఎదురు భాస్కర్ రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీగా వెళ్లిన ఎదురు భాస్కర్ రెడ్డి, ఎన్నికల అధికారికి తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు: ఈ నామినేషన్ దాఖలు కార్యక్రమానికి కాశినాయన మండల బిజెపి అధ్యక్షుడు బీజ వేముల నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు మండల స్థాయి బిజెపి నాయకులు, బూత్ స్థాయి కార్యకర్తలు, మరియు కొండరాజు పల్లి గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎదురు భాస్కర్ రెడ్డికి తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు. నాయకుల స్పందన: ఈ సందర్భంగా మండల బిజెపి అధ్యక్షుడు బీజ వేముల నారాయణరెడ్డి మాట్లాడుతూ, కొండరాజు పల్లి గ్రామ సమగ్ర అభివృద్ధికి ఎదురు భాస్కర్ రెడ్డి అభ్యర్థిత్వం ఎంతో అవసరమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేరవేయడంలో మరియు గ్రామంలో మౌలిక వసతుల కల్పనలో బిజెపి అభ్యర్థి ముందుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం సర్పంచ్ అభ్యర్థి ఎదురు భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామ ప్రజల ఆశీస్సులతో తాను గెలిస్తే కొండరాజు పల్లి పంచాయతీని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. తాగునీరు, రహదారులు, పారిశుధ్యం వంటి ప్రధాన సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. తన నామినేషన్ కార్యక్రమానికి తరలివచ్చిన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, గ్రామస్తులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

శ్రీ రంగనాథ స్వామి ఆలయ అభివృద్ధికి సహకరించిన దాతలకు ఘన సన్మానం



ప్రజాభూమి,పులివెందుల

వులివెందులలోని పురాణ ప్రసిద్ధి చెందినటువంటి శ్రీ రంగనాథ స్వామి ఆలయ అభివృద్ధికి పలువురు దాతలు తమ వంతు సహాయ సహకారాలు అందించారు. ముఖ్యంగా ఆలయంలోని ప్రహరీ గోడ చుట్టూ విద్యుత్ పైప్ లైన్, ఎల్ఈడి లైట్ల ఏర్పాటు నిర్మాణంకు సుమారు లక్ష రూపాయలు తో చేయించారు. అలాగే ఆలయ ప్రాంగణం, ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న సుందరీకరణ పనులను, జంగిల్ క్లియరెన్స్ కార్యక్రమాలను, ఆలయ వెలుపల ఉన్న ప్రహరీ గోడ చుట్టూ ఉన్న కంప చెట్లు ఇతర నిర్మాణాల తొలగింపునకు చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమాలకు శ్రీశైలం దేవస్థాన మాజీ నెంబర్ గువ్వల గంగాధర్, రిటైర్డ్ డి ఈ సుధాకర్ రెడ్డి, ఏపీజీబీ రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ జూటూరు గంగిరెడ్డి, రామట్ల పల్లె తుమ్మలూరు కరుణాకర్ రెడ్డి, అపోలో టైర్స్ అధినేత కుమ్మేత గురువిరెడ్డి, భారతి సిమెంట్ డీలర్ గజ్జల జగన్మోహన్ రెడ్డి, సుబ్బయ్య షాప్ నిర్వాహకులు చల్ల రమణ, రిటైర్డ్ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, ఉపాధ్యాయులు పెద్దపల్లి శ్రీనివాసులు, శ్రీ చైతన్య కళాశాలల అధిపతి ఆరవేటి నారాయణరెడ్డి, శ్రీ రంగనాథ ట్రస్ట్ సీఈఓ అల్లం రంగనాయకులు రాయల్ తదితరులు సహాయ సహకారాలు అందించారు. వీరికి ఆలయ ఈవో కెవి రమణ, ప్రధాన అర్చకులుతలముడిపి నవీన్ కుమార్ శర్మ ప్రత్యేక పూజలుచేయించి అనంతరం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారికి స్వామివారి చిత్రపటాలు తీర్థప్రసాదాలు అందజేశారు.కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

పెజావర్ స్వామీజీ పర్యటనకు ఆర్డీఓకు ఆహ్వానం



ప్రజాభూమి, హిందూపురం టౌన్

ప్రపంచ ప్రసిద్ధి చెందిన చారిత్రక లేపాక్షి శ్రీ దుర్గా వీరభద్రస్వామి ఆలయానికి ఈ నెల 18వ తేదీన పెజావర్ స్వామీజీ విచ్చేయనున్న నేపథ్యంలో, ఈ కార్యక్రమానికి హాజరుకావాలని పెనుకొండ ఆర్డీఓ ఆనంద్ కుమార్‌ను ఆలయ కమిటీ చైర్మన్ పరిగి వేణుగోపాలరావు ఆహ్వానించారు. ఈ సందర్భంగా సోమవారం ఆర్డీఓను మర్యాదపూర్వకంగా కలిసి స్వామీజీ పర్యటన వివరాలను తెలియజేస్తూ ఆహ్వాన పత్రికను అందజేశారు. స్వామీజీ పర్యటన సందర్భంగా ఆలయంలో నిర్వహించనున్న కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ప్రజాభూమి
జనరల్ 10
ఆదివారం 8 నవంబర్ 2026

వినియోగదారుల మన్ననలు పొందేలా వ్యాపార సంస్థల నిర్వహణ ఉండాలి

- ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

ప్రజాభూమి ప్రతినిధి, తాళ్లపూడి

వినియోగదారులే దేవుళ్లుగా భావించి, వారికి నాణ్యమైన వస్తువులు, మెరుగైన సేవలు అందిస్తూ వారి మన్ననలు పొందే విధంగా వ్యాపార సంస్థలను నిర్వహించాలని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సూచించారు. తాళ్లపూడి మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన సహస్ర షాపింగ్ మాల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై షాపింగ్ మాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా షాపింగ్ మాల్ యాజమాన్యం నామన పరమేశ్ ఎమ్మెల్యేకు జ్ఞాపిక అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతనంగా వ్యాపార రంగంలోకి అడుగుపెట్టిన యాజమాన్యం వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తూ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలని ఆకాంక్షించారు. సహస్ర షాపింగ్ మాల్ మరింత అభివృద్ధి సాధించి



వినియోగదారుల ఆదరణ పొందాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో షాపింగ్ మాల్ యాజమాన్యం, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.



తాడిపూడిలో కూటమి హవా.. అట్టహాసంగా అరవాలమ్మ నామినేషన్

- భారీగా తరలివచ్చిన కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు
- గ్రామాభివృద్ధే నా లక్ష్యం.. ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తా: అరవాలమ్మ

ప్రజాభూమి ప్రతినిధి, తాళ్లపూడి

తాడిపూడి గ్రామంలో కూటమి ఎన్నికల సందడి నెలకొంది. కూటమి తరపున జనసేన పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా బరిలో నిలిచిన లింగంపల్లి అరవాలమ్మ సోమవారం అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో నామినేషన్ ప్రాంగణం పండుగ వాతావరణాన్ని తలపించింది. నామినేషన్ దాఖలు చేసిన అనంతరం అరవాలమ్మ మాట్లాడుతూ తనకు మద్దతుగా నిలిచిన గ్రామస్తులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పదవి కోసం కాకుండా తాడిపూడి గ్రామ అభివృద్ధి కోసమే ఎన్నికల బరిలోకి దిగానని స్పష్టం చేశారు. గ్రామస్తులు తనపై చూపిస్తున్న ఆదరాభిమానాలకు ఎప్పటికీ రుణపడి ఉంటానని పేర్కొన్నారు. తనను సర్పంచ్‌గా గెలిపిస్తే గ్రామంలోని ప్రతి సమస్యను తన సొంత సమస్యగా భావించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడం, అన్ని వీధుల్లో సిమెంట్ రోడ్లు నిర్మించడం, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం, వీధి దీపాలు ఏర్పాటు చేయడం, గ్రామాన్ని పరిశుభ్రమైన ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడం తన ప్రధాన లక్ష్యాలని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానన్నారు. పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరినీ కలుపుకుని ముందుకు సాగడంతో పాటు మహిళల అభ్యున్నతి, యువత ఉపాధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు. మండల పరిషత్ ద్వారా భారీగా నిధులు తీసుకువచ్చి తాడిపూడి గ్రామాన్ని మండలంలోనే అభివృద్ధిలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అరవాలమ్మకు మద్దతుగా నినాదాలు చేస్తూ పూలమాలలతో ఘనంగా సత్కరించారు. "అరవాలమ్మ గెలుపు.. తాడిపూడి అభివృద్ధి" అనే నినాదాలతో గ్రామంలో ఎన్నికల సందడి నెలకొంది.

రెండో రోజుకు చేరిన పంచాయతీ నామినేషన్ల ప్రక్రియ

- క్రమపద్ధతిలో నామినేషన్లు స్వీకరించాలి : ఆర్డీవో ఆనందరావు
- 144 సెక్షన్ అమలులో ఉంది పోలీసుల ఆదేశాలు పాటించాలి : సీఐ విజయబాబు



ప్రజాభూమి ప్రతినిధి, తాళ్లపూడి

పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఎటువంటి వివాదాలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో క్రమపద్ధతిలో నిర్వహించాలని కొవ్వూరు ఆర్డీవో ఆనందరావు అధికారులకు సూచించారు. సోమవారం తాళ్లపూడి మండలంలో జరుగుతున్న నామినేషన్ల ప్రక్రియను ఆయన పరిశీలించారు. నామినేషన్ల స్వీకరణ వేగవంతంగా, నిబంధనలకు అనుగుణంగా జరిగేలా అధికారులకు పలు సూచనలు చేశారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మరోవైపు నామినేషన్ కేంద్రాల వద్ద శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని రూరల్ సీఐ విజయబాబు తెలిపారు. ప్రస్తుతం 144 సెక్షన్ అమలులో ఉందని, పోలీసుల ఆదేశాలను ఎవరూ నిర్లక్ష్యం చేయరాదని స్పష్టం చేశారు. ఆయన కూడా నామినేషన్ కేంద్రాలను పరిశీలించి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. కాగా, నామినేషన్ల ప్రక్రియ రెండో రోజుకు చేరుకోవడంతో సోమవారం మంచి రోజుగా భావించిన పలు గ్రామాల ఆశావహులు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేసేందుకు తరలివచ్చారు. దీంతో నామినేషన్ కేంద్రాలు అభ్యర్థులు, వారి మద్దతుదారులతో సందడిగా మారాయి.

ర్యాలి సర్పంచ్ అభ్యర్థిగా జనసేనకు చెందిన మద్దూరి సంధ్యారాణి

- కూటమి తరపున అభ్యర్థిత్వం ఖరారు చేసిన టీడీపీ, జనసేన నాయకులు



ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట


ఆత్రేయపురం మండలంలోని ప్రధాన గ్రామ పంచాయతీ అయిన ర్యాలి సర్పంచ్ అభ్యర్థిత్వాన్ని కూటమిలో భాగంగా జనసేన పార్టీకి కేటాయించినట్లు కూటమి నాయకులు ప్రకటించారు. జనసేన పార్టీ తరపున మద్దూరి రామకృష్ణ సంధ్యారాణిని పేరును సర్పంచ్ అభ్యర్థిగా ఖరారు చేశారు. సోమవారం సాయంత్రం ర్యాలి గ్రామానికి చెందిన తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి కొత్తపేట జనసేన పార్టీ ఇన్‌ఛార్జి బండారు శ్రీనివాస్, ఆత్రేయపురం జడ్పీటీసీ గూడపాటి శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ, ర్యాలి పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా మద్దూరి రామకృష్ణ సంధ్యారాణిని బలపరుస్తున్నట్లు ప్రకటించారు. కూటమిలోని పలువురు నాయకులు సర్పంచ్ అభ్యర్థిత్వాన్ని ఆశించినప్పటికీ, పొత్తు ధర్మంలో భాగంగా చివరకు జనసేన పార్టీకి అవకాశం కల్పించినట్లు తెలిపారు. కూటమి నిర్ణయాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించి, పార్టీలకు అతీతంగా సమన్వయంతో పనిచేసి ఉమ్మడి అభ్యర్థి మద్దూరి సంధ్యారాణి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే కూటమి ప్రభుత్వంలో పార్టీ పదవులు, నామినేటెడ్ పదవులు అనుభవిస్తూ పార్టీ నిర్ణయాలకు, కూటమి పిలుపునకు వ్యతిరేకంగా పనిచేసే వారిపై ఎన్నికల అనంతరం క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని నాయకులు హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆత్రేయపురం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కూసంపూడి రామకృష్ణంరాజు, క్లస్టర్ ఇన్‌ఛార్జి కరుటూరి నరసింహారావు, ర్యాలి టీడీపీ సీనియర్ నాయకుడు పెర్చెర్ల పుల్లంరాజు వర్మ, గ్రామ ఎంపీటీసీ సభ్యులు, కేశవస్వామి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, పెండెం వెంకన్నతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

ఆత్రేయపురం రాజకీయాల్లో బీఎస్పీ ఎంట్రీ.. ప్రధాన పార్టీల్లో చర్చ!

- సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాల్లో పోటీకి సిద్ధం
- కొత్త రాజకీయ సమీకరణాలకు తెరలేపు తున్న బహుజన్ సమాజ్ పార్టీ

ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట

ఆత్రేయపురం మండల రాజకీయాల్లో బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) ప్రవేశం ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్ పదవులతో పాటు వార్డు సభ్యుల స్థానాల్లోనూ అభ్యర్థులను బరిలోకి దింపేందుకు బీఎస్పీ సిద్ధమవుతుండటంతో మండల రాజకీయాల్లో కొత్త పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటివరకు అధికార కూటమి, ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీల మధ్యే ప్రధాన పోటీ ఉంటుందని భావిస్తున్న తరుణంలో బీఎస్పీ అభ్యర్థుల రంగప్రవేశం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. రెండు ప్రధాన రాజకీయ పక్షాలకు ప్రత్యామ్నాయంగా బీఎస్పీ పోటీకి సిద్ధం కావడం స్థానిక రాజకీయ సమీకరణాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందన్న చర్చ మొదలైంది. బహుజనుల హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం, గ్రామాల అభివృద్ధి, అణగారిన వర్గాల సమస్యలకు ప్రాధాన్యత కల్పించడమే లక్ష్యంగా ప్రజల్లోకి వెళ్లేందుకు పార్టీ నాయకులు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. గ్రామస్థాయిలో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాల్లో పోటీ చేయడం ద్వారా ప్రజా సమస్యలపై తమ గళాన్ని వినిపించాలని భావిస్తున్నారు. మొత్తంగా ఈసారి ఆత్రేయపురం మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల పోరు రెండు ప్రధాన పార్టీలకే పరిమితం కాకుండా బీఎస్పీ ప్రవేశంతో మరింత ఆసక్తికరంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. బీఎస్పీ పోటీ ప్రభావం ఏ మేరకు ఉంటుందో, గ్రామీణ రాజకీయాల్లో ఎలాంటి మార్పులు తీసుకొస్తుందో వేచి చూడాల్సిందే.



ర్యాలి గ్రామంలో పారిశుధ్య సమస్యపై జడ్పీటీసీ ప్రత్యేక దృష్టి

- విద్యార్థులు, ప్రజలకు తప్పని ఇబ్బందులు, అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం
- చెత్త కుప్పలను తక్షణమే తొలగించాలని పంచాయతీ సిబ్బందికి సూచన.
- ర్యాలి అభివృద్ధికి ప్రజలందరినీ భాగస్వాములను చేస్తాం : జడ్పీటీసీ గూడపాటి



ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట

ఆత్రేయపురం మండలంలోని ప్రధాన గ్రామపంచాయతీ అయిన ర్యాలి గ్రామంలో పారిశుధ్య పరిస్థితి ఆందోళనకరంగా మారింది. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అతి సమీపంలో, ప్రధాన రహదారి పక్కనే చెత్త కుప్పలు పేరుకుపోవడంతో విద్యార్థులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెత్తాచెదారం మధ్య కుక్కలు స్వైరవిహారం చేస్తుండటంతో పాఠశాలకు వెళ్లే చిన్నారులకు ప్రమాదం పొంచి ఉంది. నిత్యం వందలాది మంది రాకపోకలు సాగించే ఈ ప్రాంతం అపరిశుభ్రతకు నిలయంగా మారడం పట్ల స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పేరుకుపోయిన చెత్త నుంచి వెలువడుతున్న దుర్వాసనతో పరిసర ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా చెత్త కుప్పల కారణంగా దోమలు, ఈగలు వృద్ధి చెందే అవకాశం ఉండటంతో మలేరియా, డెంగ్యూ వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులతో పాటు ఇతర అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా పాఠశాల విద్యార్థుల ఆరోగ్యంపై ఈ అపరిశుభ్రత ప్రభావం చూపే అవకాశం ఉంది. వర్షం పడినప్పుడు చెత్తతో కలిసిన మురుగునీరు రహదారిపై ప్రవహిస్తే పరిస్థితి మరింత దారుణంగా మారే ప్రమాదం ఉంది. ఈ పరిస్థితిని గుర్తించిన ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆత్రేయపురం జడ్పీటీసీగా ఎన్నికైన గూడపాటి శ్రీనివాసరావు, ఎంపీటీసీ-3 అత్తిలి రామలక్ష్మి వెంకట్, స్థానిక ప్రజలతో కలిసి చెత్త పేరుకుపోయిన ప్రాంతాన్ని సందర్శించారు. అక్కడి పరిస్థితులను పరిశీలించి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ గూడపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రజలకు, ముఖ్యంగా పాఠశాల విద్యార్థులకు ఇబ్బందికరంగా మారిన చెత్త కుప్పలను తక్షణమే తొలగించేలా పంచాయతీ సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. నిత్యం వందలాది మంది రాకపోకలు సాగించే ప్రధాన రహదారి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, గ్రామంలో నిరంతర పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుకోవడం ఒక్క పంచాయతీ సిబ్బంది బాధ్యత మాత్రమే కాదని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించి సహకరించాలని కోరారు. పంచాయతీ ఏర్పాటు చేసిన చెత్త సేకరణ కేంద్రాలు, వాహనాల్లోనే చెత్తను వేయాలని, రోడ్ల పక్కన, బహిరంగ ప్రదేశాల్లో చెత్త పారవేయకుండా ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ర్యాలి గ్రామ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్న శ్రీనివాసరావు.. గ్రామంలో నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు రాజకీయాలకు అతీతంగా అభివృద్ధిని కాంక్షించే ప్రతి ఒక్కరినీ కలుపుకొని ఒక కమిటీ ఏర్పాటు చేసి ముందుకు సాగుతానని తెలిపారు. గ్రామంలో పారిశుధ్యం, తాగునీరు, రహదారులు, డ్రైనేజీ తదితర సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు.



ఇంచార్జీ చంద్రశేఖర్ కు శుభాకాంక్షలు తెలిపిన

కాజులూరు జనసేన శ్రేణులు

- గజమాలతో ఘనంగా సత్కారం
- భారీగా తరలివచ్చిన అభిమానులు పార్టీ శ్రేణులు

ప్రజాభూమి ప్రతినిధి, కాజులూరు

రామచంద్రపురం నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జీ పోలిశెట్టి చంద్రశేఖర్ పుట్టిన రోజు సందర్భంగా కాజులూరు మండల పరిధిలోగల పలువురు జనసేన నేతలు శ్రేణులు భారీగా తరలి వెళ్లే శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ ను గజమాలతో ఘనంగా సత్కరించి కేక్ కట్ చేసి అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు ఈకార్యక్రమంలో కాజులూరు మండల జనసేన పార్టీ అధ్యక్షులు,కోలంక గ్రామ పంచాయతీ కూటమి అభ్యర్థి బొండా వెంకన్న, కాజులూరు జడ్పీటీసీ కూటి శేషరత్నం, కోలంక సొసైటీ అధ్యక్షులు బొండా వెంకట నరసింహ నాయుడు మండలంలో పలు గ్రామాలకు సంబంధించిన జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం ఎన్నికల నిర్వహణపై సమావేశం

- సభ్యత్వ నమోదు పత్రాలు విడుదల

ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట

స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఎన్నికల ఆహ్వాన సంఘం సమావేశం నిర్వహించారు. ఆదివారం రాత్రి సంఘం అధ్యక్షుడు ర్యాలీ రాజశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి రాష్ట్ర విశ్వబ్రాహ్మణ ఎన్నికల ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షుడు జవ్వాది కూర్మాచార్యులు, ఎన్నికల సంఘం అధ్యక్షుడు ధనలకోట శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ సంఘం ఎన్నికల నిర్వహణకు సంబంధించి పలు అంశాలపై చర్చించారు. ఎన్నికల ప్రక్రియ, సభ్యత్వ నమోదు తదితర విషయాలపై సమావేశంలో అభిప్రాయాలను పంచుకున్నారు. అనంతరం ఎన్నికల సభ్యత్వ నమోదు పత్రాలను అతిథులు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సంఘం కార్యదర్శి అప్పత్తుల శివశ్రీ, కటోజు సన్నాయి దాసు, జిల్లా కార్యదర్శి ఆవు పార్టీ వేణుగోపాల్, జిల్లా కోశాధికారి కోసన బీమశంకర్, తణుకు జయచంద్ర ప్రసాద్, అనుపోజు సాంబమూర్తి, కొచ్చర్ల కోటేశ్వరరావు, వీరమల్ల సందీప్, సుబ్రహ్మణ్యం, ఉడిముడి సుబ్బారావు, అమలాపురం స్వర్ణకార సంఘం అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

సప్తవర్ణశోభితం..
శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామివారి పుష్పయాగం

- 12 రకాల పుష్పాలు, 6 రకాల పత్రాలతో నివేదన
- పుష్పయాగంలో పాల్గొన్న చెవిరెడ్డి దంపతులు
- వైఖానస ఆగమోక్తంగా పుష్ప యాగం నిర్వహణ

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి రూరల్



తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో సోమవారం జరిగిన పుష్పయాగ మహోత్సవం సప్తవర్ణ శోభితంగా భక్తులను ఆకట్టుకుంది. సాయంత్రం 3 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు ఆలయంలో ప్రత్యేకంగా వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. పుష్పయాగానికి ముందు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంలతో అభిషేకం చేశారు. ఆ తర్వాత సాయంత్రం 3 గంటల నుండి పుష్పయాగ మహోత్సవాన్ని కన్నులపండువుగా నిర్వహించారు. దేశ నలుమూలల నుంచి తీసుకువచ్చిన 12 రకాల పుష్పాలు, 6 రకాల పరిమిళ భరిత పత్రాలు (ఆకులు)తో స్వామి వారికి నివేదన చేసి భక్తితో మంత్ర పఠనం చేశారు. తిరుమల శ్రీవారి ఆలయంలో నిర్వహించే పుష్పయాగానికి ఏ మాత్రం తక్కువ కాకుండా వైఖానస ఆగమోక్తంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి తీసుకువచ్చిన చామంతి, రోజాలు, గన్నేరు, సంపంగి, మల్లెలు, రుక్మి, కనకాంబరాలు, తామర, కలువ, మొగలిరేకులు, మాను సంపంగి పుష్పాలు, తులసి, దవనం, మరవం, బిల్వం, పన్నీరాకు వంటి ఆకులను పుష్పయాగంలో ఉపయోగించారు. శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగే పుష్పయాగానికి సుమారు 3 టన్నుల పుష్పాలను వినియోగించారు.

భక్తులకు ప్రసాదంగా అందజేత

శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని ఉత్సవ మూర్తులకు పుష్పయాగంలో నివేదించిన పుష్పాలను భక్తులకు ప్రసాదంగా అందజేశారు. అరుదైన పుష్పాలు చేతికి రావడంతో భక్తులు ఆనందంగా స్వీకరించి భక్తితో తమ వెంట తీసుకుని వెళ్లారు. పుష్పయాగంలో పాల్గొన్న భక్తులు స్వామి, అమ్మ వార్ల దివ్యమంగళ రూపాన్ని తిలకించి భక్తితో పరవశించారు. ఈ పుష్పయాగ మహోత్సవంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు చెవిరెడ్డి దంపతులతో పాటు గ్రామస్తులు, స్వామి వారి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రజాభూమి
పోలవరం 11
మంగళవారం 17 నవంబరు 2026

ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం

జిల్లా ఎన్నికల అధికారి పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్





ప్రజాభూమి ప్రతినిధి-రంపచోడవరం

పోలవరం జిల్లాలో రెండో సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికలను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఎన్నికల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం స్థానిక ఐటీడీఏ సమావేశపు హలులో రెండో సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి స్టేజ్-1, స్టేజ్-2 ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం పోలవరం జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ ఆధ్వర్యంలో పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్,జడ్పీ సి ఈ ఓ పురుషోత్తం,డీపీవో జి. భాస్కర రావు, డ్వామా పి డి రామ్ ప్రసాద్, కలిసి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ పోలవరం జిల్లాలో ఎన్నికల విధివిధానాలపై ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు.రిటర్నింగ్ అధికారులు ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పని సరిగా పాటించాలని ఆయన తెలిపారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, అభ్యర్థుల ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు, పోలింగ్ నిర్వహణ,ఓట్ల లెక్కింపు తదితర అంశాలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ప్రతి దశలోనూ అప్రమత్తంగా వ్యవహరించాలని,ఎన్నికల విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని ఆయన ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే అవకాశం ఎవరికీ కల్పించకూడదని స్పష్టం చేశారు. పోలవరం జిల్లాలో సమస్యాకమైన పోలింగ్ కేంద్రంలో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రాల్లో ప్రతిష్టమైన భద్రత ఏర్పాటుకు తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని అదేవిధంగా ల్యాండ్ ఆర్డర్ సమస్యలు రాకుండా ఎక్కడికి అక్కడ తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఎక్కడైనా సమస్యలు ఉన్న ఎడల కంట్రోల్ రూమ్లకు తెలియపరచిన యెడల స్పందించి సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు.శిక్షణలో భాగంగా ఎన్నికల విధులు, రిటర్నింగ్ అధికారుల బాధ్యతలు, ఎన్నికల నిర్వహణలో పాటించాల్సిన నియమ నిబంధనలు, వివిధ దశల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు జేసీ అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో స్టేజ్ 1,2, రిటర్నింగ్ అధికారులు, సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణతోనే బంగారు భవిష్యత్తు!

- రేఖపల్లిలో ఏఎస్డీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు
- నాలుగు మండలాల విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్న వైనం..
- ప్రతిభావంతులకు ప్రశంసా పత్రాలు, మెమెంటోల ప్రదానం

ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం

బాలల హక్కుల పరిరక్షణ, విద్యా వికాసం, సాంస్కృతిక ప్రతిభకు ప్రోత్సాహం అందించడమే లక్ష్యంగా రేఖపల్లిలో బాలల దినోత్సవ వేడుకలు సోమవారం అట్టహాసంగా నిర్వహించారు. స్థానిక రేఖపల్లి ఏఎస్డీఎస్ కార్యాలయ ఆవరణలో ఏఎస్డీఎస్ సంస్థ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు వి. గాంధీబాబు ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. నాలుగు మండలాలకు చెందిన విద్యార్థినులు, ఉపాధ్యాయులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని బాలల దినోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే పాటలతో పాటు దేశభక్తి గీతాలు, జానపద పాటలకు చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు సభికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మారుమూల గిరిజన ప్రాంతాలకు చెందిన విద్యార్థినులు తమలోని కళాత్మక ప్రతిభను వేదికపై ప్రదర్శిస్తూ అందరి ప్రశంసలు అందుకున్నారు. చిన్నారుల ఉత్సాహభరితమైన నృత్యాలు, కళా ప్రదర్శనలతో కార్యక్రమ ప్రాంగణం సందడిగా మారింది.

ప్రతిభావంతులకు ప్రశంసా పత్రాలు, మెమెంటోలు

బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని నాలుగు మండలాల పరిధిలోని వివిధ పాఠశాలల్లో నిర్వహించిన క్రీడా పోటీలు, వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెమెంటోలను అందజేశారు. విద్యతోపాటు క్రీడలు, సాహిత్యం, సాంస్కృతిక రంగాల్లోనూ విద్యార్థులు రాణించాలని ఈ సందర్భంగా వక్తలు ఆకాంక్షించారు.అదేవిధంగా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందితో పాటు వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన పలువురిని గుర్తించి సత్కరించారు. ఉత్తమ వైద్యుడు, ఉత్తమ ఉపాధ్యాయుడు, ఉత్తమ ఐసీడీఎస్ సిబ్బంది, ఉత్తమ విద్యార్థులతో పాటు ఇతర రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను అందజేసి అభినందించారు. విద్యార్థులను ప్రోత్సహించడంతోపాటు సమాజానికి సేవలందిస్తున్న ఉద్యోగులను గుర్తించి గౌరవించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

గిరిజన విద్యార్థుల ప్రతిభ అభినందనీయం: వి. సూర్యనారాయణ రాజు



కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్పర్సన్ వి. సూర్యనారాయణ రాజు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లోని మారుమూల గ్రామాలకు చెందిన చిన్నారులు తమ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు విద్యాపరమైన అంశాల్లోనూ ప్రతిభను ప్రదర్శించడం ఎంతో సంతోషకరమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతోపాటు తమలోని నైపుణ్యాలను వెలికితీసేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రతి చిన్నారికి విద్య, ఆరోగ్యం, రక్షణ, సమాన అవకాశాలు అందేలా సంబంధిత శాఖలు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు.

బాలల హక్కుల పరిరక్షణకు సమష్టి కృషి: వి. గాంధీబాబు

ఏఎస్డీఎస్ సంస్థ డైరెక్టర్ వి. గాంధీబాబు మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం బాలల వారోత్సవాలను నిర్వహిస్తూ చిన్నారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. బాలలు వికసించే పువ్వులని, వారి హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా చూడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. బాలల హక్కుల ఉల్లంఘన జరగకుండా, వారికి విద్య, ఆరోగ్యం, రక్షణ, అభివృద్ధికి సంబంధించిన అవకాశాలు అందేలా అన్ని ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ సంస్థ పనిచేస్తుందని వివరించారు. బాలల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు వెంకట పద్మలత, డాక్టర్ పి. నాగ, మానస, ఏపీఎస్సీటీసీఆర్ సభ్యులు ఎం. సూర్యనారాయణ, చల్ల మధుసూదన్ రావు, మండల తహసీల్దార్ సరస్వతి, ఎస్ఐ సాదిక్, లక్కవరం ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దలీఫ్, ఐసీడీఎస్ సీడీపీఓ మల్లిక, కేఆర్ పురం సూపర్వైజర్ నయోమీ రాణి తదితరులు పాల్గొన్నారు. వేదికల్లో విద్యార్థినులు, ఉపాధ్యాయులు, వివిధ శాఖల సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





అక్వాన్ తుఫాను ముప్పు నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- నవంబర్ 17 నుంచి 20 వరకు ఏజెన్సీ ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం
- అత్యవసరమైతే తప్ప ప్రజలు ప్రయాణాలు చేయవద్దు
- వాగులు, వంకలు, నదులు దాటేందుకు ప్రయత్నించవద్దు
- జిల్లా, డివిజన్, మండల స్థాయిలో 24 గంటల కంట్రోల్ రూమ్లు ఏర్పాటు
- జిల్లా కలెక్టర్ కె దినేష్ కుమార్

ప్రజా భూమి ప్రతినిధి-రంపచోడవరం

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం 'అక్వాన్' తుఫానుగా బలపడి, తదుపరి తీవ్ర లేదా అతి తీవ్ర తుఫానుగా మారే అవకాశం ఉందని, నవంబర్ 20, 2026 నాటికి నెల్లూరు--తుని మధ్య ఆంధ్రప్రదేశ్ తీరాన్ని దాటే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (×వీణ) హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో పోలవరం జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో సూచించారు.తుఫాను ప్రభావంతో నవంబర్ 17 నుంచి 20వ తేదీ వరకు పోలవరం జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు. ముఖ్యంగా రంపచోడవరం, మారేడుమిల్లి, వై.రామవరం, గుర్తేడు, అడ్డతీగల, గంగవరం, రాజవొమ్మంగి, దేవీపట్నం మండలాలతో పాటు చింతూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

తుఫాను సమయంలో ప్రయాణాలు వద్దు వాగులు దాటువద్దు

భారీ వర్షాలు, ఈదురుగాలుల సమయంలో అత్యవసరమైతే తప్ప ప్రజలు ప్రయాణాలు చేయరాదని, పొంగిపొర్లే వాగులు, వంకలు, లోతట్టు వంతెనలు, కాజ్వేలపై నుంచి రాకపోకలు సాగించేందుకు ప్రయత్నించరాదని సూచించారు. గోదావరి, శబరి, సీలేరు నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు, భూపతిపాలెం జలాశయం పరిసర ప్రాంతాల వారు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలన్నారు. కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్న ప్రాంతాలు, శిథిలావస్థలో ఉన్న ఇళ్లు, పెద్ద చెట్ల సమీపంలో నివసించే వారు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే అధికారుల సూచనల మేరకు సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని తెలిపారు.

తెగిపడిన కరెంటు తీగలు స్తంభాలకు ప్రజల దూరంగా ఉండాలి

తెగిపడిన విద్యుత్ తీగలు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ తాకరాదని, వాటికి దూరంగా ఉండాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలు లేదా ఇతర అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే సంబంధిత శాఖ అధికారులకు లేదా జిల్లా కంట్రోల్ రూమ్కు సమాచారం అందించాలన్నారు.

రైతులు పంటలపై ముందు జాగ్రత్తలు తీసుకోవాలి

రైతులు కోతకు సిద్ధంగా ఉన్న వరి, ఉద్యాన వన పంటలను వాతావరణ పరిస్థితుల ను దృష్టిలో ఉంచుకొని సురక్షితంగా భద్రపరచుకోవాలని, కోసిన ధాన్యం తడవకుండా గోదాముల్లో లేదా టార్పాలిన్ పట్టాలతో కప్పి ఉంచాలని సూచించారు. పొలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా నీటి పారుదల కాలువలను సిద్ధం చేసుకోవాలని, పశువులు, జీవాలను బలహీనమైన షెడ్లు, లోతట్టు ప్రాంతాల్లో ఉంచకుండా సురక్షిత ప్రదేశాలకు తరలించాలని తెలిపారు.

తుఫాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు యంత్రాంగం సిద్ధం

తుఫాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టిందని కలెక్టర్ తెలిపారు. రంపచోడవరం కలెక్టరేట్, సబ్ కలెక్టరేట్, రంపచోడవరం, చింతూరు రెవెన్యూ డివిజన్లతో పాటు జిల్లాలోని మొత్తం 12 మండలాల్లో 24 గంటల పాటు పనిచేసే కంట్రోల్ రూమ్లను అప్రమత్తం చేసినట్లు పేర్కొన్నారు. పోలీస్, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, ఇరిగేషన్, వైద్య ఆరోగ్య, విద్యుత్ తదితర శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆదేశించినట్లు తెలిపారు. పునరావాస కేంద్రాలు, అత్యవసర మందులు, జేసీబీలు, నిత్యావసర సరుకులను సిద్ధంగా ఉంచాలని సంబంధిత శాఖలను ఆదేశించారు.

సోషల్ మీడియాలో వచ్చే వార్తలు నమ్మకండి

సోషల్ మీడియాలో వచ్చే నిర్ధారణలేని వార్తలు, వదంతులను ప్రజలు నమ్మరాదని, జిల్లా యంత్రాంగం మరియు భారత వాతావరణ శాఖ జారీ చేసే అధికారిక సమాచారాన్ని మాత్రమే అనుసరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. అత్యవసర సహాయం, రక్షణ చర్యల కోసం రంపచోడవరంలోని జిల్లా అత్యవసర ఆపరేషన్ కేంద్రం టోల్ ఫ్రీ నంబర్ 1800-425-4225 ను సంప్రదించాలని సూచించారు.

రాజమండ్రిలో మానవ హక్కులకై ప్రత్యేక క్యాంపు కోర్ట్



ప్రజాభూమి ప్రతినిధి-రంపచోడవరం

మానవ హక్కుల కమిషన్ క్యాంప్ కోర్టు - ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఆధ్వర్యంలో నవంబర్ 16 నుంచి 20వ తేదీ వరకు రాజమహేంద్రవరంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో క్యాంప్ కోర్టు జరుగుతుంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని తూర్పు గోదావరి, కాకినాడ, కోనసీమ, పోలవరం జిల్లాలకు చెందిన సంబంధిత శాఖల అధికారులు పూర్తి వివరాలు, అవసరమైన రికార్డులతో హాజరుకాగలరు.ఈ క్యాంపు నందు మానవ హక్కుల కమిషన్ ముందు పెండింగ్లో ఉన్న కేసులకు చెందిన కోర్టు నిర్వహణ జరుగుతుంది.తేది సమయం: 16.11.2026 నుంచి 20.11.2026 వరకు, ప్రతిరోజూ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు.

మహిళా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి - APRSA నాయకుల వినతి

ప్రజా భూమి ప్రతినిధి-రంపచోడవరం

విజయవాడలోని రెవెన్యూ భవన్లో APRSA (ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్) తొలి రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మహిళా ఉద్యోగుల సంక్షేమం, ఉద్యోగుల సమస్యల పరిష్కారం, కార్యాలయాల్లో మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై APRSA నాయకులు సంబంధిత అధికారుల దృష్టికి పలు కీలక డిమాండ్లను తీసుకెళ్లారు. ఈ సందర్భంగా APRSA రాష్ట్ర అధ్యక్షులు శ్రీ బొప్పరాజు వెంకటేశ్వర్లు నేతృత్వంలో నాయకులు వినతిపత్రాలు సమర్పిస్తూ, మహిళా ఉద్యోగులకు ప్రస్తుతం అమలులో ఉన్న ఆరు నెలల శిశు సంరక్షణ సెలవులను రెండేళ్లకు పెంచాలని, రెవెన్యూ డైరీ ప్రకటనల ప్రచురణకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, మహిళా ఉద్యోగులు పనిచేసే కార్యాలయాల్లో తగిన మరుగుదొడ్ల సౌకర్యాలు కల్పించాలని, చిన్నపిల్లలకు పాలిచ్చే మహిళా ఉద్యోగుల కోసం ప్రత్యేక పాలిచ్చే గదులను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే జూనియర్ అసిస్టెంట్లు మరియు ఇతర అర్హులైన ఉద్యోగులకు త్వరితగతిన సర్వే శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సీసీఎల్ఏ మోడెమ్ గారికి వినతిపత్రం అందజేశారు. ఉద్యోగులకు సంబంధించిన ఈహెచ్ఎస్ సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్ బకాయిలు చెల్లించడంతో పాటు పీఆర్సీ అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పోలవరం జిల్లా నుంచి పాల్గొన్న ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.కె. ఫయాజ్ భాషా మాట్లాడుతూ, పోలవరం జిల్లాలోని పలు తహసీల్దార్ కార్యాలయాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, వాటి స్థానంలో నూతన కార్యాలయ భవనాలను నిర్మించాలని కోరారు. రెండేళ్ల కాలపరిమితి పూర్తి చేసుకున్న ఉద్యోగులు మైదాన ప్రాంతాలకు బదిలీ అయినప్పుడు వెంటనే రిలీవ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఏరియర్ సప్లిమెంటరీ బిల్లుల సమర్పణ గడువును ప్రతి నెల 6వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ఉన్న పరిమితి నుంచి 6వ తేదీ నుంచి 15వ తేదీ వరకు పొడిగించాలని రాష్ట్ర కార్యవర్గాన్ని కోరారు. ఉద్యోగుల ఇతర పెండింగ్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని రాష్ట్ర కార్యవర్గ నాయకులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్.కె. ఫయాజ్ భాషా (ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ), పి. వెంకటేశ్వర్లు (మాజీ అధ్యక్షులు), వి. రవీంద్రబాబు, వి. పాల్ అలెగ్జాండర్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికల నిర్వహణపై

సమన్వయ సమావేశం

ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి..

అధికారులకు సూచించిన ఉన్నతాధికారులు



ప్రజా భూమి ప్రతినిధి-వై.రామవరం

గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఉన్నతాధికారులు సూచించారు. ఈ మేరకు స్టేజ్-1 రిటర్నింగ్ అధికారులు (ఆర్ఓలు), పంచాయతీ అభివృద్ధి అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఓటర్ల జాబితా సవరణ, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, నామినేషన్ల స్వీకరణ, ఎన్నికల సిబ్బంది కేటాయింపు, ఎన్నికల సామగ్రి సరఫరా, శాంతిభద్రతల పరిరక్షణ తదితర అంశాలపై సమీక్షించారు.ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని, విధుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి, అవకతవకలకు తావులేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులు సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.ఓటర్లకు అవసరమైన సమాచారం అందిస్తూ, ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని సూచించారు.ఈ సమావేశంలో స్టేజ్-1 రిటర్నింగ్ అధికారులు, పంచాయతీ అభివృద్ధి అధికారులు, తహసీల్దార్, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాభూమి

జనరల్

మంగళవారం, నవంబర్ 17, 2026

12



పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు నైపుణ్య శిక్షణ

❖ కెయూ విసి ఆచార్య కె. రాంజీ ❖ కృష్ణా విశ్వవిద్యాలయం, బ్లాక్‌బక్స్ సంస్థ

మధ్య అవగాహన ఒప్పందం

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం:

విద్యార్థులను మారుతున్న పారిశ్రామిక అవసరాలకు, నూతన సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా తీర్చిదిద్దే లక్ష్యంతో కృష్ణా విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌కు చెందిన బ్లాక్‌బక్స్ ఎడ్యుకేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యంలో భాగంగా విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, జనరేటివ్ ఏఐ, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్ వంటి ఆధునిక సాంకేతిక రంగాల్లో పరిశ్రమ ఆధారిత నైపుణ్య శిక్షణ అందించనున్నట్లు ఉపకులపతి ఆచార్య కె. రాంజీ పేర్కొన్నారు. అదేవిధంగా కెరీర్ రెడీనెస్ కార్యక్రమాలు, రెజ్యూమ్ బిల్డింగ్ సెషన్లు, ఇంటర్వ్యూ ప్రిపరేషన్, ప్లేస్‌మెంట్ సన్నద్ధత కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రాక్టికల్ జ్ఞానం, ప్రాజెక్ట్ ఆధారిత శిక్షణ, నిపుణుల మార్గదర్శకత్వం ద్వారా విద్యార్థుల్లో ఉద్యోగ నైపుణ్యాలను పెంపొందించడమే ఈ ఒప్పందం ప్రధాన ఉద్దేశం.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ప్రముఖ సంస్థల్లో ఇంటర్న్‌షిప్ అవకాశాలు, ప్రాజెక్టులపై పనిచేసే అవకాశం, ఉద్యోగ నియామకాలకు అవసరమైన నైపుణ్యాలు కల్పించేందుకు కృషి చేయనున్నారు. అలాగే పరిశ్రమలు, విద్యాసంస్థల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయనున్నారు.ఈ మేరకు రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ ఉష, బ్లాక్ బక్స్ ప్రతినిధులు అవగాహన ఒప్పందం పై సంతకాలు చేశారు. కార్యక్రమంలో పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య పి. వీరబ్రంహాచారి, కెయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వైకె సుందర కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బెరాకా మినిస్ట్రీస్ ఆర్థిక సాయం

ప్రజాభూమి ప్రతినిధి,
మచిలీపట్నం:





వైద్య సహాయం కోసం ఒకరికి, విద్యా సహాయం కోసం ఇద్దరికి ఆర్థిక సహాయం అందించడం జరిగింది. 1. మచిలీపట్నం, పీకేఎం కాలనీకి చెందిన వి. సైదాబీ పాప కాలు కాలినందున కాలుకు ఆపరేషన్ నిమిత్తం రూ . 25,000/- చెక్కు రూపేణా ఆర్థిక సహాయం అందిచడం జరిగినది. అలాగే మచిలీపట్నం జనశక్తీ నగర్‌కు చెందిన గోపాలరావు కుమార్తె జోష్నా బి.ఎస్సీ నర్సింగ్ చదువుచున్నది. కాలేజి ఫీజు నిమిత్తం బెరాకా మినిస్ట్రీస్ వారిని సహాయం కోరగా వారికీ కాలేజి పేరున రూ . రూ. 25,000/- చెక్కు రూపంలో ఆర్థిక సహాయం అందిచడం జరిగినది.మచిలీపట్నం భాస్కుర పురం నివాసి నాంపల్లి విజయకుమార్ కుమార్తె మహాలక్ష్మి స.ఏ చదువుకు కాలేజి ఫీజు నిమిత్తం బెరాకా మినిస్ట్రీస్ వారిని సహాయం కోరగా వారికి కాలేజి పేరున రు.20,000/- చెక్కు రూపంలో ఆర్థిక సహాయం అందిచడం జరిగినది.

డిప్యూటీ మేయర్ పదవి బీజేపీకి కేటాయించాలి

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం:



మచిలీపట్నం నగరపాలక సంస్థ 31వ డివిజన్ నుంచి ఎన్డీఏ కూటమి బలపరిచిన బీజేపీ కార్పొరేటర్ అభ్యర్థిగా పోటీ చేసిన బీజేపీ సీనియర్ రాష్ట్ర నాయకులు పంతం వెంకట గజేంద్రరావు సతీమణి పంతం వెంకట మహాలక్ష్మి విజయం సాధించారు. కూటమి ధర్మంలో భాగంగా ఆమెకు డిప్యూటీ మేయర్ పదవి కేటాయించాలని జిల్లా బీజేపీ నాయకత్వం కోరుతోంది.మచిలీపట్నం నియోజకవర్గంలో కూటమి భాగస్వామ్య పక్షాలైన టీడీపీ, జనసేనలకు పలు కీలక పదవులు దక్కాయని, బీజేపీకి మాత్రం ఇప్పటివరకు ఎలాంటి పదవి లభించలేదని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రిగా కొల్లు రవీంద్ర, ఎంపీగా బాలశౌరి, మేయర్‌గా అబ్దుల్ అబీదా బేగం, డీసీఎంఎస్ చైర్మన్‌గా బండి రామకృష్ణ, మార్కెట్ యార్డు చైర్మన్‌గా కుంచే నాని బాధ్యతలు నిర్వహిస్తున్నారని గుర్తుచేశారు.ఈ నేపథ్యంలో బీజేపీ నుంచి ఏకైక కార్పొరేటర్‌గా ఎన్నికైన పంతం వెంకట మహాలక్ష్మికి డిప్యూటీ మేయర్ పదవి కేటాయించాలని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ బాలశౌరి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావులను జిల్లా బీజేపీ నాయకత్వం కోరింది.

మంగినిపూడి బీచ్‌లో బైక్ దొంగల పట్టివేత

ముగ్గురు వాహనాలు చోరీ.. నిందితులను పోలీసులకు అప్పగించిన స్థానికులు

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం:

ప్రముఖ పర్యాటక కేంద్రమైన మంగినిపూడి బీచ్‌లో బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తులను స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. బీచ్‌కు వచ్చిన పర్యాటకుల ద్విచక్ర వాహనాలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నట్లు స్థానికులు తెలిపారు. మంగినిపూడి బీచ్‌కు వచ్చిన సందర్శకులకు చెందిన మూడు ద్విచక్ర వాహనాలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించి అక్కడి నుంచి పరారయ్యారు. వాహనాలు కనిపించకపోవడంతో బాధితులు, స్థానికులు అప్రమత్తమై పరిసర ప్రాంతాల్లో గాలింపు చేపట్టారు.

ఈ క్రమంలో గోకవరం సమీపంలో చోరీకి గురైన బైక్‌లతో వెళ్తున్న వ్యక్తులను పట్టుకున్నారు. పట్టుబడిన వారు పెడన మండలం తోటమూల గ్రామానికి చెందిన వారిగా గుర్తించినట్లు సమాచారం.అనంతరం వారిని మంగినిపూడి బీచ్ సెంటర్‌లోని బడ్డీల కూడలి వద్దకు తీసుకొచ్చి వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్, ఓట్ల లెక్కింపులో అప్రమత్తంగా వ్యవహరించాలి

నిబంధనలు పాటిస్తూ పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ నిర్వహించాలి

ప్రిసైడింగ్ అధికారులకు జిల్లా కలెక్టర్ డీకే బాలాజి సూచనలు





ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం:

గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో ప్రిసైడింగ్ అధికారులు ప్రతి అంశంపై పూర్తి అవగాహనతో, అప్రమత్తంగా వ్యవహరించాలని, ఎన్నికల నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తూ పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి ఆదేశించారు.గ్రామ పంచాయతీ 2వ సాధారణ ఎన్నికలు–2026 నిర్వహణలో భాగంగా సోమవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని ఎన్నికల పోలింగ్, ఓట్ల లెక్కింపు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పరిమిత వనరులు, తక్కువ సంఖ్యలో ఓటర్లు ఉండటంతో పాటు పోలింగ్ నిర్వహించిన సిబ్బందే ఓట్ల లెక్కింపు బాధ్యతలు కూడా నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. అందువల్ల ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, ప్రిసైడింగ్ అధికారుల, రిటర్నింగ్ అధికారుల హ్యాండ్‌బుక్‌లను పూర్తిగా అధ్యయనం చేసి, అందులోని నిబంధనలపై స్పష్టమైన అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ముఖ్యంగా చెరగని సిరాను ఎడమ చేతి చిటికెన వేలికే వేయాలని, ఈ విషయంలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని స్పష్టం చేశారు. సాధారణంగా ఇతర ఎన్నికల్లో అలవాటైన విధానంలో కాకుండా గ్రామ పంచాయతీ ఎన్నికలకు నిర్దేశించిన విధానాన్ని కచ్చితంగా అనుసరించేలా పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఇవ్వాలన్నారు. పోలింగ్ సామగ్రి పంపిణీ సమయంలో ప్రిసైడింగ్ అధికారులు తమకు అందిన ప్రతి వస్తువును క్షుణ్ణంగా తనిఖీ చేసుకోవాలని తెలిపారు. చెరగని సిరా, బ్యాలెట్ పేపర్లు, ఓటర్ల జాబితా వంటి కీలక సామగ్రి అందుబాటులో ఉన్నాయో లేదో ఒకటికి రెండుసార్లు పరిశీలించాలన్నారు. పోలింగ్ కేంద్రంలోని ఓటర్ల సంఖ్యకు సరిపడా బ్యాలెట్ పేపర్లతో పాటు అదనపు రిజర్వ్ బ్యాలెట్ పేపర్లు ఉన్నాయా, వాటి సీరియల్ నంబర్లు సక్రమంగా ఉన్నాయా అని నిర్ధారించుకోవాలని సూచించారు. ప్రతి బ్యాలెట్ పేపర్‌పై నిర్దేశించిన ప్రత్యేక గుర్తు (డిస్టింగ్విషింగ్ మార్క్) వేసి, వెనుకవైపు ప్రిసైడింగ్ అధికారి సంతకం తప్పనిసరిగా చేయాలని తెలిపారు. సంతకం, ప్రత్యేక గుర్తు లేని బ్యాలెట్ పేపర్ల వల్ల ఓట్ల లెక్కింపు సమయంలో వివాదాలు తలెత్తే అవకాశం ఉందన్నారు. గత ఎన్నికల్లో ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి బ్యాలెట్ పేపర్ విషయంలో అత్యంత జాగ్రత్త వహించాలని పేర్కొన్నారు. అదేవిధంగా బ్యాలెట్ పేపర్లకు అవసరమైన ఆర్ఓ స్టిక్స్ తగిన సంఖ్యలో అందుబాటులో ఉంచుకోవాలని, ఒక్కటి మాత్ర మే ఉండటం వల్ల పోలింగ్ ప్రక్రియకు అంతరాయం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ ఉదయం 7 గంటలకు ప్రారంభమయ్యేలా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని, సాధ్యమైనంత వరకు మధ్యాహ్నం 1 గంటలోపే ఒత్తిడి లేకుం డా పోలింగ్ ప్రక్రియను పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. ఒకేసారి అధిక సంఖ్యలో ఓటర్లు వచ్చినప్పుడు రద్దీ, జాప్యం నివారించేందుకు అవస రమైన చోట అదనపు ఓటింగ్ కంపార్ట్‌మెంట్లు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.పేపర్ సీల్ అకౌంట్, బ్యాలెట్ పేపర్ అకౌంట్‌లను అత్యంత జాగ్రత్తగా నమోదు చేయాలని, వాటిలోని సీరియల్ నంబర్ల మధ్య ఎలాంటి వ్యత్యాసం లేకుండా చూసుకోవాలని అన్నారు. ప్రిసైడింగ్ అధికారి వద్ద ఉన్న రికార్డు, పోలింగ్ ఏజెంట్లకు ఇచ్చిన వివరాలు, బ్యాలెట్ బాక్స్‌పై నమోదు చేసిన వివరాలు ఒకే విధంగా ఉండాలని స్పష్టం చేశారు. పోలింగ్ ముగిసిన అనంతరం పేపర్ సీల్ అకౌంట్, బ్యాలెట్ పేపర్ అకౌంట్, ప్రిసైడింగ్ అధికారి డైరీ తదితర ముఖ్యమైన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి, నిర్దేశిత ఫార్మాట్లలో ఎలాంటి తప్పులు లేకుండా పూర్తి చేయా లన్నారు. ఎన్నికల ప్రక్రియపై ప్రతి పోలింగ్ ఏజెం ట్‌కు నమ్మకం కలిగించడం ప్రిసైడింగ్ అధికారి ప్రధాన బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. బ్యాలెట్ బాక్స్ ఖాళీగా ఉందని ఏజెంట్ల సమక్షంలో చూపించడం, సీలింగ్ ప్రక్రియను వివరించడం, సీరియల్ నంబర్లను చూపించడం వంటి ప్రతి అంశాన్ని పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికలు కేవలం యాంత్రికంగా నిర్వహించే ప్రక్రియ కాదని, ప్రజల విశ్వాసంతో ముడిపడి ఉన్న బాధ్యత అని తెలిపారు. పోలింగ్‌తో పాటు ఓట్ల లెక్కింపు సమయంలోనూ ఏజెంట్ల సందేహాలను నివృత్తి చేస్తూ, వారికి పూర్తి విశ్వాసం కలిగించేలా వ్యవహరించాల న్నారు. పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియ మొత్తం వీడియో రికార్డింగ్‌లో ఉంటుం దని, నిబంధనల ప్రకారం విధులు నిర్వహించే అధికారులకు ఇది రక్షణగా ఉంటుందని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవ హరించే వారికి ఇబ్బందులు తప్పవని హెచ్చరిం చారు.

పోలింగ్ కేంద్రంలో ప్రిసైడింగ్

అధికారే అధినేత అయినప్పటికీ, ఏదైనా అవాంఛనీయ పరిస్థితి తలెత్తి బ్యాలెట్ పేపర్లకు భంగం కలిగించే ప్రయత్నం జరిగితే వెంటనే పోలీసు సిబ్బందిని పిలిపించడం ప్రిసైడింగ్ అధికారి బాధ్యత అని స్పష్టం చేశారు.పోలింగ్ శాతం వివరాలను ఎప్పటికప్పుడు నిర్ణీత సమయంలో నివేదించాలని, పురు షులు, మహిళా ఓటర్ల వివరాలను ప్రత్యేకంగా నమోదు చేసుకునేందుకు టాలీ షీట్‌ను ఉపయోగించాలని సూచించారు.ఓట్ల లెక్కింపు సమ యంలో బ్యాలెట్ బాక్సుల సీల్స్‌ను అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో చూపించి, సక్రమంగా ఉన్నట్లు నిర్ధారించిన తర్వాతే తెరవాలని సూచించారు. ప్రతి బ్యాలెట్ పేపర్‌ను నిబంధనల ప్రకారం పరిశీలించి, సంబంధిత బాక్సుల్లో వేస్తూ, ఓట్ల లెక్కింపును కచ్చితత్వంతో నిర్వహించాలన్నారు. ప్రతి టేబుల్ వద్ద జరుగుతున్న ప్రక్రియను ఏజెంట్లకు స్పష్టంగా తెలియజేస్తూ, వారి సందేహాలను నివృత్తి చేయాలని తెలిపారు.మాస్టర్ ట్రైనర్లుగా వ్యవహరిస్తున్న అధికారులు ఈ సూచనలన్నింటినీ ప్రిసైడింగ్ అధికారులకు స్పష్టంగా వివరించాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించేలా సిబ్బందిని సన్నద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. నిబంధనలపై అవగాహన, సమర్థవంతమైన సమాచార మార్పిడి, సంయమనంతో కూడిన వ్యవహారశైలి ఉంటే ఎన్నికల నిర్వహణలో సమస్యలు తలెత్తవ ని పేర్కొన్నారు.గ్రామ పంచాయతీ ఎన్నికల్లో స్థానికంగా అనేక సామాజిక, రాజకీయ అంశాలు ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ మరింత అప్రమత్తంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించి ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి పిలుపునిచ్చారు.కార్యక్రమంలో సహాయ కలెక్టర్ నమ్రత అగర్వాల్, జెడ్పీ సీఈవో ఎం శ్రీహరి, జిల్లా పంచాయతీ అధికారిణి ఎం ధనలక్ష్మి, జిల్లా ట్రైనింగ్ నోడల్ అధికారి డిఆర్‌డిఏ పీడీ హరిహరి నాథ్, తదితర అధికారులు, ప్రిసైడింగ్ అధికారులు పాల్గొన్నారు.



డిసెంబర్ 1 ఢిల్లీని ఆక్రమిద్దాం జయప్రదం చేయాలి

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం:

ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ)కృష్ణా జిల్లా కమిటీ మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం 42 వేల రూపాయలు ప్రభుత్వం నిర్ణయించాలని, కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని కాంట్రాక్ట్ కార్మికుల వయోపరిమితిని 62 సంవత్సరాలకు పెంచాలని, చనిపోయిన రిటైర్మెంట్ అయిన కార్మికుల ప్లేసులో వారి ఫ్యామిలీ మెంబర్స్ కి ఉద్యోగాలు ఇవ్వాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలని కోరుతూ చలో ఢిల్లీ ప్రోగ్రాం లో మున్సిపల్ కాంటాక్ట్ కార్మికులందరూ ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బూర. సుబ్రహ్మణ్యం కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఈరోజు పట్నంలో కార్మికులచే చలో ఢిల్లీ ప్రోగ్రాం సంబంధించిన గోడ పత్రికని ఆవిష్కరించడం జరిగింది ఈ కార్యక్రమంలో యూనియన్ మచిలీపట్నం అధ్యక్షురాలు సిహెచ్ బుల్లెమ్మ ప్రధాన కార్యదర్శి శిరం శెట్టి దుర్గ ప్రసన్నుడు, సిహెచ్ జయరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రాజెక్టు సంజీవనిపై జిల్లా సమన్వయ కమిటీ సమావేశం

జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సమీక్ష – కార్యక్రమ విధివిధానాలపై అధికారులకు అవగాహన



ప్రజాభూమి ప్రతినిధి,
మచిలీపట్నం:

ప్రాజెక్టు సంజీవని కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో సోమవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ప్రాజెక్టు సంజీవని లక్ష్యాలు, ఆశయాలు, అమలు విధానాలు, వివిధ శాఖల బాధ్యతలపై సమగ్రంగా చర్చించారు.ఈ సందర్భంగా ప్రాజెక్టు సంజీవని కార్యక్రమం ద్వారా ప్రజలకు అందించనున్న సేవలు, వాటి అమలులో అనుసరించాల్సిన విధివిధానాలు, శాఖల మధ్య సమన్వయం, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యల గురించి అధికారులకు వివరించారు. కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రతి శాఖ సమష్టి కృషితో పనిచేయాలని, తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు.

ఈ సమావేశంలో గూగుల్ మీట్ ద్వారా జిల్లా ఆరోగ్య సేవల సమన్వయకర్త డాక్టర్ ఏవీ శేషు కుమార్, మచిలీపట్నం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి వైద్య పర్యవేక్షకురాలు ఆర్జీ పద్మశ్రీ, మచిలీపట్నం ఆర్డీవో కే. సాంబశివరావు, గుడివాడ ఆర్డీవో జి. బాలసుబ్రమణ్యం, ఉయ్యూరు ఆర్డీవో ఎన్. కరుణకుమారి, జిల్లా విద్యాశాఖ అధికారి యు.వి. సుబ్బారావు పాల్గొన్నారు.అలాగే టాటా సంస్థ జిల్లా నాయకుడు డి. సునీల్ బాబు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.ఎల్. దయాకర్, డాక్టర్ అరుణ్ కుమార్, డాక్టర్ సౌమ్య ప్రత్యక్షంగా సమావేశంలో పాల్గొన్నారు.ప్రాజెక్టు సంజీవని కార్యక్రమం ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషించేలా సంబంధిత శాఖల అధికారులు పరస్పర సహకారంతో ముం దుకు సాగాలని సమావేశంలో చర్చించారు. ప్రజలకు ఈ కార్యక్రమం ద్వారా అందాల్సిన ప్రయో జనాలు పూర్తిస్థాయిలో చేరేలా సమన్వయంతో కార్యాచరణ రూపొందించి, నిర్దేశిత లక్ష్యాలను సాధిం చేందుకు కృషి చేయాలని నిర్ణయించారు.ప్రభుత్వ ఆరోగ్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయ డం, సమర్థవంతమైన సేవలందించడం, ప్రజారోగ్యాన్ని మెరుగుపర చడం దిశగా ప్రాజెక్టు సంజీవని కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయడానికి ఈ సమావేశం దోహదపడనుంది.

ఎన్నికల డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, ఓట్ల లెక్కింపు కేంద్రాల పరిశీలించిన కలెక్టర్ బాలాజి



ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం:

కృష్ణా జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలు – 2026 నిర్వహణలో భాగంగా, సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ డీకే బాలాజి పెనమలూరు మండలం కానూరులోని పీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో తాడిగడప మున్సిపాలిటీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, ఓట్ల లెక్కింపు కేంద్రాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో పోలింగ్ సిబ్బందికి ఎన్నికల సామగ్రి పంపిణీ చేసే ఏర్పాట్లు, పోలింగ్ అనంతరం సిబ్బంది నుంచి ఎన్నికల సామగ్రి, బ్యాలెట్ బాక్సులు స్వీకరించే రిసెప్షన్ కేంద్రం ఏర్పాట్లను పరిశీలించారు. అదేవిధంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహణకు ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాళ్లను పరిశీలించి, అక్కడ చేపట్టిన ఏర్పాట్ల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.తాడిగడప మున్సిపాలిటీ ఎన్నికలకు సంబంధించి డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలతో పాటు ఓట్ల లెక్కింపు ప్రక్రియ కూడా ఇదే కళాశాలలో నిర్వహించనున్న నేపథ్యంలో, ఎన్నికల విధులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట సహాయ కలెక్టర్ నమ్రత అగర్వాల్, తాడిగడప మున్సిపల్ కమిషనర్ నజీర్, కౌంటింగ్ నోడల్ అధికారి మార్క్ ఫెడ్ డిఎం మురళీ కిషోర్, ఇతర ఎన్నికల అధికారులు తదితరులు ఉన్నారు.

గంటల వ్యవధిలో చోరీ సొత్తు రికవరీ

నున్న సీఐ ఉమర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన బాధితులు

ప్రజా భూమి ప్రతినిధి విజయవాడ



ఈనెల15వ తేదీ నాడు నున్న గ్రామంలో చోరీ జరిగిందని నున్న పోలీసులకు సమాచారం అందడంతో, విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు ఆదేశాల మేరకు సీఐ ఉమర్, నున్న గ్రామానికి చేరుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం కారుమూరి శ్రీనివాస్ రెడ్డి అనే వ్యక్తి నున్న గ్రామంలోరామాలయం దగ్గర నివాస ఉంటున్నారు,శ్రీనివాస్ రెడ్డి, ఆంజనేయస్వామి గుడి దగ్గర భోజనానికి వెళ్ళు సమయంలో వారి ఇంటి దగ్గర అదే గ్రామా నికి చెందిన దొప్పల వెంకటేశ్వరరావు,వ్యక్తి కారుమూరి శ్రీనివాసరావు, ఇంటిదగ్గర సుమారు రెండు లక్షల రూపాయలు నగదు దొంగలించారని బాధితుడు నున్న సిఐ ఉమర్ కి సమాచారం తెలపడంతో వెంటనే మా సిబ్బందితో కలిసి సిఐ ఉమర్,నేరం జరిగిన ప్రదేశమునకు వెళ్లి పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలను పరిశీలించి సదురు నిందితున్ని గుర్తించారు. నేరం జరిగిన రెండు గంటలలో సదురు నిందితుని పట్టుకుని అతని దగ్గర నగదును రికవరీ చేసి బాధితులకు అందజేసిన సీఐ ఉమర్. దొంగలించబడ్డ సొమ్ము గంటల వ్యవధిలోనే రికవరీ చేయడం అంతేకాకుండా నున్న సీఐ ఉమర్,స్పందించిన తీరు అభినందనీయమని బాధితుడు నున్న పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

పంచాయతీ ఎన్నికల్లో కూటమి మద్దతుదారుల గెలుపునకు కృషి చేయాలి : విక్కుర్తి

ప్రజా భూమి ప్రతినిధి అవనిగడ్డ



త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో కూటమి మద్దతుదారుల గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ విక్కుర్తి శ్రీనివాసరావు సూచించారు. సోమవారం అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావుతో కలిసి మండల పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా విక్కుర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాబోయే పంచాయతీ ఎన్నికలను పార్టీ శ్రేణులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని, గ్రామస్థాయిలో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని తెలిపారు. కూటమి పార్టీల మధ్య ఐక్యతను మరింత బలోపేతం చేస్తూ, క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.కనపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రతి గ్రామంలో పార్టీ పరిస్థితులు, ఎన్నికల కార్యాచరణపై ప్రత్యేక దృష్టి సారించి కూటమి అభ్యర్థుల గెలుపునకు సమష్టిగా కృషి చేయాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని మండల పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

Printed by MK PUBLICATIONS AND OFFSET PRINTERS Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at visakhapatnam and published at D. No.k31-27-31/3,oppsite pavanpublic school,duvvada station road,kurmnnapalem, visakhapatnam, editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .RNI NO:APTEL/25/A1888.cell:9502116677.

ప్రజాభూమి

జనరల్ 13

మంగళవారం 17 నవంబర్ 2026



రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో సత్తా చాటిన మోడరన్ విద్యార్థి హర్షతేజ

ప్రజాభూమి ప్రతినిధి, రామచంద్రపురం

ఈ నెల 7వ తేదీ నుండి 9వ తేది వరకు అనంతపురం జిల్లా లేపాక్షి జవహర్ లాల్ విద్యాలయంలో రాష్ట్రస్థాయి 70వ ఎస్ జి. ఎఫ్ అండర్ -19 బాస్కెట్ బాల్ పోటీలు జరిగాయి. ఈ పోటీలలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా టీమ్ తరపున మోడరన్ జూనియర్ కాలేజీ విద్యార్థి కొడమంచిలి హర్షతేజ ప్రాతినిధ్యం వహించినట్లు మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జి.వి. రావు సోమవారం తెలిపారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాని రాష్ట్రస్థాయిలో నాలుగో స్థానంలో నిలపడంలో హర్షతేజ కీలక భూమిక పోషించినట్లు రావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం హర్షతేజను అధినేత జివి రావు, ఇంటర్మీడియట్ ప్రిన్సిపాల్ సిహెచ్ రాజేష్, పిఎటి మోహనకృష్ణ ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో హర్షతేజ గొప్ప క్రీడాకారుడిగా ఎదగాలని రావు ఆకాంక్ష వ్యక్తం చేశారు.

ఘనంగా జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ జన్మదిన వేడుకలు

- కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి సుభాష్, కూటమి అగ్రనేతలు



ప్రజాభూమి ప్రతినిధి, రామచంద్రపురం



రామచంద్రపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, కూటమి సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, రామచంద్రపురం మున్సిపల్ చైర్మన్ మేడిశెట్టి శేషారావు, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ తదితర కూటమి నాయకులు చంద్రశేఖర్‌కు పుష్పగుచ్ఛాలు అందించి, కేక్ కట్ చేసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ పోలిశెట్టి చంద్రశేఖర్ విలువలకు, నిబద్ధతకు అత్యంత ప్రాధాన్యతనిచ్చే నాయకుడని ప్రశంసించారు. కూటమి ఐక్యత, ప్రజా సంక్షేమం, పార్టీ బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. గత సార్వత్రిక ఎన్నికలతో పాటు ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ తనదైన కీలక పాత్ర పోషిస్తూ కూటమి అభ్యర్థుల విజయానికి విశేషంగా కృషి చేశారని గుర్తు చేశారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు మరింత చేరువగా ఉంటూ, ప్రజాసేవలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. సత్యం మాట్లాడుతూ కూటమి పార్టీల మధ్య ఉన్న ఐక్యత, స్నేహభావం, పరస్పర సహకారం ఇలాగే చిరకాలం కొనసాగాలని ఆకాంక్షించారు. మంచి మనసు, కలుపుగోలుతనం కలిగిన పోలిశెట్టి చంద్రశేఖర్ తనదైన శైలిలో రాజకీయాల్లో ముందుకు సాగుతూ, అందరినీ కలుపుకొని పోయే వ్యక్తిగా కూటమి కుటుంబంలో ఒక సభ్యుడిగా కలిసిపోయారని ఆనందం వ్యక్తం చేశారు. ఆయనకు భగవంతుడు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, మరిన్ని విజయాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ జన్మదిన వేడుకలు కూటమి నాయకులు, కార్యకర్తల మధ్య స్నేహపూర్వక వాతావరణంలో ఉత్సాహంగా సాగాయి. పట్టణ టిడిపి అధ్యక్షులు ఉండవెల్లి శివ, ఏఎంసి డైరెక్టర్ నారపురెడ్డి బలరాం, క్లస్టర్ 2 ఇన్చార్జి కంచుమర్తి బాబురావు, పలువురు కౌన్సిలర్లు, నాయకులు, జనసేన శ్రేణులు చంద్రశేఖర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

సర్ సి.ఆర్. రెడ్డి మహిళా కళాశాలలో 'స్పందన' సృజనాత్మక రచనా పోటీ



ప్రజాభూమి ఏలూరు

స్థానిక సర్ సి.ఆర్. రెడ్డి మహిళా కళాశాలలో లైబ్రరీ సైన్స్ విభాగం, ఐక్యూఏసీ సంయుక్త ఆధ్వర్యంలో నవంబర్ 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్న 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం 'స్పందన' సృజనాత్మక రచనా పోటీ నిర్వహించారు.ఈ పోటీలో 25 మంది విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఒక ఫోటోను నిశితంగా పరి శీలించి, అందులోని వ్యక్తులు, వస్తువులు, సంఘటనలు, పరిసరాలను ఆధారంగా చేసుకుని తమ ఊహాశక్తితో కథను రచించడం ఈ పోటీ ముఖ్య ఉద్దేశ్యం.విద్యార్థినుల్లో సృజనాత్మకత, పరిశీలనా శక్తి, రచనా నైపుణ్యాలను పెంపొందించేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహ దపడింది.ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కిలారు ప్రభాకరరావు, ప్రిన్సిపాల్ జి. సరళ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ పి. హిమబిందు పాల్గొన్నారు.

అవకాశం ఇస్తే... అభివృద్ధి చేసి చూపిస్తా...

- గ్రామస్తుల మద్దత్తుతో కాజులూరు సర్పంచ్ బరిలో వట్టూరి
- త్రాగునీరు, వైద్యం, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత
- గ్రామాభివృద్ధే లక్ష్యంగా ఓటర్లు తో మమేకమౌతున్న సర్పంచ్ అభ్యర్థి





ప్రజాభూమి ప్రతినిధి,కాజులూరు

కాజులూరు మేజర్ పంచాయితీ సర్పంచ్ గిరికి ఎన్నికలబరిలో జనసేనకు సంబంధించిన ఇద్దరు జనసైనికుల మధ్య ఆసక్తికరంగా పోరు జరగనుందని కాజులూరు గ్రామంలో ప్రచారం జోరందుకుంది.నామినేషన్ల ఘట్టం రాకముందే ఇక్కడ గ్రామంలో సుమారు 9వేల ఓటర్లను ఆకట్టుకునేందుకు మండలకేంద్రమైన కాజులూరులో సర్పంచ్ పదవిని దక్కించుకునేందుకు ఆ ఇద్దరు అభ్యర్థులు వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నారు. ఈ నేపథ్యంలో కూటమి నాయకులు, గ్రామస్తుల మద్దత్తుతో వట్టూరి పట్టాభిరామయ్య సర్పంచ్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచి తన అనుచరులతో గ్రామంలో ఓటర్లను ఆకర్షించేందుకు ఇంటింటికి తిరిగి తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరుతూ ప్రచారం కొనసాగిస్తున్నారు. మరోవైపు సొసైటీ చైర్మన్ యాళ్ల వెంకటరమణ కూడా ఉమ్మడి కూటమి అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. 16 వార్డులు కలిగిన ఈ పంచాయతీ సర్పంచ్ పదవికి జనరల్ కేటగిరీ కేటాయించిన నేపథ్యంలో ప్రస్తుతం నామినేషన్లు ఘట్టం ప్రారంభం కాకుండానే ఇద్దరు అభ్యర్థులు గ్రామంలో తమ తమ వ్యూహాలు సిద్ధం చేసుకుని ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

గ్రామాభివృద్ధే లక్ష్యంగా ప్రచారం: వట్టూరి పట్టాభి

సర్పంచ్ పదవికి బరిలోకి దిగనున్న వట్టూరి పట్టాభిరామయ్య గ్రామాభివృద్ధే లక్ష్యంగా తన అనుచరులతో ప్రచారం కొనసాగిస్తూ ఓటర్ల ముందుకు వెళ్లి తనకు ఒక్క అవకాశం ఇస్తే గ్రామ అభివృద్ధి చేసి చూపిస్తానని ముఖ్యంగా త్రాగునీరు, డ్రైనేజీ సమస్య, వైద్యం వంటి ప్రధాన అంశాలతో పాటు మండల కేంద్రానికి ఏపీఎస్ఆర్టీసీ సౌకర్యాన్ని సైతం కలుగజేసి శ్రీశక్తి పథకాన్ని మహిళలకు అందజేస్తానని హామీ ఇస్తూ ముందుకు సాగుతున్నారు.అలాగే అయన కుటుంబానికి కాజులూరు గ్రామంలో రైతాంగంతో సుదీర్ఘ అనుబంధం ఉందని,తన తండ్రి టీడీపీలో కొనసాగుతూ సుమారు 40 ఏళ్లపాటు గ్రామంలో ఎరువులు, పురుగుమందుల డీలర్ పనిచేశారని అభ్యర్థి పట్టాభి రామయ్య పేర్కొన్నారు. రైతులకు నిత్యం అందుబాటులో ఉంటూ వ్యవసాయపరమైన సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందించే వారిని ఈసందర్భంగా గుర్తుచేశారు. రైతులతో ఏర్పడిన ఆత్మీయ సంబంధాలు తమ కుటుంబానికి గ్రామంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చాయని పేర్కొన్నారు. తండ్రి మరణానంతరం తాను అదే వ్యాపారాన్ని కొనసాగిస్తూ రైతులకు ఎరువులు, పురుగుమందులు అందించడంతో పాటు ధాన్యం కొనుగోలు వ్యాపారం కూడా నిర్వహిస్తున్నట్లు వివరించారు. రైతుల కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉంటూ వారి అవసరాలకు అందుబాటులో ఉండటమే తన కుటుంబ సంప్రదాయమని, తండ్రి చూపిన సేవా మార్గంలోనే తాను కూడా ముందుకు సాగుతున్నట్లు పట్టాభి రామయ్య స్పష్టం చేశారు. కాజులూరు గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందని పట్టాభి తెలిపారు. 16 వార్డుల్లో ఆయా చోట్ల వార్డు మెంబర్ల ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వార్డులవారీగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు తగిన ప్రణాళిక సిద్ధం చేస్తానని చెప్పారు.ప్రజాసేవే లక్ష్యం.. అభివృద్ధికి కట్టుబడి ఉంటా.. రాజకీయాలపై ఆసక్తితో పాటు ప్రజలకు సేవ చేయాలనే బలమైనఆకాంక్ష తనకు ఉందని పట్టాభిరామయ్య పేర్కొన్నారు. గ్రామస్తులు తనకు ఒక్కసారి అవకాశం కల్పిస్తే పదవిని అలంకారంగా కాకుండా బాధ్యతగా భావించి పనిచేస్తానన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తుల ప్రోత్సాహంతో ఎన్నికల బరిలోకి దిగుతున్నానని, అన్ని వార్డుల్లోనూ ప్రజల ఆదరణ పొందే బలమైన అభ్యర్థులను నిలబెట్టేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధ్యం, తాగునీరు, రవాణా, వైద్య సదుపాయాల మెరుగుదలకు ప్రాధాన్యతనిస్తూ కాజులూరును అభివృద్ధి పథంలో నడిపించడమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.రైతులతో ఉన్న సుదీర్ఘ అనుబంధం, గ్రామ సమస్యలపై అవగాహన, అభివృద్ధి పట్ల తనకున్న సంకల్పాన్ని ప్రజల ముందుంచుతూ ఓటర్ల మద్దత్తుతో కోరుతూ అభ్యర్థి పట్టాభి రామయ్య ముందుకు సాగుతున్నారు. ఏదిఏమైనా ఇక్కడ మాత్రం పోటీ ఇద్దరు జనసైనికుల మధ్య జరగనున్న పోటీ స్థానిక రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది.

వాడపల్లి ధర్మకర్త పదవికి కాసా చాముండేశ్వరి రాజీనామా

- కేతరాజుపల్లి సర్పంచ్‌గా పోటీ చేసేందుకు నిర్ణయం



ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట

కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్త కాసా చాముండేశ్వరి తన పదవికి రాజీనామా చేశారు. బీసీ మహిళ కోటాలో భాగంగా ప్రభుత్వం ఆమెను దేవస్థానం ధర్మకర్తగా నియమించింది. అయితే, ప్రస్తుతం జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రావులపాలెం మండలం కేతరాజుపల్లి గ్రామ సర్పంచ్ పదవి బీసీ మహిళకు రిజర్వు కావడంతో, కూటమి అభ్యర్థిగా పోటీ చేసేందుకు ఆమె సిద్ధమయ్యారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎన్నికల్లో పోటీ చేయాలంటే నామినేటెడ్ పదవికి రాజీనామా చేయాల్సి ఉండటంతో, కాసా చాముండేశ్వరి ధర్మకర్త పదవికి రాజీనామా చేసి ఉన్నతాధికారులకు సమర్పించారు. ఈ విషయంపై దేవస్థానం ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు మాట్లాడుతూ, కాసా చాముండేశ్వరి సమర్పించిన రాజీనామాను దేవాదాయ శాఖ కమిషనర్‌కు పంపించామని, అక్కడ రాజీనామాకు ఆమోదం లభించినట్లు తెలిపారు.

రాజకీయాల్లోకి యువత.. కొత్త ముఖాలకు అవకాశం

- సీనియర్లకే ప్రాధాన్యమా.. యువతకు ప్రోత్సాహం ఎప్పుడు?





ప్రజాభూమి ప్రతినిధి, తాళ్లపూడి

యువత రాజకీయాల్లోకి రావాలని నాయకులు తమ ప్రసంగాల్లో పదేపదే పిలుపునిస్తుంటారు. అయితే ఆచరణలో మాత్రం యువతకు రాజకీయాల్లో తగిన ప్రాధాన్యం కల్పించే నాయకులు, తమ స్థానాలను వదులుకుని కొత్తతరానికి అవకాశమిచ్చే వారు చాలా అరుదుగా కనిపిస్తున్నారు. రిజర్వేషన్ల కారణంగా అక్కడక్కడా యువతకు అవకాశం లభిస్తున్నప్పటికీ, స్వచ్ఛందంగా యువతను ప్రోత్సహించి రాజకీయాల్లో ముందుకు తీసుకువచ్చే పరిస్థితులు అంతగా కనిపించడం లేదు. ఎన్నికలు సమీపించగానే అభ్యర్థుల ఎంపికలో సీనియారిటీ, ఆర్థిక స్థోమత, ఎన్నికల ఖర్చులు భరించే సామర్థ్యం వంటి అంశాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కానీ గ్రామానికి, వార్డుకు తాను ఏం చేయగలను? ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎలా పరిష్కరించగలను? అనే అభివృద్ధి ఆలోచనలతో ముందుకు వచ్చే ఆశావహులు మాత్రం తక్కువగానే కనిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో తాళ్లపూడి మండలంలో జరుగుతున్న పంచాయతీ ఎన్నికల్లో యువతతో పాటు కొత్త ముఖాలు కూడా సర్పంచ్ అభ్యర్థులుగా బరిలోకి దిగడం ఆసక్తికరంగా మారింది. ఇందులో భాగంగా ప్రక్కిలంక గ్రామం నుంచి గతంలో ప్రత్యక్ష రాజకీయాలతో సంబంధం లేని విద్యావంతుడు జొన్నకూటి ప్రమోద్ కుమార్ సర్పంచ్ అభ్యర్థిగా ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. గ్రామానికి సేవ చేయాలనే సంకల్పంతో పాటు, గ్రామ అభివృద్ధిలో భాగస్వామి కావాలనే ఆశయంతో రాజకీయ రంగ ప్రవేశం చేశారు. అలాగే వేగేశ్వరపురం గ్రామంలో తన తండ్రి గతంలో పేద ప్రజలకు అండగా నిలుస్తూ పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళా రిజర్వేషన్ నేపథ్యంలో తైలం సత్యాదేవి గ్రామ ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో సర్పంచ్ ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. ఈమె కూడా విద్యావంతురాలే కావడం విశేషం. మొత్తానికి తాళ్లపూడి మండలంలో కొత్తతరం, విద్యావంతులు స్థానిక రాజకీయాల్లోకి అడుగుపెడుతుండటం శుభపరిణామంగా భావించవచ్చు. రాజకీయాలు అంటే కేవలం పదవులు, అధికారం, ఆర్థిక బలం మాత్రమే కాదని, ప్రజాసేవ చేయాలనే సంకల్పం, గ్రామాభివృద్ధిపై స్పష్టమైన ఆలోచన కూడా ముఖ్యమని ఈ కొత్త అభ్యర్థుల ప్రవేశం చాటుతోంది. సీనియర్ నాయకులు యువతకు ప్రోత్సాహం అందించి అవకాశాలు కల్పిస్తే గ్రామీణ రాజకీయాల్లో కొత్త మార్పులకు నాంది పలికే అవకాశం ఉంది.



నామినేషన్ కేంద్రాలపై ఎస్పీ నిఘా..

- భద్రతా ఏర్పాట్లపై క్షేత్రస్థాయి పరిశీలన!
- అభ్యర్థులు, అనుచరుల రాకపై ఆంక్షలు.. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: ఎస్పీ తుహిన్ సిన్హా

ప్రజా భూమి ప్రతినిధి,అనకాపల్లి

పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా సాగేందుకు అనకాపల్లి జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ క్రమంలో మొదటి విడత రెండో రోజు నామినేషన్ల స్వీకరణను జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఐపీఎస్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనకాపల్లి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తూరు, అనకాపల్లి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రేబాక గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను సందర్శించి భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేశారు. నామినేషన్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. కేంద్రాల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి, నామినేషన్ దాఖలు చేసేందుకు వచ్చే అభ్యర్థితో పాటు మద్దతుగా మరో ఇద్దరికి మాత్రమే లోపలికి అనుమతి కల్పిస్తున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని పోలీసు సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు ఒకేసారి నామినేషన్ కేంద్రాలకు రాకుండా వేర్వేరు సమయాలు కేటాయించేలా చూడాలని సూచించారు. కేంద్రాల వద్ద ప్రజలు, కార్యకర్తలు గుమికూడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ వేగవంతంగా జరిగేలా రిటర్నింగ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామని ఎస్పీ హెచ్చరించారు. పంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అభ్యర్థులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ తనిఖీల్లో అనకాపల్లి రూరల్ సీఐ అశోక్ కుమార్, అనకాపల్లి టౌన్ సీఐ ప్రేమ కుమార్, ఎస్సైలు రవికుమార్, వెంకటేశ్వరరావు తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పరవాడ సర్పంచ్ బరిలో షేక్ మీరాభి

- నామినేషన్ దాఖలుతో ఎన్నికల సమరానికి శ్రీకారం!



ప్రజా భూమి ప్రతినిధి,పరవాడ

అనకాపల్లి జిల్లా పరవాడ మండల కేంద్రమైన పరవాడ గ్రామంలో సర్పంచ్ ఎన్నికల సందడి ఊపందుకుంది. ఈ నేపథ్యంలో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న షేక్ మీరాభి సోమవారం తన నామినేషన్ పత్రాలను విజయవంతంగా దాఖలు చేశారు. పరవాడలోని పంచాయతీరాజ్ కార్యాలయంలో సంబంధిత ఎన్నికల అధికారి (ఏఓ)కు ఆమె నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో చింతాడ సూర్యం, పెంటారావు, బి. పద్మ పాల్గొని షేక్ మీరాభికి మద్దతుగా నిలిచారు. నామినేషన్ దాఖలు ప్రక్రియ పూర్తికావడంతో షేక్ మీరాభి అధికారికంగా సర్పంచ్ ఎన్నికల బరిలో నిలిచారు. ఈ కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో ముగిసింది. గ్రామంలో ఎన్నికల వాతావరణం రోజురోజుకూ ఆసక్తికరంగా మారుతోంది.

ప్రజాభూమి

జనరల్ 14

మంగళవారం 17 నవంబరు 2026

నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన
పోలవరం జిల్లా ఎస్పీ కే. చక్రవర్తి ఐపీఎస్



ప్రజా భూమి ప్రతినిధి-అడ్డతీగల

గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా పోలవరం జిల్లా పోలీస్ శాఖ అప్రమత్తమైంది. ఇందులో భాగంగా మొదటి విడత ఎన్నికలకు సంబంధించి అడ్డతీగల, రాజవొమ్మంగి, గంగవరం, రంపచోడవరం, దేవీపట్నం మండలాల్లోని నామినేషన్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ కే. చక్రవర్తి ఐపీఎస్ ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా నామినేషన్ కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు, భద్రతా చర్యలను తనిఖీ చేసి విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. నామినేషన్ ప్రక్రియ పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. నామినేషన్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. సమస్యాత్మక, సున్నితమైన ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచి నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఎన్నికలు ప్రశాంతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించేందుకు అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.ఈ పరిశీలనలో ఎస్పీతో పాటు ఎస్‌బీ సీఐ బి. ప్రసాద్, అడ్డతీగల సీఐ ఎం. గజేంద్ర కుమార్, ఎస్సై బి. వినోద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ సారా బట్టీపై పోలీసుల దాడి

-80 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం.. 450 కిలోల బెల్లం స్వాధీనం



ప్రజా భూమి ప్రతినిధి-రాజవొమ్మంగి

పోలవరం జిల్లాలో అక్రమ సారా తయారీ, విక్రయాల నియంత్రణే లక్ష్యంగా పోలీసులు ప్రత్యేక దాడులు నిర్వహించారు. జిల్లా ఎస్పీ కే. చక్రవర్తి ఐపీఎస్ ఆదేశాల మేరకు రాజవొమ్మంగి మండలంలోని సుబ్బంపాడు గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన అక్రమ సారా బట్టీపై ప్రత్యేక పోలీస్ బృందం దాడి చేసింది.రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్ పరిధిలోని దూసరపాము పంచాయతీ, సుబ్బంపాడు గ్రామ సమీపంలోని చేను మకాంలో ఎస్సై షరీఫ్ ఆధ్వర్యంలో ఈ దాడులు చేపట్టారు. ఈ సందర్భంగా అక్రమంగా సారా తయారు చేస్తున్న బోయిన కృష్ణ ప్రసాద్ (29), తండ్రి గవర్ రాజును పోలీసులు గుర్తించారు.అక్కడ ఏర్పాటు చేసిన అక్రమ సారా బట్టీని ధ్వంసం చేయడంతో పాటు సారా తయారీకి సిద్ధంగా ఉంచిన సుమారు 80 లీటర్ల బెల్లపు ఊటను, తయారీకి ఉపయోగించే పాత్రలను ధ్వంసం చేశారు. అదేవిధంగా 45 బాక్సుల్లో నిల్వ ఉంచిన సుమారు 450 కిలోల బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు.ఈ ఘటనపై రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి సంబంధిత వ్యక్తిపై చట్టపరమైన చర్యలు చేపట్టారు. జిల్లాలో అక్రమ సారా తయారీ, విక్రయాలపై నిరంతర నిఘా కొనసాగిస్తున్నామని, ఇలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.ఈ దాడుల్లో ప్రత్యేక పోలీస్ బృందంతో పాటు ఎస్సై షరీఫ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అక్వాన్ తుపానుపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజలకు ఎస్పీ కే. చక్రవర్తి హెచ్చరిక.. అత్యవసర సహాయం కోసం 112కు ఫోన్ చేయాలి



ప్రజా భూమి ప్రతినిధి-రంపచోడవరం

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుపానుగా మారే అవకాశం ఉందని, నవంబర్ 17 నుంచి 21 వరకు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో పోలవరం జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ కే. చక్రవర్తి ఐపీఎస్ సూచించారు. తుపాను ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.ముఖ్యంగా అటవీ, కొండ ప్రాంతాలు, వాగులు, వంకలు, సెలయేర్లు అధికంగా ఉన్న ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. భారీ వర్షాల కారణంగా రహదారులపై చెట్లు కూలిపడే అవకాశం ఉన్నందున వాటిని తక్షణమే తొలగించి రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నదీ పరివాహక, లోతట్టు ప్రాంతాల్లో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, ప్రమాదకరమైన వాగులు, వంకలు, కల్వర్టుల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ప్రజలు అటువైపు వెళ్లకుండా అప్రమత్తం చేయాలని ఆదేశించారు.

డ్రోన్ కెమెరాల ద్వారా తుపాను ప్రభావిత ప్రాంతాల పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, అత్యవసర సహాయక చర్యలకు పోలీస్ సిబ్బంది అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. మూగజీవాలు, వన్యప్రాణులకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, వాగులు, వంకలు, నదులు దాటేందుకు ప్రయత్నించవద్దని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. నిత్యావసర సరుకులు, తాగునీటిని ముందుగానే సిద్ధం చేసుకోవాలని, మొబైల్ ఫోన్లను ఛార్జింగ్ చేసుకోవాలని సూచించారు. విద్యుత్ స్తంభాలు, తెగిపడిన విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని, అధికారుల హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని కోరారు.తుపాను సమయంలో ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని, ఎలాంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా ప్రజలకు పోలీస్ శాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆపద సమయంలో వెంటనే 112 నంబర్‌కు ఫోన్ చేసి పోలీసుల సహాయం పొందాలని జిల్లా ఎస్పీ కే. చక్రవర్తి కోరారు.

చింతూరు డివిజన్‌లో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

- ప్రమాదకర ప్రాంతాలు, బ్లాక్ స్పాట్లను సంయుక్తంగా పరిశీలించిన ఐటీడీఏ పీవో, పోలీస్ మరియు సంబంధిత శాఖల అధికారులు
- డిసెంబర్ నుంచి డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్‌పై కఠిన తనిఖీలు
- వాహనదారులు 15 రోజుల్లోగా తప్పనిసరిగా నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలి: ఐటీడీఏ పీవో



ప్రజా భూమి ప్రతినిధి-చింతూరు

చింతూరు డివిజన్ పరిధిలో ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా చోటుచేసుకుంటున్న నేపథ్యంలో, ప్రమాదాల నివారణకు మరియు ప్రజల ప్రాణ రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మరియు చింతూరు సబ్ కలెక్టర్ శ్రీ చిట్టపులి నరేంద్ర పడాల్, ఐఏఎస్ గారు తెలిపారు.ఈ నేపథ్యంలో సోమవారం చింతూరు డివిజన్ పరిధిలో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలు, ప్రమాదకర మలుపులు మరియు గుర్తించిన బ్లాక్ స్పాట్లను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శ్రీ చిట్టపులి నరేంద్ర పడాల్, ఐఏఎస్ గారు, చింతూరు డీఎస్పీ శ్రీ ఉదయ్ పావని, చింతూరు సీఐ, చింతూరు తహశీల్దార్ , నేషనల్ హైవే అసిస్టెంట్ ఇంజనీర్ తదితర అధికారులతో కలిసి సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్న ప్రాంతాల్లో రహదారుల పరిస్థితి, ప్రమాదకర మలుపులు, రోడ్డు మార్గాల వెడల్పు, వాహనాల రాకపోకలు, రహదారి సూచిక బోర్డులు, హెచ్చరిక బోర్డులు తదితర అంశాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రమాదాలకు దారితీస్తున్న కారణాలను గుర్తించి, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై చర్చించారు.

రోడ్డు భద్రతకు ప్రత్యేక చర్యలు

రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు నేషనల్ హైవే అధికారులు పలు కీలక సూచనలు చేశారు. ప్రమాదకర మలుపులు మరియు బ్లాక్ స్పాట్ల వద్ద అవసరమైన హెచ్చరిక బోర్డులు, రోడ్డు భద్రతా సూచికలు ఏర్పాటు చేయడం, వాహనదారులకు ముందస్తు సమాచారం అందించేలా చర్యలు తీసుకోవడం, అవసరమైన చోట రహదారి భద్రతా మెరుగుదలలు చేపట్టడం వంటి అంశాలను పరిశీలించారు.ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో సంబంధిత శాఖల సమన్వయంతో తగిన రక్షణ చర్యలు చేపట్టి, రోడ్డు ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించేందుకు కృషి చేయాలని ఐటీడీఏ పీవో అధికారులకు సూచించారు.

డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ తప్పనిసరి

ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో మాట్లాడుతూ, చింతూరు డివిజన్ పరిధిలో వాహనాలు నడుపుతున్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ప్రతి వాహనానికి చట్టబద్ధమైన రిజిస్ట్రేషన్ ఉండాలని స్పష్టం చేశారు.డ్రైవింగ్ లైసెన్స్ లేని వారు, వాహన రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోని వారు వెంటనే స్పందించి 15 రోజుల్లోగా సంబంధిత ఆర్టీఓ కార్యాలయం ద్వారా అవసరమైన నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు.అలాగే, డిసెంబర్ నెల నుంచి పోలీస్ శాఖ మరియు రవాణా శాఖ అధికారులు డివిజన్ పరిధిలో తరచుగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించను న్నారని, ఈ తనిఖీలను కఠినంగా అమలు చేయనున్నట్లు తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేదా వాహన రిజిస్ట్రేషన్ లేకుండా వాహనాలు నడిపే వారిపై నిబంధనల ప్రకారం జరిమానాలు మరియు ఇతర చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు.

అడ్డతీగలలో పంచాయతీ ఎన్నికల వేడి.. రెండో రోజు హోరాహోరీ!

కూటమి అభ్యర్థుల ఖరారుపై గందరగోళం.. అధికారిక మద్దతు ఎవరికో? రెబల్స్‌గా బరిలోకి దిగుతున్న నేతలెవరు?

ప్రజా భూమి ప్రతినిధి-అడ్డతీగల

అడ్డతీగల మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల పర్వం రాజకీయ వేడిని రాజేస్తోంది. రెండో రోజు నామినేషన్ల స్వీకరణకు అభ్యర్థులు భారీగా తరలిరావడంతో మండలంలోని ఏడు నామినేషన్ కేంద్రాలు కిటకిటలాడాయి. సర్పంచ్ పదవులతో పాటు వార్డు సభ్యుల స్థానాలకు కూడా పోటీ తీవ్రంగా కనిపించింది. గ్రామాల్లో ఎన్నికల వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది.ఉదయం 10 గంటలకు ప్రారంభమైన నామినేషన్ల స్వీకరణ గడువు ముగిసే సమయం దాటినా అభ్యర్థుల రద్దీ తగ్గలేదు. సాయంత్రం 5 గంటల్లోపు కేంద్రాలకు చేరుకున్న వారికి టోకెన్లు అందజేయడంతో రాత్రి వరకు నామినేషన్ల స్వీకరణ కొనసాగింది. తమ రాజకీయ బలాన్ని నిరూపించుకోవాలనే పట్టుదలతో పలువురు అభ్యర్థులు పోటాపోటీగా నామినేషన్లు దాఖలు చేశారు.

కూటమిలో సీట్ల సర్దుబాటు ఎక్కడ?

మండలంలో అసలు రాజకీయ చర్చ మాత్రం కూటమి అభ్యర్థుల ఎంపిక చుట్టూనే తిరుగుతోంది. కూటమి ప్రభుత్వం తరఫున తమకు అభ్యర్థిత్వం ఖరారైందంటూ కొందరు నామినేషన్లు దాఖలు చేయగా, మరికొందరు కూటమి సమన్వయ నిర్ణయాలను పక్కనపెట్టి పోటీకి దిగినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. దీంతో గ్రామస్థాయిలో కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు ఎంతవరకు అమలవుతుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ఒకే పంచాయతీలో కూటమి మద్దతు తమకేనంటూ పలువురు అభ్యర్థులు ముందుకు రావడం రాజకీయ సమీకరణాలను మరింత ఆసక్తికరంగా మార్చింది. అధిష్ఠానం నిర్ణయాన్ని గౌరవించి కొందరు బరిలో నుంచి తప్పుకుంటారా? లేక చివరి వరకు పోటీలో కొనసాగుతారా? అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

ఉపసంహరణలే అసలు రాజకీయ పరీక్ష!

ప్రస్తుతం నామినేషన్లు దాఖలు చేసిన వారంతా చివరి వరకు బరిలో ఉంటారా? లేక పార్టీ పెద్దల బుజ్జగింపులతో కొందరు వెనక్కి తగ్గుతారా? అనేది వేచి చూడాల్సిందే. ముఖ్యంగా కూటమి పార్టీల మధ్య సమన్వయం, స్థానిక నాయకుల పట్టుదల, గ్రామస్థాయి రాజకీయ బలాబలాలు ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపే అవకాశముంది.మొత్తానికి అడ్డతీగల మండలంలో రెండో రోజు నామినేషన్లతో ఎన్నికల రాజకీయం రసవత్తరంగా మారింది. నామినేషన్ల ఘట్టం ముగిసిన తర్వాత ఉపసంహరణల సమయంలోనే అసలు రాజకీయ చిత్రం స్పష్టమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. చివరకు ఎవరు బరిలో నిలుస్తారు? ఎవరు వెనక్కి తగ్గుతారు? కూటమి మాట నెగ్గుతుందా? లేక స్థానిక నేతల పంతమే పైచేయి సాధిస్తుందా? అన్నది ఇప్పుడు మండల రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

నామినేషన్ కేంద్రాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించిన డీఎస్పీ అష్రఫ్ అలీ

- అధికారులతో సమీక్ష.. నామినేషన్ల ప్రక్రియపై ఆరా..
- పోలీసు సిబ్బందికి పలు సూచనలు



ప్రజా భూమి ప్రతినిధి-రాజవొమ్మంగి

రాజవొమ్మంగి మండల కేంద్రంలోని నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని రంపచోడవరం డీఎస్పీ అష్రఫ్ అలీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా నామినేషన్ కేంద్రంలో చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించి, అక్కడి పరిస్థితులపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.

రాజవొమ్మంగి పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి నామినేషన్ల స్వీకరణకు సంబంధించి చేస్తున్న ఏర్పాట్లు, ప్రక్రియ కొనసాగుతున్న తీరుపై వివరాలు తెలుసుకున్నారు. నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చిన అభ్యర్థులతోనూ మాట్లాడి, వారికి అందుతున్న సౌకర్యాలు, ఎదురవుతున్న ఇబ్బందుల గురించి ఆరా తీశారు.అనంతరం అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందితో మాట్లాడి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు.

నామినేషన్ కేంద్రం వద్ద క్రమశిక్షణ పాటించేలా చూడాలని, అభ్యర్థులు, వారి వెంట వచ్చే వ్యక్తుల రాకపోకలను నిబంధనలకు అనుగుణంగా నియంత్రించాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో రాజవొమ్మంగి సీఐ ఎన్. సన్యాసినాయుడు, ఎస్సై కె. షరీఫ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో అడవి దున్న మృతి

విషపూరితమైన అడవి పురుగును తినడం వల్లే మృతి చెందినట్లు అధికారుల వెల్లడి



ప్రజా భూమి ప్రతినిధి-మారేడుమిల్లి

పోలవరం జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో అడవి దున్న మృతిచెందింది. మండలంలోని ఉత్తలూరు రోడ్డు మార్గంలో స్థానిక వుడ్ రిసార్ట్ సమీపంలో అడవి దున్న మృతదేహాన్ని అటవీ శాఖ అధికారులు గుర్తించారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మేత మేస్తున్న సమయంలో అడవిలోని విషపూరితమైన పురుగును తినడం వల్ల అడవి దున్న మృతిచెందినట్లు సంబంధిత రేంజ్ అధికారి వెల్లడించారు.అనంతరం పశువైద్యుల ఆధ్వర్యంలో మృతిచెందిన అడవి దున్నకు పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం ప్రక్రియ పూర్తయిన తర్వాత అటవీ శాఖ అధికారులు గొయ్యి తవ్వి మృతదేహాన్ని పూడ్చివేశారు.

గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల డ్రోన్ టెక్నాలజీతో విస్తృత నిఘా

ప్రశాంత వాతావరణంలో నామినేషన్ల ప్రక్రియ నిర్వహణకు పటిష్ట భద్రతా చర్యలు.

ప్రజా భూమి ప్రతినిధి-చిత్తూరు

గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ నేపథ్యంలో జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ఐపీఎస్ ఆదేశాల మేరకు చిత్తూరు జిల్లా వ్యాప్తంగా పోలీసులు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు డ్రోన్ టెక్నాలజీని వినియోగిస్తూ విస్తృత నిఘా ఏర్పాటు చేశారు.నామినేషన్ కేంద్రాల పరిసర ప్రాంతాలు, రద్దీగా ఉండే ప్రదేశాలు, సమస్యాత్మక ప్రాంతాలపై డ్రోన్ల ద్వారా నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, నామినేషన్ల ప్రక్రియకు ఎలాంటి ఆటంకం కలిగించరాదని జిల్లా పోలీసులు సూచించారు.



ఎన్నికల సమయం లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పోలీసులకు సహకరించి గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగేలా సహకరించాలని చిత్తూరు జిల్లా పోలీస్ శాఖ విజ్ఞప్తి చేస్తోంది.